అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

బుధవారం 3-1-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 03 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు వెల : 6.50

గ్రామీణ ఉపాధి హామీ చట్టంపైనే దాడి

- ఆధార్ ప్రాతిపదికన చెల్లింపులపై సీపీఐ(ఎం) విమర్శ

న్యూఢిల్లీ : గ్రామీణ ఉపాధి హామీకి ఆధార్‌ను తప్పనిసరి చేయడమంటే చట్టంపైనే దాడి చేయడమని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో విమర్శించింది. డిమాండ్ ప్రాతిపదికన గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ కల్పించే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంఎన్ఆర్ఈజీఏ) పట్ల మోడీ ప్రభుత్వం ఇటీవల తీసుకున్న చర్యను తీవ్రంగా విమర్శిస్తూ ఈ మేరకు ఒక ప్రకటన జారీ చేసింది. ఈ చర్య కోట్లాదిమంది కార్మికుల హక్కును లాగేసుకోవడమేనని పేర్కొంది. పైగా ఆధార్ ప్రాతిపదిక చెల్లింపు వ్యవస్థ (ఏబీపీఎస్)కు గడువు కూడా డిసెంబరు 31తో ముగిసింది. ఈ చట్టం కింద ప్రతి గ్రామీణ కార్మికునికి

...13లో

రాయదుర్గం - ఎయిర్‌పోర్ట్ మెట్రో ఆపండి...

పాతబస్తీకి విస్తరణ చేపట్టండి : సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మెట్రో రైలు రెండో దశ ప్రతిపాదనలపై డీపీఆర్‌తో పాటు ట్రాఫిక్ అధ్యయనాలను త్వరగా పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రాయదుర్గం-ఎయిర్‌పోర్టు మెట్రో ప్రతిపాదనను పెండింగ్‌లో పెట్టాలని ఆదేశించారు. మెట్రో విస్తరణపై సీఎం ఉన్నతాధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న మార్గాలు, కొత్త ప్రణాళికలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎల్బీనగర్-హయత్‌నగర్, మియాపూర్-పటాన్‌చెరు, రాయదుర్గం-ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, ఎంజీబీఎస్-ఎయిర్‌పోర్టు, నాగోల్- రాజేంద్రనగర్ మార్గాల్లో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పాతబస్తీ మెట్రోపై స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించాలని సూచించారు. అక్కడి మార్గాల్లో 103 మత పరమైన, చారిత్రక కట్టడాలపై ఎలాంటి ప్రభావం పడకుండా రోడ్డు విస్తరణ చేపట్టాలని సీఎం ఆదేశించారు.

సమీక్షా సమావేశంలో హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ఎమ్‌డీ ఎన్వీఎస్ రెడ్డి ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ దారుల్‌షిఫా నుంచి ఫలక్‌నుమా జంక్షన్ వరకు 100 అడుగుల రోడ్డు కోసం పరిశీలించాలని సూచించారు. ఓఆర్ఆర్ అందుబాటులో ఉన్నందున గత ప్రభుత్వం రాయదుర్గం నుంచి శంషాబాద్ వరకు

...5లో



గృహలక్ష్మి రద్దు..

- ఆ స్థానంలో అభయహస్తం 6లో..

సహకార సమైక్యవాదానికి ప్రాముఖ్యత

సంపూర్ణంగా రాష్ట్ర ప్రభుత్వ సహకారం

- సీఎంతో నిటి అయోగ్ బృందం భేటీ
- రాష్ట్రావసరాలపై సమగ్ర చర్చ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా శ్రేయస్సు, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని సహకార సమైక్యవాద (కో-ఆపరేటివ్ ఫెడరలిజం) ప్రాముఖ్యతకు అనుగుణంగా కలిసి పనిచేయాలని నిటి అయోగ్, రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించాయి. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారాన్ని అందిస్తుందని స్పష్టం చేసింది. మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో నీతి ఆయోగ్ వైస్ చైర్మెన్ సుమన్ కుమార్ బేరి బృందం ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డితో సమావేశమైంది. ఈ సందర్భంగా వారు రాష్ట్ర సమగ్ర ప్రగతి, అభివృద్ధి అంశాలు, విధాన కార్యక్రమాలు, సహకారంపై చర్చించారు. సమర్థవంతమైన పాలనకు మార్గదర్శక సూత్రంగా కో-ఆపరేటివ్ ఫెడరలిజం ప్రాముఖ్యతను సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. నిటి ఆయోగ్,

...3లో



దమ్ముంటే సీబీఐ విచారణ చేయండి

- కేసీఆర్ ప్రభుత్వ అతిపెద్ద స్కాం కాళేశ్వరం
- కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటి కాదని నిరూపించుకోవాలి
- ఎంఐఎం మధ్యవర్తిత్వంలో తాజా, మాజీ సీఎంల లోపాయికారి ఒప్పందం : కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి దమ్ముంటే కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణకు ఆదేశించాలని కోరుతూ కేంద్రానికి లేఖ రాయాలని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి సవాల్ విసిరారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పీఎస్ఎల్వీ-సీ58ని విజయవంతంగా ప్రయోగించిన ఇస్రో శాస్త్రవేత్తలకు

...5లో

అది మీ చేతుల్లోనే ఉందిగా...

- ఈ వారంలోనే న్యాయ విచారణ
- పూర్తయ్యాకే కాళేశ్వరం పెండింగ్ బిల్లులు
- ప్రాజెక్టుల అవినీతిలో బీజేపీ, బీఆర్ఎస్ భాగస్వాములు : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై న్యాయవిచారణకు ఈవారంలోనే ఆదేశాలు జారీచేస్తామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రకటించారు. విచారణ పూర్తయిన తర్వాతే కాళేశ్వరం పెండింగ్ బిల్లులపై ఆలోచిస్తామనీ, అప్పటివరకు ఏ ఒక్కటీ క్లియర్ చేయబోమని స్పష్టంచేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయం మీడియా సెంటర్‌లో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారనీ, ఆయన వ్యాఖ్యలు సత్యదూరమని చెప్పారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసిమెలిసి 3500 రోజులు పనిచేశాయనీ, తాము అధికారంలోకి వచ్చి నెలకాకముందే ఆపార్టీల నాయకులు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. కాళేశ్వరం అవినీతిపై అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వానికి కేంద్రంలోని బీజేపీ సంపూర్ణ మద్దతిచ్చిందన్నారు. కాళేశ్వరం అవినీతిలో బీఆర్ఎస్, బీజేపీలు భాగస్వాములని

...5లో



బీజేపీ నుంచి పోటీ చేయండి

కేరళ గవర్నర్‌కు సీపీఐ(ఎం) నేత బృందా కరత్ సూచన

- సీఎంతో ఉన్న విభేదాలను తొలగించుకోవాలని హితవు



తిరువనంతపురం : కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ తీరుపై సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కరత్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆయన నేరుగా రాజకీయాల్లోకి రావాలనీ, 2024 సాధారణ ఎన్నికల్లో ఆయన బీజేపీ నుంచి పోటీ చేయాలని వ్యంగ్యాస్త్రాలు సంధించింది. గవర్నర్.. రాష్ట్ర ప్రభుత్వంతో పలు అంశాల్లో విభేదిస్తూ సర్కారుపై ఆరోపణలు చేస్తున్న

...13లో

సర్కారు బడులపై విద్యుత్ బిల్లుల భారం

స్కూల్ గ్రాంటు సరిపోక హెచ్ఎంల ఇబ్బందులు

- కమర్షియల్ నుంచి డొమెస్టిక్‌కు మార్చే అవకాశం
- ప్రభుత్వ సమాలోచన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్‌లోని బోరబండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1540 మంది విద్యార్థులు చదువుతున్నారు. నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు కరెంటు బిల్లు వస్తున్నది. అంటే నెలకు రూ.15 వేలు అయితే పది నెలలకు రూ.1,50,000, ఏడాదికి రూ.180,000 అవుతాయి. నెలకు రూ.20 వేలు అయితే పది నెలలకు రూ.2 లక్షలు, ఏడాదికి రూ.2,40 లక్షలు అవుతాయి. కానీ ఆ పాఠశాలకు గ్రాంటు కింద ఏడాదికి రూ.లక్ష మాత్రమే ప్రభుత్వం ఇస్తుంది. ప్రస్తుతం బోరబండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల కరెంటు బిల్లు బకాయిలు రూ.87,545 ఉన్నాయి.

హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1,065 మంది విద్యార్థులున్నారు. కరెంటు బిల్లు నెలకు రూ.17 వేలు వస్తుంది. అంటే పది నెలలకు రూ.1.70 లక్షలు, ఏడాదికి రూ.2.04 లక్షలు వస్తుంది. ఆ



పాఠశాలకూ గ్రాంటు కింద ఏడాదికి రూ.లక్ష మాత్రమే వస్తుంది. హైదరాబాద్ జిల్లా ఖైరతాబాద్ మండలం శ్రీరామ్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 900 మంది విద్యార్థులున్నారు. నెలకు రూ.5 వేలు కరెంటు బిల్లు వస్తుంది. అంటే పది నెలలకు రూ.50 వేలు,

...3లో

కాంగ్రెస్‌లోకి వైఎస్ షర్మిల

రేపు ఢిల్లీకి పయనం



- అక్కడే అధికారిక ప్రకటన
- పార్లమెంటు ఎన్నికలే లక్ష్యంగా పావులు కదుపుతున్న అధిష్టానం
- వైఎస్ఆర్‌టీపీ విలీనంపై తెలంగాణ క్యాడర్ డైలమా
- సర్దుబాటు హామీతో సరి..

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వైఎస్ఆర్‌టీపీని కాంగ్రెస్ విలీనం చేసేందుకు మూహూర్తం ఖరారైంది. ఆ పార్టీ అధ్యక్షులు వైఎస్ షర్మిల గురువారం ఢిల్లీకి వెళ్లి ఏఐసీసీ అధ్యక్షులు అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, అగ్రనేతలు సోనియా, రాహుల్‌గాంధీని కలువనున్నారు. ఆ తర్వాత పార్టీ విలీనంపై ఆమె నిర్ణయం తీసుకోనున్నారు. దీనిపై బుధవారం వైఎస్ షర్మిల అధికారికంగా ప్రకటించే అవకాశం ఉన్నట్టు పార్టీ వర్గాలు అంటున్నాయి. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కూడా విలీన ప్రక్రియపై చర్చలు జరిగాయి. ఆ సమయంలోనూ కాంగ్రెస్ పెద్దలను ఆమె కలిసిన విషయం తెలిసిందే. కాంగ్రెస్‌లో చేరి తెలంగాణ రాష్ట్రంలో క్రియాశీలకంగా ఉంటానంటూ షర్మిల ప్రకటించారు. తెలంగాణ కోడలిగా తనకు ఇక్కడే సర్వహక్కులు ఉన్నాయంటూ చెప్పుకొచ్చారు. ఎన్నికల సమయంలో షర్మిలను కాంగ్రెస్‌లో చేర్చుకుంటే, పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందంటూ ఆ పార్టీ రాష్ట్ర నాయకులు ఏఐసీసీ పెద్దలను ఒప్పించారు. ఆమె కాంగ్రెస్‌లో చేరితే కాంగ్రెస్‌లో ఆంధ్రా పెత్తనం అంశాన్ని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెరపైకి తెస్తారని హస్తం పార్టీ ఆందోళన వ్యక్తం చేసింది. అది ఎన్నికల అస్త్రంగా మారుతుందని పీసీసీ చీఫ్ రేవంత్ అధిష్టానం వద్ద బలంగా వాదన వినిపించారు. దీంతో అధిష్టానం కూడా ఆలోచనలో

...5లో

ఎక్కడి వాహనాలు అక్కడే..

'హిట్ అండ్ రన్' కేసులో కఠిన శిక్షకు దేశవ్యాప్త నిరసన

- పలు ప్రాంతాల్లో హైవేల దిగ్బంధం... రాస్తారోకోలు
- నిత్యావసరాల ధరలకు రెక్కలు
- బంకుల్లో నిండుకుంటున్న ఇంధన నిల్వలు
- చర్చలు సఫలం.. సమ్మె విరమణ

న్యూఢిల్లీ : వాహనంతో ఎవరినైనా ఢీకొట్టి, ఆపకుండా వెళ్లిపోయే డ్రైవర్లకు (హిట్ అండ్ రన్) విధించే శిక్షను కఠినతరం చేస్తూ నూతన క్రిమినల్ చట్టం భారతీయ న్యాయ సంహితలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధనలపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఈ తరహా కేసులలో పది సంవత్సరాల జైలు శిక్ష, ఏడు లక్షల రూపాయల జరిమానా విధించడాన్ని వ్యతిరేకిస్తూ ట్రక్కులు, లారీలు, బస్సులు, ట్యాంకర్ల డ్రైవర్లు వివిధ ప్రాంతాలలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. సోమవారం నుండే వీరంతా సమ్మెకు దిగడంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఆందోళన ఉధృతం కాకముందే తగిన చర్యలు తీసుకోవాలంటూ వివిధ రవాణా సంఘాలు కేంద్రాన్ని కోరుతున్నాయి. సమ్మె కారణంగా పలు పెట్రోల్ బంకుల్లో నిల్వలు నిండుకుంటున్నాయి. అనేక చోట్ల ఇప్పటికే బంకులు మూతపడ్డాయి. ఏ బంకు ముందు చూసినా భారీ క్యూలు దర్శనమిస్తున్నాయి. సమ్మె ఇలాగే కొనసాగితే కూరగాయలు, పండ్లు, ఇతర నిత్యావసరాల సరఫరాకు అవరోధం ఏర్పడుతుందని, ఫలితంగా వాటి ధరలు కొండెక్కి కూర్చుంటాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హిట్ అండ్ రన్ కేసుల్లో శిక్షాకాలాన్ని పెంచడాన్ని నిరసిస్తూ గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, హర్యానా, పంజాబ్, ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, బీహార్ సహా పలు రాష్ట్రాలలో డ్రైవర్లు రోడ్లను, జాతీయ రహదారులను దిగ్బంధించారు. పశ్చిమ బెంగాల్‌లో వందలాది మంది ట్రక్కు డ్రైవర్లు హూగ్లీ జిల్లాలోని దంకుని టోల్‌ప్లాజా సమీపంలో జాతీయ రహదారిని

...13లో



స్తంభించిన రవాణా

- ఎంవీ యాక్ట్ సవరణకు నిరసనగా ట్యాంకర్ డ్రైవర్ల సమ్మె
- పెట్రోల్, డీజిల్ కోసం బంకుల ముందు జనం బారులు
- హైదరాబాద్‌లో ట్రాఫిక్ జామ్
- సమ్మె విరమణపై గందర గోళం

వివరాలు 13లో

పోటీ చేద్దామా..? వద్దా...?

ప్రస్తుత పరిస్థితుల్లో గెలవగెలమా...? **బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీల తర్జనభర్జన**

- 2014, 2019తో పోలిస్తే రాజకీయ సమీకరణాలు మారటమే ప్రధాన కారణం
- ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, సికింద్రాబాద్, చేవెళ్ల స్థానాలకు మాత్రం విపరీత పోటీ
- నేటి నుంచి పార్లమెంటు స్థానాల వారీగా సన్నాహక సమావేశాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఒకవైపు శాసనసభ ఎన్నికల్లో ఓటమి.. మరోవైపు తరుముకొస్తున్న లోక్‌సభ ఎన్నికలు... వెరసి బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీలు డైలమాలో ఉన్నారు. మరో మూడు నాలుగు నెలల్లో నిర్వహించబోయే పార్లమెంటు ఎలక్షన్లలో పోటీ చేయాలా..? వద్దా..? అనే మీమాంస వారిలో నెలకొంది. 2014లో తెలంగాణ ఉద్యమ వేడి, కొత్త రాష్ట్రం వచ్చిన ఊపులో గులాబీ పార్టీ అత్యధిక ఎంపీ (11) స్థానాలను కైవసం చేసుకుంది. 2018 డిసెంబరులో నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో రెండోసారి గులాబీ జెండా ఎగరటంతో ఆ తర్వాత కొద్ది నెలలకే (2019 మే) వచ్చిన ఎంపీ ఎన్నికల్లో కారు పార్టీ 9 స్థానాల్లో విజయం సాధించింది. కానీ ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. డిసెంబరులో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొందగా, బీఆర్ఎస్ 39 స్థానాలకే పరిమితమై ప్రతిపక్షంలో కూర్చుంది. మరోవైపు ఆ పార్టీ వరంగల్, ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఒకట్రెండు స్థానాలకే పరిమితమైంది. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాల్లోని సిట్టింగులకు ఇప్పుడు ఏం చేయాలో పాలుపోని పరిస్థితి. గతంలో ప్రతీ జిల్లాలోనూ పది మంది ఎమ్మెల్యేలు, వారి అనుయాయులు, కార్యకర్తలు, క్రియాశీలక నేతలున్నారు. వారందరి సహకారంతో ఎంపీలుగా గెలిచారు. కానీ ఇప్పుడు ఒకరిద్దరు ఎమ్మెల్యేలతో ఎలా నెగ్గుకురాగలమనే సందేహంతో సిట్టింగులు సతమతమవుతున్నారు. దాంతోపాటు ఒక పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లను, ఆయా స్థానాల్లోని నేతలను సమన్వయం చేయటం కత్తిమీద సాములాగా ఉంటుందని పలువురు ఎంపీలు ఆందోళన చెందుతున్నారు. దీనికితోడు క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ హవా కొనసాగుతుందనే అంచనాతో వారున్నారు. ఈ పరిస్థితుల్లో ఎంపీలుగా పోటీ చేయటం కంటే పక్కకు పోవటమే బెటరని వారు భావిస్తున్నట్టు

...13లో

నిష్పాక్షిక, స్వతంత్ర వ్యవస్థ ఉండాలి

- సీఈసీ, ఈసీల నియామకాలపై సుప్రీంకోర్టులో పిటిషన్
- కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కూడా చేర్చాలని విజ్ఞప్తి వివరాలు 13లో
- నియామక చట్ట సవరణను సవాల్ చేస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించిన న్యాయవాదులు

సాకులు చూపి ఏదీ ఆపం..

- ఆరు గ్యారంటీల అమలుపై చిత్తశుద్ధితో ఉన్నాం
- ప్రభుత్వ ఆస్తులు కొల్లగొట్టిన వారిపై చర్యలు తప్పవు
- సీఎం హామీ మేరకు రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు : మీడియాతో చిట్‌చాట్.. ప్రజాపాలన సభల్లో మంత్రి పొంగులేటి వివరాలు 3లో..

18 ఏండ్లు నిండిన ప్రత్యేక చిన్నారుల

సంరక్షణకు చర్యలేంటీ..?

- కేంద్రాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ : ప్రత్యేక అవసరాలు, అనారోగ్యంతో ఉన్న చిన్నారులకు 18 ఏండ్లు నిండిన తరువాత సంరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. 2015 జువెనైల్ జస్టిస్ (కేర్ అండ్ ప్రొటెక్షన్) చట్టంలోని సెక్షన్ 2 (14), (4) ప్రకారం పిల్లల సంరక్షణకు కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తూ కెఎస్‌ఆర్ మీనన్ దాఖలు చేసిన పిటీషన్‌ను మంగళవారం సుప్రీంకోర్టు విచారించింది. ఈ పిటీషన్‌పై స్పందించాలని కేంద్రాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. పై చట్టంలోని సెక్షన్ల ప్రకారం మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న, లేదా మానసిక, శారీరక వికలాంగులు లేదా ప్రాణాంతకమైన వ్యాధి లేదా నయం చేయలేని వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు, అలాగే తల్లిదండ్రులు లేదా సంరక్షకులు లేని చిన్నారులకు ప్రభుత్వం ప్రత్యేక సంరక్షణ కార్యక్రమాలు నిర్వహించాలి. ఇలాంటి కార్యక్రమాలు లేకపోవడంతో ప్రత్యేక చిన్నారుల పరిస్థితి ఆందోళనకరంగా ఉందని పిటీషనర్ పేర్కొన్నారు.

యంత్రాల పనితీరుపై ఇండియా ఫోరం నాయకులు పలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. వివి ప్యాట్ స్లిప్‌లను ఓటర్లకు అందజేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సీఈసీకి జైరాం రమేష్ లేఖ రాశారు.

హిట్ అండ్ రన్ శిక్షలు

ఉపసంహరించుకోండి

- కేంద్రమంత్రి అమిత్‌షాకి ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ లేఖ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కేంద్రప్రభుత్వం భారతీయ న్యాయ సన్హిహిత-2023లో డ్రైవర్లకు విధించే శిక్షలను ఉపసంహరించుకోవాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు ఆయన లేఖ రాసారు. ఈ చట్టంలోని సెక్షన్ 104(1) మరియు (2) ప్రకారం రవాణారంగంలో పనిచేసే డ్రైవర్లకు భద్రత కరువై, చేయని తప్పిదాలకు సుదీర్ఘకాలం జైళ్లలో మగ్గవలసి వస్తుందని పేర్కొన్నారు. ఈ శిక్షలు ఏమాత్రం మానవత్వం లేని విధంగా ఉన్నాయనీ, అనుకోకుండా జరిగే రోడ్డు ప్రమాదాల వల్ల లారీ, ట్రక్కు డ్రైవర్లు శిక్షలకు గురై, వారి కుటుంబ సభ్యులు రోడ్డున పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాలకు శాస్త్రీయ ప్రమాణాలను నిర్దేశించకుండా, కేవలం డ్రైవర్లను మాత్రమే బాధ్యుల్ని చేయడం సరికాదన్నారు. రహదారుల భద్రత, సిగ్నల్స్ ఏర్పాటు, రహదారి సూచిక బోర్డులు వంటి ఇతర భద్రతా చర్యలు ఏవీ తీసుకోకుండా, నేరాల్ని డ్రైవర్లపైకి నెట్టేసేలా ఈ చట్టంలో శిక్షలు ఉన్నాయని వివరించారు. రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు స్థానికంగా ఉద్రిక్త పరిస్థితులు ఉంటాయనీ, అక్కడి ప్రజలు డ్రైవర్లపై దాడులు చేస్తారనే భయంతో వారు పారిపోతారే తప్ప, నేరం నుంచి తప్పించుకొనేందుకు కాదని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం తక్షణం ఈ శిక్షల్ని ఉపసంహరించుకోవాలని కోరారు.

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ అవగాహన

- సీఎంతో సీపీఐ నేతల సమావేశం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డితో సీపీఐ ప్రతినిధి బృందం మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సమావేశమైంది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యదర్శులు కె నారాయణ, అజీజ్ పాషా, కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, పశ్యపద్మ, టి శ్రీనివాసరావు, ఎన్ బాలమల్లేష్, బాల నర్సింహ్మ బాగం హేమం తరావు, కలవేన శంకర్, ఈటి నరసింహ తదితరులు సీఎంను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ అవగాహన సత్ఫలితాలను ఇచ్చిందని సీఎంతో సీపీఐ నేతలు అన్నారు. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లోనూ ఇండియా కూటమిలో ఉన్న కాంగ్రెస్, సీపీఐ రాష్ట్రంలో అవగాహనతో పోటీ చేసేందుకు పరస్పరం సహకరించుకోవాలని కోరారు. త్వరలోనే రాష్ట్రంలోని ప్రజాసమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు సీఎంను మరోసారి కలవాలని నిర్ణయించుకున్నామని కూనంనేని అన్నారు.

అందరికీ అందుబాటులో ఉంటా : సీఎం

అందరికీ అందుబాటులో ఉంటానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యేలు, ప్రజాసంఘాలు, పార్టీలు ప్రజా సమస్యలపై ప్రాతినిధ్యం చేసేందుకు సాయంత్రం నాలుగు నుంచి ఐదు గంటల వరకు అందుబాటులో ఉంటానని వివరించారు. వివిధ సంస్థలు, శాఖల్లో రిటైర్డ్ అధికారులను ఏండ్ల తరబడి కొనసాగించారనీ, ఆ సంప్రదాయానికి కొత్త ప్రభుత్వం స్వస్తి పలకాలని నారాయణ సూచించారు.

న్యాయ విచారణ పరిధిలో సింగరేణిని చేర్చాలి

ప్రభుత్వరంగ సంస్థలను కాపాడ్డంతోపాటు వాటిని పటిష్టపరచాలని సీఎంకు సీపీఐ ప్రతినిధి బృందం విజ్ఞప్తి చేసింది. విద్యుత్ రంగంలో అక్రమాలపై న్యాయ విచారణ జరుపుతామంటూ సీఎం ప్రకటించారని గుర్తు చేసింది. సింగరేణి కాలరీస్ సంస్థలో జరిగిన అక్రమాలు, అవినీతిని కూడా న్యాయ విచారణ పరిధిలోకి తేవాలని కూనంనేని కోరారు. సింగరేణి, జెన్‌కో, ట్రాన్స్‌కోకు సమర్థులైన అధికారులను నియమించాలని సూచించారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేపై ప్రజావాణిలో ఫిర్యాదు

- కబ్జా నుంచి తమ భూములను కాపాడాలని వినతి
- బేగంపేట ప్రకాష్‌నగర్ వాసుల ఆందోళన



నవతెలంగాణ-బంజారాహిల్స్

బీఆర్ఎస్ ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తమ భూములు కబ్జా చేశారని ఆరోపిస్తూ హైదరాబాద్ బేగంపేట ప్రకాష్‌నగర్ బస్తీ వాసులు మంగళవారం ప్రజాభవన్‌లో ఫిర్యాదు చేశారు. తమ భూములను కాపాడి న్యాయం చేయాలని కోరుతూ వారు ప్రజాభవన్‌కు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ప్లకార్డులు, బ్యానర్లు చేత పట్టుకుని నిరసన తెలిపారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆయన అనుచరుడు సుధీర్‌గౌడ్ పేరుతో తమ భూములను కబ్జా చేస్తున్నారంటూ బస్తీవాసులు ఆరోపించారు. మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో తమకు కేటాయించిన స్థలాలను ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ప్రజావాణిలో ఫిర్యాదు చేయడానికి వెళ్తే దానం అనుచరులు బెదిరిస్తున్నారన్నారు.

బేగంపేట పీఎస్‌లో ఫిర్యాదు

ఇదిలా ఉండగా అదే సమయంలో ఆందోళనను వీడియో తీస్తున్న దానం నాగేందర్ అనుచరుడు నాగరాజు అనే వ్యక్తిని బాధితులు చితకబాది పోలీసులకు అప్పగించారు. అనంతరం కొందరు రౌడీ మూకలు అర్ధరాత్రి పూట వచ్చి తమను భయాందోళనకు గురి చేస్తున్నారని బేగంపేట్ పోలీస్‌స్టేషన్‌లో బస్తీవాసులు ఫిర్యాదు చేశారు. ప్రజాభవన్ ముందు ఆందోళన చేస్తుంటే కూడా తమను బెదిరించారంటూ వారు పేర్కొన్నారు. దానం నాగేందర్, అతని అనుచరుల నుంచి రక్షణ కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బాధితులు కోరారు.

జపాన్‌లో రన్‌వేపై రెండు విమానాలు ఢీ

- ఐదుగురు మృతి



టోక్యో : టోక్యోలోని హనెడా విమానాశ్రయంలో మంగళవారం ఘోర ప్రమాదం సంభవించింది. జపాన్ కోస్ట్ గార్డ్ విమానంతో పాసింజర్ విమానం ఢీ కొనడంతో క్షణాల వ్యవధిలోనే మంటలు పెద్ద ఎత్తున వ్యాపించాయి. ఈ దుర్ఘటనలో ఐదుగురు మరణించినట్లు అధికారులు తెలిపారు. జపాన్ ఎయిర్‌లైన్స్‌కి చెందిన విమానంలో పూర్తిగా మంటలు వ్యాపించడానికి ముందుగానే అందులోని 379మంది ప్రయాణికులు సురక్షితంగా దిగిపోయినట్లు ఎన్‌హెచ్‌కె టివి తెలియచేసింది. జపాన్ కోస్ట్ గార్డ్ విమానం పైలట్ కూడా ఈ ప్రమాదం నుండి తప్పించుకోగలిగారని కోస్ట్ గార్డ్ అధికారులు చెప్పారు. అయితే విమానంలోని ఐదుగురు సిబ్బంది చనిపోయినట్లు టివి వార్తలు తెలిపాయి. జపాన్ ఎయిర్‌లైన్స్‌కి చెందిన విమానం రన్‌వే పై వుండగానే పెద్ద ఎత్తున మంటలు, పొగ కమ్ముకోవడం స్థానిక టివి దృశ్యాల్లో కనిపిస్తోంది. విమానం రెక్కకు నిప్పంటుకోవడం, ఒక గంట తర్వాత మొత్తంగా మంటల్లో విమానం చిక్కుకోవడం కనిపిస్తోంది. ప్రమాదానికి గురైన ఎయిర్‌బస్ ఎ-350 షిన్ చిటొసె విమానాశ్రయం నుండి హనెడా విమానాశ్రయానికి ప్రయాణించింది. తమ విమానం ఎంఎ-722తో ప్రయాణికుల విమానం ఢీ కొట్టిందని కోస్ట్ గార్డ్ ప్రతినిధి యోషినొరి యాంగ్‌షిమా ధృవీకరించారు. కోస్ట్ గార్డ్ విమానం భూకంప బాధితుల కోసం సహాయాన్ని తీసుకుని నైజీరియా వెళ్ళాల్సి వుంది. ప్రమాదం జరిగిన సమయంలో విమానంలోనే వున్న ప్రయాణికుడు స్వీడ్ ఆంటస్ మాట్లాడుతూ, ఢీ కొట్టిన వెంటనే కొద్ది నిముషాల వ్యవధిలో కేబిన్ అంతా పొగ కమ్ముకుపోయిందని, వెంటనే అత్యవసర ద్వారాలు తెరుచుకున్నాయని, తమను కిందకు దింపివేశారని చెప్పారు. అస్సలేం జరుగుతోందో కొద్ది సేపు అర్థం కాలేదని, అదొక భయంకరమైన అనుభవమని స్వీడ్ వ్యాఖ్యానించారు.

అవినీతి అధికారులు లొంగిపోవాలి

- జాగో(మేలుకో) తెలంగాణ, తెలంగాణ జలసాధన సమితి రౌండ్ టేబుల్ సమావేశంలో రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్
- కాళేశ్వరం నిర్మాణంపై విచారణ జరిపించాలని వక్తల డిమాండ్



నవతెలంగాణ- బంజారాహిల్స్

కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతికి పాల్పడిన అధికారులు లొంగిపోవాలని రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్ అన్నారు. జాగో తెలంగాణ, తెలంగాణ జలసాధన సమితి ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చంద్రకుమార్ మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతికి పాల్పడిన అధికారులందరూ చట్టప్రకారం అప్రూవర్‌గా మారాలన్నారు. వాళ్ళ అవినీతిని అంగీకరించి ప్రభుత్వానికి లొంగిపోవాలని సూచించారు.

మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి మాట్లాడుతూ.. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణంపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని, దోషులైన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. అవినీతికి పాల్పడిన ఉన్నత అధికారులందరినీ నిందితులుగా ప్రకటించి సమాజం ముందు వెల్లడించాలన్నారు. కేసీఆర్ మొదటి నిందితుడని, హరీశ్‌రావు రెండో నిందితుడని, ఈఎంసీ ఉన్నతాధికారి మురళీధర్‌రావు తదితరులను కూడా నిందితులుగా ప్రకటించా లన్నారు. విచారించి వారి ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. చట్ట ప్రకారం విచారణ జరిపి క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ జలసాధన సమితి కన్వీనర్ నైనాలు గోవర్ధన్ అధ్యక్షత వహించారు. తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, ప్రొఫెసర్ పద్మజశా, తెలంగాణ విటల్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వేములపల్లి వెంకట రామయ్య, ఇంజినీర్ విట్టల్‌రావు, సోగరబేగం, ప్రొఫెసర్ జానీయా కామేశ్వరరావు, పీఓడబ్ల్యు రాష్ట్ర నాయకులు అనురాధ, ఇంజినీర్ వెంకటరమణ, ఇంజినీర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మీ- సేవా ఉద్యోగుల వేతనాలు పెంచండి

ఉద్యోగ భద్రత కల్పించాలి : ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్‌కు సీఐటీయూ వినతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మీసేవా ఉద్యోగులకు వేతనాలు పెంచి, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఐటీ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, ఆ శాఖ ఉన్నతాధికారులు, సీఐటీయూ ప్రతినిధుల మధ్య చర్చలు జరిగాయి. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, తెలంగాణ మీసేవా ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు జె. వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

జీతాల పెంపుదలకు జయేశ్‌రంజన్ సానుకూలత వ్యక్తం చేశారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు సమక్షంలో మరోసారి చర్చలు జరిపి ఇతర సమస్యలు పరిష్కరిస్తామని హామీనిచ్చారు. జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాల చెల్లింపు, ఉద్యోగ భద్రత, పీఎఫ్ ఖాతాలో యజమాని, ఉద్యోగి వాటా చెల్లింపు, ఖాతాల అప్‌డేట్, అవర్లీ ఓటీ, కొరియర్ చార్జీలు రూ.500 నుంచి రూ.1,500కి పెంపు, వార్షిక ఇంక్రిమెంట్ 10 శాతం పెంపు, రూ.10 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్, మీసేవా సెంటర్లలో సెక్యూరిటీ గార్డుల నియామకం, తదితర డిమాండ్లను అధికారుల దృష్టికి పాలడుగు భాస్కర్, జె.వెంకటేశ్ తీసుకెళ్లారు.

రాజకీయ ప్రాజెక్టుగా రామమందిరం!

అదే బీజేపీ ఎన్నికల ప్రచారాస్త్రం

న్యూఢిల్లీ : ఇప్పుడు దేశంలో ఎక్కడ చూసినా రామ నామ స్మరణే వినిపిస్తోంది. కనిపిస్తోంది. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు దీనిని ఎన్నికల ప్రచారాస్త్రంగా మార్చేశాయి. అయోధ్యలో కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన రామ మందిరాన్ని ఈ నెల 22న ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించబోతున్నారు. లోక్‌సభ ఎన్నికలలో హ్యాట్రిక్ విజయాన్ని సాధించాలని తహతహలాడుతున్న బీజేపీ, ఈ వేడుకను అందివచ్చిన అవకాశంగా మార్చేసుకుంటోంది. తద్వారా ప్రాచీన లౌకిక సంస్కృతిని నీరుకారుస్తోంది.

ఇతర వ్యవసాయాధారిత సమాజాల మాదిరిగానే మన దేశంలో కూడా మతం అనేది మన జీవితాలలో ఆంతరంగిక భాగమైపోయింది. స్వాతంత్రోద్యమానికి ముందు దేవాలయాలు వివిధ కులాల మధ్య విభజనను ప్రచారం చేసే కేంద్రాలుగా ఉండేవి. చాతుర్వర్ణ వ్యవస్థకు ప్రభుత్వాలు కొమ్ముకాసేవి. స్వాతంత్ర్యానంతరమే దేవాలయాలు ప్రార్థనా స్థలాలుగా మారాయి. అంటరానివారికి సైతం ఆలయ తలుపులు తెరుచుకున్నాయి. స్వాతంత్ర్య సిద్ధించిన 42 సంవత్సరాల తర్వాత...అంటే 1989లో అయోధ్యలో మందిరం-మసీదు వివాదం రాజుకుంది. 1992లో బాబ్రీ మసీదును మతోన్మాద శక్తులు కూల్చివేశాయి. దీంతో దేశవ్యాప్తంగా హింస, విద్వేషాలు చెలరేగాయి. బాబ్రీ మసీదు స్థలంలో రామ మందిర నిర్మాణానికి అనుమతి ఇస్తూ 2019లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఇప్పుడు మందిర నిర్మాణం పూర్తయి ప్రాణ ప్రతిష్టకు సిద్ధమైంది.

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, దాని మాతృ సంస్థ ఆర్‌ఎస్‌ఎస్‌లు ఈ అవకాశాన్ని తమకు అనుకూలంగా మార్చుకుంటున్నాయి. దేశవ్యాప్తంగా ఓ రకమైన 'హిస్టీరియా'ను సృష్టించాయి. భారత లౌకిక స్వరూపాన్ని విచ్ఛిన్నం చేసేందుకు, దేశంలోని ఆలయాలన్నింటి పైన పెత్తనం చెలాయించేందుకు, అధికారంపై పట్టు బిగించేందుకు, ఆర్థిక వ్యవస్థపై కార్పొరేట్ నియంత్రణను పటిష్టవంతం చేసేందుకు కంకణం కట్టుకున్నాయి. చివరికి ఎన్‌ఆర్‌ఐలు... సంపన్న వర్గాలు సైతం దీనిని ఓ ఘన విజయంగా భావించాయి. 1947లో సాధించిన స్వాతంత్ర్యం వారిని సంతృప్తి పరచడం లేదు. ఎందుకంటే అది వారి విశేష హోదాను కాపాడలేకపోయింది. మతం అనేది నిజాన్ని సూచిస్తుంది. మందిర ప్రచారం మతాన్ని పూర్తిగా విస్మరించింది.



'సీ ట్రూత్ అండ్ రైజ్ ఫర్ ట్రూత్' రచయిత విపిన్ త్రిపాఠీ అభిప్రాయం ప్రకారం... కేంద్రంలో గత పది సంవత్సరాల బీజేపీ పాలనలో మతపరమైన కార్యక్రమాల ద్వారా ప్రజల్లో భావోద్వేగాలను రెచ్చగొట్టి రాజకీయ ప్రత్యర్థులను, ప్రజాస్వామిక వ్యవస్థలను అణచివేసే ప్రయత్నాలు ఊపందుకున్నాయి. రామ రావణ యుద్ధ సమయంలో రావణుడు తలపెట్టిన యజ్ఞాన్ని భంగం చేసేందుకు అంగదుడు, హనుమంతుడు, ఇతరులను రాముడు పంపాడని రామాయణం చెబుతోంది. అధికార వ్యామోహంతో చేసే ఏ పని అయినా పాపమే. పీడకుల అధికారాన్ని బలోపేతం చేసేందుకు నిర్వహించే మత కార్యక్రమాలకు లేదా ప్రారంభోత్సవాలకు వెళ్లడం మంచిది కాదు. మతం, మత కార్యక్రమాలను పీడకుల నియంత్రణ నుండి కాపాడాలని ప్రధాని మోడీని, ఆయన ప్రభుత్వాన్ని విపిత్ త్రిపాఠీ డిమాండ్ చేశారు.



పెరుగుతున్న చలి తీవ్రత

పలు జిల్లాల్లో పొగమంచు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో మళ్లీ చలితీవ్రత పెరుగుతున్నది. పలు జిల్లాల్లో దట్టమైన పొగమంచు కమ్ముకుంటున్నది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనూ రాబోయే 48 గంటల పాటు ఉదయం పూట పొగమంచు వాతావరణం నెలకొనే అవకాశముంది. తెలంగాణ మీదుగా కిందిస్థాయిలో గాలులు వీస్తున్నాయి. దీంతో రాష్ట్రంలో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే కొన్ని చోట్ల 2.5 వరకు తక్కువ నమోదవుతున్నాయి. తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ నివేదిక ప్రకారం మంగళవారం నాడు రంగారెడ్డి జిల్లాలో అత్యల్పంగా 10.7 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. 33 జిల్లాలకు గానూ 30 జిల్లాల్లో 15 డిగ్రీల లోపు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో ఆ జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరికను జారీ చేసింది.

కాంగ్రెస్ హయాంలోనే పేదలకు ఇండ్లు

బీఆర్‌ఎస్ ఏ ఒక్కరికైనా ఇండ్లు ఇచ్చిందా?

- నేటికీ గ్రామాల్లో కనిపించేవి ఇందిరమ్మ ఇండ్లే
- ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తాం: ఆరోగ్య శాఖ మంత్రి రాజనర్సింహ
- ఖేడ్ నియోజకవర్గంలో ప్రజా పాలన కార్యక్రమాలకు హాజరు



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

కాంగ్రెస్ హయాంలోనే నిరుపేదలకు 'ఇందిరమ్మ ఇండ్లు' వచ్చాయని.. నేటికీ గ్రామాల్లో ఆ ఇండ్లే ఎక్కువగా కనిపిస్తున్నాయని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలంలోని హనుమంతరావుపేట్, నారాయణఖేడ్ మున్సిపాల్టీ, మన్సుస్పూర్‌లో మంగళవారం జరిగిన ప్రజా పాలన కార్యక్రమాల్లో మంత్రి పాల్గొని మాట్లాడారు. పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, ఇండ్ల స్థలాలు, భూములు ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. ఈ పదేండ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏ ఒక్కరికైనా ఇల్లు ఇచ్చిందా అని ప్రశ్నించారు. కానీ తమ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తుందని, ఎన్నికల ముందు తాము ఇచ్చిన ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. ఇప్పటికే మహాలక్ష్మి కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, రూ.10లక్షల ఆరోగ్య బీమా అమలు చేస్తున్నామని తెలిపారు. మున్సిపాల్టీ పరిధిలోకి మన్సుస్పూర్‌లో వచ్చిన నాటి నుంచి ఆ గ్రామానికి ఉపాధి హామీ పనులు ఇవ్వటం లేదని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తప్పకుండా ఉపాధి పనులు ఇస్తామని చెప్పారు. మన్సుస్పూర్‌లో దళితులకు ఇండ్లు ఇస్తామని, ప్రభుత్వ భూమి ఉంటే అందులో ఇంటి స్థలం ఇస్తామని హామీ ఇచ్చారు. మాజీ ఎంపీ సురేష్ కుమార్ సెట్కార్ మాట్లాడుతూ.. నారాయణఖేడ్‌లో మంచి వైద్యం అందే విధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు. నూతనంగా జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ.. తన జన్మభూమి ఇక్కడే అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల పార్టీ అని తెలిపారు. సమావేశానికి అధ్యక్షత వహించిన నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ.. నారాయణఖేడ్ కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అన్నారు. పదేండ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎటువంటి అభివృద్ధి చేయలేదన్నారు. పేదలకు ఇల్లు, స్థలాలు ఇవ్వాలని, మున్సిపాల్టీలో టాక్స్ తగ్గించాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని మంత్రిని కోరారు. అనంతరం మంత్రి ప్రజాపాలనలో దరఖాస్తులు తీసుకున్నారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షులు శేఖర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శరత్, ఆర్డీఓ వెంకటేష్, మున్సిపల్ చైర్మెన్ రుబీన నజీబ్, ఆనంద్ స్వరూప్ షెట్కర్, శంకర్ సెట్, నర్సింలు, డీఎస్పీ వెంకట్ రెడ్డి, అధికారులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సహకార సమైక్యవాదానికి ప్రాముఖ్యత



(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం ఎదుర్కొంటున్న సవాళ్ళ పరిష్కారానికి కలిసి పనిచేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధి, కీలక రంగాలకు సంబంధించిన ప్రాధాన్యతలు, రాష్ట్ర అవసరాలను నిటి ఆయోగ్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కేంద్రం నుంచి అందవలసిన న్యాయమైన కేటాయింపులపై తప్పనిసరి సిఫార్సులు చేస్తామని నిటి అయోగ్ అధికారుల బృందం తెలిపింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి పలు అంశాలను వారి దృష్టికి తీసుకెళ్లారు. 16వ ఆర్థిక సంఘం ద్వారా పెరిగిన రాష్ట్ర కేటాయింపులను పరిశీలించాలనీ, ఆరోగ్యం, విద్యలో మౌలిక సదుపాయాల కోసం నిధులు కేటాయించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014లోని సెక్షన్ 94(2) ప్రకారం వెనుకబడిన జిల్లాల అభివృద్ధి గ్రాంట్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.1,800 కోట్ల నిధుల విడుదల అంశాన్ని ప్రస్తావించారు. వినూత్న పాలనా పద్ధతులు, విజయవంతమైన నమూనాల అమలు కోసం పరస్పరం సహకరించుకొనేందుకు అంగీకారం తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్సెస్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తూ, ఇంజినీరింగ్ కళాశాలల్లో గ్రాడ్యుయేషన్ కోర్సులను అభ్యసిస్తున్న యువతలో నైపుణ్యాలను పెంపు కోసం తీసుకోవాల్సిన చర్యల్ని గుర్తుచేశారు. సోలార్ ఎనర్జీ వినియోగంపై రాష్ట్రానికి సహకరించాలని కోరారు. వివిధ రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వ సామర్థ్యాలను పటిష్టం చేసేందుకు స్టేట్ ఇన్‌స్టిట్యూట్ అఫ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సిట్) ఏర్పాటుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ అమలు కోసం అంతర్జాతీయ స్థాయిలో ప్రభుత్వ ప్రయివేటు భాగస్వామ్యం (పీపీపీ)తో సబర్మతి రివర్ ఫ్రంట్, నమామి గంగే ప్రాజెక్టుల తరహాలో సాంకేతిక సహకారం, అభివృద్ధికి సహకరించాలని ఈ సందర్భంగా సీఎం నిటి అయోగ్ ప్రతినిధి బృందాన్ని కోరారు. దానిలో భాగంగా మురుగునీటి శుద్ధి ప్లాంట్ల ఏర్పాటు కోసం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అర్బన్ గ్రోత్ హబ్‌గా మారుతున్న హైదరాబాద్‌ను కేంద్ర ప్రభుత్వ సహకారంతో కాలుష్య రహిత పట్టణంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు ఇవ్వాలని కోరారు. నిటి అయోగ్ పాలక మండలిలో రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామ్యం కావాలని ఈ సందర్భంగా నిట్ అయోగ్ వైస్ చైర్మెన్ సుమన్ కుమార్ కోరారు. సమావేశంలో సభ్యులు విజయకుమార్, డైరెక్టర్ జనరల్ సంజయ్‌కుమార్, డైరెక్టర్ అభినేష్ దాష్, ముత్తు కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడులపై విద్యుత్ బిల్లుల భారం!

(మొదటి పేజీ తరువాయి)

ఏడాదికి రూ.60 వేలు అవుతాయి. ఇలా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ఇలాగే ఉన్నది. సర్కారు బడులపై విద్యుత్ బిల్లుల భారం తీవ్రంగా ఉన్నది. ఆ బిల్లులను చూసి ప్రధానోపాధ్యాయులు షాక్‌కు గురవుతున్నారు. వాటిని ఎలా కట్టాలో తెలియక బెంబేలెత్తుతున్నారు. అయితే విద్యార్థుల సంఖ్యను బట్టి ప్రభుత్వం పాఠశాల గ్రాంటును ఇస్తున్నది. ఒకటి నుంచి 30 లోపు విద్యార్థులుంటే రూ.10 వేలు, 31 నుంచి వందమందిలోపు విద్యార్థులుంటే రూ.25 వేలు, 101 నుంచి 250 మందిలోపు విద్యార్థులుంటే రూ.50 వేలు, 251 నుంచి వెయ్యిలోపు విద్యార్థులుంటే రూ.75 వేలు, వెయ్యి ఆపైన విద్యార్థులుంటే రూ.లక్ష చెల్లిస్తున్నది. అవి ప్రతినెలా మంజూరు చేయడం లేదు. అయితే పాఠశాల గ్రాంటు కనీస అవసరాలకే సరిపోతున్నాయి. ఉదాహరణకు స్టేషనరీ ఖర్చులు, చాక్‌పీస్‌లు, జిరాక్స్, పాఠ్యపుస్తకాలు, యూనిఫారాల బట్ట రవాణా ఖర్చులకు ఆ నిధులను వినియోగించాల్సి ఉంటుంది. దీంతో కరెంటు బిల్లులు కట్టలేక ప్రధానోపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. ప్రభుత్వం ఇచ్చే పాఠశాల గ్రాంటు కరెంటు బిల్లులకూ సరిపోవడం లేదంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భారం తగ్గించేందుకు సర్కారు సమాలోచన

'పాఠశాలల విద్యుత్తు బిల్లులకు సంబంధించి కేటగిరి మార్పునకు తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతనెల 30న సమీక్షా సమావేశంలో పలు సూచనలు చేశారు. అయితే ఈ అంశంపై విద్యాశాఖ అధికారులు సమాలోచన చేస్తున్నారు. పాఠశాలలకు విద్యుత్ సరఫరా ప్రస్తుతం కమర్షియల్ కేటగిరీలో ఉన్నది. దాన్ని డొమెస్టిక్ (గృహవినియోగం) కేటగిరీ కిందికి మార్చే అవకాశమున్నది. దీంతో యూనిట్ ధర బాగ తగ్గనుంది. రాష్ట్రంలో గృహవినియోగదారులకు ప్రస్తుతం 50 యూనిట్లలోపు ఒక్కో యూనిట్ ధర రూ.1.95 ఉన్నది. 51 నుంచి 100 యూనిట్లలోపు ఒక్కో యూనిట్‌కు రూ.3.10 వసూలు చేస్తున్నారు. కమర్షియల్ కేటగిరీ కింద 50 యూనిట్లలోపు ఒక్కో యూనిట్ ధర రూ.7, వందలోపు యూనిట్లకు ఒక్కో యూనిట్‌కు రూ.8.50 ఉన్నది. దీన్ని గృహవినియోగం కేటగిరీలోకి మార్చాలని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు. దానివల్ల ప్రభుత్వ పాఠశాలలపై విద్యుత్ భారం తగ్గుతుందని ఆలోచన చేస్తున్నారు. ఇంకోవైపు గృహజ్యోతి కింద 200 యూనిట్లలోపు వాడితే ఉచిత విద్యుత్‌ను అందించనున్నట్టు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో హామీ ఇచ్చింది. ఇప్పుడు అధికారంలోకి రావడంతో అందరూ ఆ పథకం అమలు కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలకూ గృహజ్యోతి పథకాన్ని వర్తింపచేసి 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్‌ను అమలు చేయాలని పలు ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాల్సిందే.

ప్రభుత్వ నిర్ణయాన్ని ఆహ్వానిస్తున్నాం : చావ రవి, ప్రధాన కార్యదర్శి టీఎస్‌యూటీఎఫ్

ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ అందించాలి. ఒకవేళ కమర్షియల్ కేటగిరీ నుంచి డొమెస్టిక్ కేటగిరీకి మార్చితే ఆ బిల్లులకు అవసరమైన బడ్జెట్‌ను ప్రభుత్వం కేటాయించాలి. పాఠశాల నిర్వహణ గ్రాంటును కరెంటు బిల్లులకు వాడితే భారంగా ఉన్నది. పాఠశాలల నిర్వహణకే ఆ గ్రాంటు సరిపోతున్నది. సుదీర్ఘ కాలంగా ఉన్న పాఠశాలల కరెంటు బిల్లుల సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించడాన్ని ఆహ్వానిస్తున్నాం. తెలంగాణ వచ్చినప్పటి నుంచి పాఠశాలలపై కరెంటు బిల్లుల భారం పెరుగుతున్నదీ, దాన్ని తగ్గించాలని ప్రభుత్వాన్ని అడిగాం. అప్పుడున్న ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వం సానుకూలంగా స్పందించడాన్ని ఆహ్వానిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్‌ను ఇవ్వాలి. లేదంటే గృహవినియోగం కేటగిరీకి మార్చినా ఆ భారాన్ని ప్రభుత్వమే భరించేలా ఉత్తర్వులివ్వాలి.

విద్యుత్ భారాన్ని తగ్గించాలి : ఎం వీరాచారి, అధ్యక్షులు, ఎల్‌సీటీజీఏ

ప్రభుత్వ పాఠశాలలపై విద్యుత్ భారాన్ని తగ్గించాలి. ఉచిత విద్యుత్‌ను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. పాఠశాల గ్రాంటు నిర్వహణకే సరిపోతున్నది. విద్యుత్ బిల్లులు ప్రధానోపాధ్యాయులకు ఇబ్బందిగా మారింది. ప్రభుత్వం దీనిపై దృష్టిసారించాలి.

చేనేత సహకార వ్యవస్థ నిర్వీర్యానికే టెక్నికల్ అసిస్టెంట్ల తొలగింపు : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో చేనేత సహకార సంఘాలను నిర్వీర్యం చేయడంలో భాగంగానే టెక్నికల్ అసిస్టెంట్లను తొలగించారని తెలంగాణ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేశ్, తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు వనం శాంతికుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలోని చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గత పథకాలను కొనసాగిస్తామని ప్రకటించారని గుర్తుచేశారు. టెక్నికల్ అధికారులు లేకుండా ప్రొక్యూర్మెంట్ ఎలా చేస్తారని ప్రశ్నించారు. టెక్నికల్ అధికారుల తొలగింపు మంత్రికి తెలిసి జరిగిందా? అధికారులు ఈ చర్య తీసుకున్నారా? అని ప్రశ్నించారు. తొలగించిన ఆరుగురు టెక్నికల్ అధికారులను తిరిగి విధుల్లోకి తీసుకొని చేనేత, పవర్‌లూమ్ కార్మికులకు ఉపాధి కల్పించి రక్షించాలని కోరారు. టెక్నికల్ అధికారులు లేకుండా సహకార సంఘాలలోని వస్త్రాలను, బతుకమ్మ చీరలను ఆర్‌వీఎం వస్త్రాలను పరిశీలించి ఏ విధంగా కొనుగోలు చేస్తారో టెస్కో, ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

సాకులు చూపి ఏదీ ఆపం..

సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

'గత ప్రభుత్వంలోని కొందరు మంత్రులు రాష్ట్రం అప్పుల ఊబిలో ఉందనే సాకుతో ఆరు గ్యారంటీలను ఎగ్గొట్టేందుకు ప్రయత్నిస్తున్నామని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. ముందు మెరుగులు, వెనుక డొల్ల లాంటి అభివృద్ధి చేసిన వాళ్లకు ఇంతకంటే మంచి ఆలోచనలు రావు.. కుంటి సాకులతో ఆరు గ్యారంటీల్లో ఏ ఒక్కదాన్నీ ఆపం.. ప్రభుత్వానికి ఇందిరమ్మ అభయహస్తంపై చిత్తశుద్ధి ఉంది' అని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. ఖమ్మంలోని ఎస్‌ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఆయన మీడియాతో చిట్‌చాట్ చేశారు. అనంతరం ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లి మార్కెట్, జేఎన్‌టీయూ కళాశాల స్థల పరిశీలన, తిరుమలాయపాలెం, మంగళగూడెం, నేలకొండపల్లి మండలం మంగాపురం తండా, కూసుమంచి మండలం ముత్యాలగూడెం ప్రజాపాలన సభల్లో మాట్లాడారు. ప్రభుత్వ ఆస్తులను కొల్లగొట్టిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్దులపల్లి మార్కెట్ నిర్మాణ స్థలంలో ఒకప్పుడు పెద్దపెద్ద మట్టిగుట్టలు ఉండేవని, ఆ మట్టిని అమ్ముకుని రూ.కోట్లు సంపాదించుకుని, చివరకు మార్కెట్ నిర్మాణానికి మట్టిలేని పరిస్థితికి తీసుకొచ్చారన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులతో సహా అర్హులందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇస్తామని మంత్రి పునరుద్ఘాటించారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను నెరవేర్చుతామన్నారు. ప్రతి గ్రామంలో అర్హులకు ఆరు గ్యారెంటీలు ఇచ్చి తీరుతామని తెలిపారు. మేడిగడ్డ బ్యారేజీ ఇసుక మీద ర్యాంప్ వేసి కట్టారు. అప్‌స్టిక్, డౌన్‌స్టిక్ కటాఫ్ నిర్మాణం లోపభూయిష్టంగా జరిగిందని తెలిపారు. 180 టీఎంసీలకు గాను లిఫ్ట్ చేసింది 50 టీఎంసీలేనన్నారు. గత ప్రభుత్వం పోతుపోతు విద్యుత్ అందించలేని పరిస్థితి కల్పించిందని తెలిపారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి విద్యుత్‌పై అప్రమత్తమయ్యారని చెప్పారు. కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్, ఎంపీపీ మంగీలాల్, కాంగ్రెస్ నాయకులు రాయల నాగేశ్వరరావు, మద్ది శ్రీనివాసరెడ్డి, రామసహాయం నరేష్‌రెడ్డి, డాక్టర్ కోట రాంబాబు, కొప్పుల అశోక్, చావా శివరామకృష్ణ, ముదిరెడ్డి నిరంజన్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై..

జర్నలిస్టుల సమస్యలను వివిధ యూనియన్ల నాయకులు, పలువురు జర్నలిస్టులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. రాంనారాయణ, టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు ఏ. ఆదినారాయణ, టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యను తక్షణం పరిష్కరించాలని కోరారు. 23 ఎకరాల స్థలాన్ని కేటాయించి సన్మానాలు, సత్కారాలు పొందినా జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్య అపరిష్కృతంగానే ఉందన్నారు. వీటిపై మంత్రి స్పందిస్తూ.. సీఎం హామీ మేరకు త్వరలో రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు మంజూరు చేస్తామని తెలిపారు.

విహారయాత్రలో విషాదం

- కారు అదుపుతప్పి బోల్తా
- ఇద్దరు మృతి, ముగ్గురికి గాయాలు
- మహబూబాబాద్ శివారులో ఘటన

నవతెలంగాణ మహబూబాబాద్

నూతన సంవత్సర సందర్భంగా ఎంతో ఆనందం, ఉత్సాహంతో విహారయాత్రకు బయలుదేరిన యువత జీవితం విషాదమైంది. వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ఇద్దరు మృతి చెందగా ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం రాత్రి మహబూబాబాద్ శివారులోని ఏటిగడ్డ తండా సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా కేంద్రం శివనగర్‌కు చెందిన ఐదుగురు స్నేహితులు రవితేజ(25), వెంగళదాసు సాయిరామ్(26), లక్ష్మణ్, సాయి తేజ, సంగినేని సాయిరాం కలిసి వరంగల్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని మారేడుమిల్లికి విహారయాత్రకు కారులో వయా నర్సంపేట-మహబూబాబాద్ మీదుగా సోమవారం సాయంత్రం బయలుదేరారు. కాగా, రాత్రి మహబూబాబాద్ శివారు ఏటిగడ్డ తండా సమీపంలోకి రాగానే కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టి మూడు ఫల్టీలు కొట్టి కారు రోడ్డు అవతల పడింది. ప్రమాదంలో రవితేజ, వెంగళదాసు సాయిరామ్ అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను మానుకోట మార్చురీకి తరలించారు. గాయపడిన వారిని జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతుల బంధువు జి.పూర్ణ చందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.





చెంచల్‌గూడ, మలక్‌పేటలో...

పెట్రోల్, డీజిల్ కోసం బారులు

ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ల సమ్మె. నిలిచిన ఇంధన సరఫరా

- బంకుల్లో నో స్టాక్ బోర్డులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

కేంద్ర మోటారు వాహనాల చట్ట సవరణను నిరసిస్తూ పెట్రోల్, ఆయిల్ ట్యాంకర్ల డ్రైవర్లు ఆందోళన బాట పట్టడంతో ఇంధన సరఫరా నిలిచిపోయింది. హైదరాబాద్‌లోని పలు పెట్రోల్ బంకుల్లో మంగళవారం నో స్టాక్ బోర్డులు వెలిశాయి. స్టాక్ ఉన్న పెట్రోల్ బంకుల వద్ద వాహనదారుల రద్దీ పెరిగి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

హెచ్‌పీ, బీపీసీ, ఐఓసీ కంపెనీల నుంచి పెట్రోల్ తీసుకెళ్లే డ్రైవర్లు చర్లపల్లి ఆయిల్ కంపెనీల వద్ద ధర్నాకు దిగారు. దాంతో పెట్రోల్, డీజిల్ బంకులకు ఇంధన సరఫరా నిలిచిపోయింది. పలు పెట్రోల్ బంకుల వద్ద యజమానులు నో స్టాక్ బోర్డు పెట్టారు. అలాగే పెట్రోల్ ట్యాంకర్ డ్రైవర్లు సమ్మెకు వెళ్తామని ప్రకటించడంతో నగరంలో వాహనదారులు అప్రమత్తమయ్యారు. ముందస్తుగా తమ వాహనాల్లో పెట్రోల్ కొట్టించడానికి స్టాక్ ఉన్న పెట్రోల్ బంకుల వద్ద క్యూ కట్టారు. దాంతో పలు చోట్ల కిలో మీటర్ల మేర వాహనాలు బారులు తీరి ట్రాఫిక్ జామ్‌కు దారితీసింది. బషీర్‌బాగ్, తార్నాక, హైదర్‌గూడ, లక్డీకాపూల్, అంబర్‌పేట, విద్యానగర్ సహా చాలా ప్రాంతాల్లో పెట్రోల్ బంకుల ముందు భారీ రద్దీ కనిపించింది. తార్నాక ప్రధాన చౌరస్తాలో మూడు పెట్రోల్ బంక్‌లు ఉండటంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. అయితే మంగళవారం సాయంత్రం ఆయిల్ ట్యాంకర్ల డ్రైవర్లు సమ్మె విరమించారు. ఆయిల్ కంపెనీల్లో పెట్రోల్, డీజిల్ నింపుకొని ట్యాంకర్ డ్రైవర్లు బంకులకు బయలుదేరారు. దాంతో వాహనాదారులు ఊపిరి పీల్చుకున్నారు. హిట్ అండ్ రన్ కేసుల్లో కఠిన శిక్షలు పడేలా కేంద్రం ఇటీవల చట్ట సవరణ చేసింది. అయితే ఈ కేసుల్లో కేవలం ట్రక్, లారీ డ్రైవర్లను మాత్రమే బాధ్యులను చేయడంతోపాటు శిక్షను పెంచేలా చట్ట సవరణ ఉందని డ్రైవర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ట్రక్ డ్రైవర్లు ఆందోళన చేపట్టారు.

నవతెలంగాణ

ప్రపంచాన్ని మార్చాలనుకునే వారికి
అత్యంత శక్తివంతమైన ఆయుధం... విద్య - నెల్సన్ మండేలా

బుధవారం 3 జనవరి 2024
www.navatelangana.com

సంపాదకీయం

అడవికి ముప్పు

జార్ఖండ్‌లోని ధన్‌బాద్ జిల్లాలో దామోదర్ నది ఒడ్డున ఉన్న వేలాది ఎకరాల్లో 20 ఏండ్ల నుండి బొగ్గు తవ్వకాలు జరుగుతున్నాయి. అప్పటి నుండి వారి ఇళ్లలో నిత్యం నిల్వ వుండే గోధుమలు, వరి మాయమయ్యాయి. వాటి స్థానంలో నల్లగా మసిబారిన బతుకులు కనిపిస్తాయి. తవ్వకాల కోసం భూములు లాక్కున్నారు కానీ అక్కడి యువతకు ఉద్యోగాలివ్వలేదు. ఒకప్పుడు పంటలు పండించిన ఆ ప్రదేశంలోనే వారి బిడ్డలు ఇప్పుడు బొగ్గు తీసే పనికి పోతున్నారు. సరిగ్గా ఇదే దుస్థితి అతి త్వరలో ఛత్తీస్‌గఢ్‌లో పునరావృతం కాబోతున్నది.

ఆదివాసీ నాయకుల లెక్కల ప్రకారం 2022లో నలభై ఒక్క హెక్టార్ల విస్తీర్ణల్లో ఉన్న చెట్లను నరికివేశారు. 2023 నవంబర్‌లో తొంభై మూడు హెక్టార్ల అడవి విధ్వంసం చేసేందుకు అనుమతి పొందారు. అందులో భాగంగానే నరికివేత పనులు ప్రారంభించారు. ఒక్క ఈ రాష్ట్రంలోనే కాదు దేశంలోని అనేక చోట్ల అక్రమ నరికివేతలు, తవ్వకాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ గనుల తవ్వకం ముఖ్యంగా ఓపెన్ కాస్ట్ మైనింగ్ అడవి బిడ్డలను భూమికి దూరం చెయ్యడమే కాదు అధిక మొత్తంలో వ్యర్థాలను ఉత్పత్తి చేస్తుంది. నేల నాణ్యతను క్షీణింపజేస్తుంది.

అడవిని నాశనం చేస్తున్నామంటే మన వినాశనాన్ని మనమే కోరుకున్నట్టు. అయినా విలువన్నీ కుర్చీల్లోనే చూసుకుని మురిసే వారికి అడవి విలువ, ప్రకృతి ప్రాధాన్యం ఎలా తెలుస్తుంది? అడవంటే గిరిజనుల బతుకు. అందులోని ప్రతి అణువూ వారి సొంతం. అయితే చట్టంలోని కొన్ని లొసుగులను అడ్డుపెట్టుకుని వారికి దక్కాల్సిన భూములను ప్రభుత్వ అండతో కార్పొరేట్లు అప్పనంగా మింగేస్తున్నారు. దీనికి నిదర్శనమే ఛత్తీస్‌గఢ్ తాజా ఉదంతం.

ఛత్తీస్‌గఢ్‌లోని మూడు జిల్లాల్లో విస్తరించి ఉన్న అడవి భూములను అదానీ గ్రూప్ మింగేయాలని చూస్తోంది. ఆ ప్రాంతంలో ఉన్న సుమారు మూడువందల డెబ్బై కోట్ల బొగ్గు నిక్షేపాలను స్వాహా చేయాలని ప్రధాని ప్రాణ మిత్రుని గ్రూపు గోతికాడి నక్కలా కాచుక్కుచ్చుంది. ఇంకేముంది మన రాజా వారు వెంటనే అడవుల అక్రమ నరికివేతకు రంగం సిద్ధం చేశారు. ఈ దుర్మార్గాన్ని అడ్డుకున్న పర్యావరణ వేత్తలను బెదిరింపులకు గురిచేస్తున్నారు. అమాయక ఆదివాసీల నోరు నొక్కేందుకు వారి గొంతుకైన నాయకులను నిర్బంధించారు. ఆ రాష్ట్ర తొలి గిరిజన ముఖ్యమంత్రి విష్ణుదేవ్ నాయకత్వంలోనే ఇదంతా జరగడం మరింత దారుణం. దీనిపై ప్రశ్నిస్తే 'గతంలో పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన నరికివేతనే ఇప్పుడు మేం కొనసాగిస్తున్నాం' అంటూ సెలవిచ్చారు. తమ నాశనాన్ని కోరుకునే పాలకులు ఎవరైనా ప్రజలు కచ్చితంగా నిలదీస్తారని పాలకులు గుర్తించాలి.

అక్కడి ఆదివాసీ నాయకుల లెక్కల ప్రకారం 2022లో నలభై ఒక్క హెక్టార్ల విస్తీర్ణల్లో ఉన్న చెట్లను నరికివేశారు. 2023 నవంబర్‌లో తొంభై మూడు హెక్టార్ల అడవి విధ్వంసం చేసేందుకు అనుమతి పొందారు. అందులో భాగంగానే నరికివేత పనులు ప్రారంభించారు. ఒక్క ఈ రాష్ట్రం



లోనేకాదు దేశంలోని అనేక చోట్ల అక్రమ నరికివేతలు, తవ్వకాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ గనుల తవ్వకం ముఖ్యంగా ఓపెన్‌కాస్ట్ మైనింగ్ అడవి బిడ్డలను భూమికి దూరం చెయ్యడమే కాదు అధిక మొత్తంలో వ్యర్థాలను ఉత్పత్తి చేస్తుంది. నేల నాణ్యతను క్షీణింపజేస్తుంది.

ఇక మన రాష్ట్రంలో కూడా ఇలాంటి అక్రమాలు జరుగుతూనే ఉన్నాయి. పచ్చని అడవిని కొల్లగొట్టే దందాలు యథేచ్ఛగా సాగుతూనే ఉన్నాయి. సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలోని అనేక ప్రాంతాల్లో సుమారు 7వేల ఎకరాల అటవీ విస్తీర్ణం ఉండేది. పచ్చని వనాలతో అహ్లాదకరంగా ఉండే ఈ అటవీ ప్రాంతం ఆక్రమణదారుల చేతిలో కరిగిపోయి కేవలం మూడువేల ఎకరాలు మాత్రమే మిగిలింది. మన పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో కూడా అధికార పార్టీ నేతల కనుసన్నల్లో గ్రావెల్ మాఫియా బరితెగించింది. ఇటీవలే వేల కోట్ల రూపాయల విలువైన గ్రావెల్‌ను తవ్వి తరలించుకుపోతున్న మాఫియాపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. విజయవాడ శివారులోని అనేక గ్రామాల్లో వెయ్యి కోట్ల వరకు అక్రమాలు జరిగాయని సమాచారం.

అడవులను, గ్రామాలను నిర్వీర్యం చేసేందుకు ఇన్ని దుర్మార్గాలు జరుగుతుంటే పాలకులు మాత్రం చోద్యం చూస్తున్నారు. పైగా దేశంలోని 7,08,273 చదరపు కిలోమీటర్ల అటవీ ప్రాంతాన్ని రక్షించే పేరుతో అటవీ శాఖ అధికారులకు అపరితమైన అధికారాలు కట్టబెట్టడానికి ప్రయత్నించారు. దాని కోసమే మోడీ నాయకత్వంలో 2019లో భారత అటవీ చట్టం ముసాయిదా సిద్ధం చేశారు. ఉదారవాద ఆర్థిక విధానాలకు అనుగుణంగా అటవీ సంపదను వాణిజ్య ప్రయోజనాలకు వినియోగించుకునే అవకాశాన్ని కూడా ఇందులో చేర్చారు. ఈ బిల్లు 2006 నాటి అటవీ హక్కుల చట్టంలోని కొన్ని అంశాలను ఉల్లంఘించేట్టు ఉన్నాయి. ఫలితంగా ఆక్రమణలకు గురైన భూమి 1.3 మిలియన్ హెక్టార్లకు పెరిగిందని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఈ లెక్కలు పరిశీలిస్తే అడవుల ఆక్రమణ బీజేపీ పాలిత రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, గుజరాత్, ఒడిషా, జార్ఖండ్, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాల్లోనే ఎక్కువని స్పష్టంగా తెలుస్తోంది.

అదే సమయంలో ప్రధాని అడవుల పెంపకం కోసం ప్రతిష్టాత్మక ప్రణాళికలను ప్రకటించారు. 2030 నాటికి క్షీణించిన భూమిని 21 మిలియన్ హెక్టార్ల నుండి 26 మిలియన్ హెక్టార్లకు పునరుద్ధరించాలని ఐక్యరాజ్యసమితి సమావేశంలో అద్భుతంగా ప్రసంగించారు. కానీ దేశంలో పరిస్థితి చూస్తే దీనికి పూర్తి భిన్నంగా ఉంది. 'దోచుకునేటోడికి దోచుకున్నంత' అన్నట్టుగా మారిపోయింది. ప్రధాని మాటలకు, చేతలకు పొంతన ఉండదని మరోసారి రుజువయింది. ఇటువంటి పరిస్థితుల్లో అడవులను కాపాడుకునే బాధ్యత కేవలం అడవి బిడ్డలదే అనుకుంటే పొరపాటు. అడ వులు అంతరించిపోతే గిరిపుత్రులకే కాదు పర్యా వరణానికే పెను ప్రమాదం. మానవ మనుగడే కష్టం. కాబట్టి దేశం లోని విస్తారమైన అడవులను కార్పొరేట్లకు కట్టబెడుతున్న పా ల కులను నిలదీయాల్సిన అవసరం ప్రతి పౌరుడికీ ఉంది.



ఇజ్రాయిల్-పాలస్తీనా ఘర్షణ నేర్పుతున్న పాఠమేంటి?

తమను తాము అత్యంత క్రూరంగా బాధించుకున్న యూ దులకు, వారు స్థాన చలనం కలిగించిన వారి నిస్సహాయతను, కోరికను అర్థం చేసుకోవడం నిజానికి అసాధ్యమా? తీవ్రమైన బాధ నిత్యం క్రూరత్వాన్ని ప్రేరేపిస్తుందా? ఇది మానవ జాతికి ఎలాంటి ఆశను కలిగిస్తుంది? విజయం సాధించిన సందర్భంలో పాలస్తీనా ప్రజలకు ఏమి జరుగుతుంది? రాజ్యం లేని జాతి చివరకు ఒక రాజ్యాన్ని ప్రకటిస్తే, అది ఎలాంటి రాజ్యం అవుతుంది? దాని జెండా కింద ఎలాంటి భయంకర నేరాలు, ఘోరాలు జరుగుతాయి? జాతి, మతంతో నిమిత్తం లేకుండా ప్రతీ ఒక్కరికీ స్వేచ్ఛ, గౌరవం లభించే హక్కుల కోసం మనం పోరాడుతున్న ప్రత్యేక రాజ్యం ఇదేనా? మధ్య ప్రాచ్యంలో పాలస్తీనా ఒకప్పుడు మత రహిత కోట.కానీ ఇప్పుడు హమాస్ మతపరమైన భావజాలాన్ని సమర్థిస్తూ, ఇస్లాం పేరుతో పోరాడుతోంది. "మేము దాని సైనికులం,శత్రువులను దహించే దాని అగ్ని కణాలం" అని హమాస్ మ్యానిఫెస్టో చెపుతుంది. ఆత్మాహుతి బాంబు దాడులు చేసే వారిని ఖండించాలని ప్రపంచానికి పిలుపునిచ్చారు.కానీ వారు ఈ గమ్యానికి చేరుకోవడానికి ముందు వారు ప్రయాణించిన సుదీర్ఘమైన మార్గాన్ని మనం విస్మరించగలమా?సెప్టెంబర్ 11, 1922 నుండి సెప్టెంబర్ 11,2002 - 80 సంవత్సరాలు యుద్ధం చేయడం అనేది సుదీర్ఘ కాలం.పాలస్తీనా ప్రజలకు ప్రపంచం ఇవ్వగలిగిన సలహా ఏదైనా ఉందా? వారు గోలా మెయిర్‌ను తీసుకొని, వారిని ఉనికిలో ఉండకుండా ఉంచే నిజమైన ప్రయత్నం ఏమైనా చెయ్యాలా?

ఇరవై ఒక్క సంవత్సరాల క్రితం నేను న్యూ మెక్సికోలో 'రా సెప్టెంబర్ ' ప్రసంగం చేసినప్పుడు,పాలస్తీనా విషయంలో అమెరికాలో ఒకరకమైన నిశ్శబ్దం ఉంది. దాని గురించి మాట్లాడిన వారు భారీ మూల్యాన్ని చెల్లించారు. నేడు యువకులంతా వీధుల్లో ఉన్నారు. ముందు నుంచి యూదులు, పాలస్తీనియన్లు నాయకత్వం వహిస్తూ, వారి ప్రభుత్వం, అమెరికా ప్రభుత్వం ఏమి చేస్తోందని ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. అత్యంత ఉన్నత ప్రాంగణాలతో పాటు విశ్వవిద్యాలయాలు అట్టుడికి పోతున్నాయి. వాటిని మూసేయడానికి పెట్టుబడి



అరుంధతీ రాయ్

దారీ విధానం వేగంగా కదులుతుంది. దాతలు నిధులను నిలిపివేస్తామని బెదిరిస్తున్నారు, తద్వారా అమెరికా విద్యార్థులు ఏమి చెప్పవచ్చు లేదా ఏమి చెప్పకూడదు, వారు ఎలా ఆలోచిస్తారు లేదా ఎలా ఆలోచించకూడదు అనేది నిర్ణయం అవుతుంది.ఉదారవాద విద్య అని పిలువబడే పునాది సూత్రాల ప్రధాన కేంద్రానికి ఇదొక దెబ్బ. వలసానంతర వాదం, బహుళ సాంస్కృతిక వాదం, అంతర్జాతీయ చట్టం, జెనీవా సభలు, మానవ హక్కుల సార్వత్రిక ప్రకటనల లాంటివి అన్నీ పోయాయి. వాక్ స్వేచ్ఛ లేదా ప్రజా నైతికత లాంటివి పోయాయి. అంతర్జాతీయ చట్టం న్యాయవాదులు, పండితులు చెప్పే "యుద్ధం" జాతి సంహారం అన్ని చట్టపరమైన ప్రమాణాలకు అనుగుణంగా ఉంది.దీనిలో నేరస్థులు తమను తాము బాధితులుగా చెప్పుకున్నారు.వర్ణ వివక్షత రాజ్యాన్ని నడిపే వలసవాదులు అణచివేతకు గురైన వారుగా చెప్పుకున్నారు.

9/11 తరువాత పౌర హక్కులను విచ్ఛిన్నం చేయడానికి, విస్తృతమైన దురాక్రమణ నిఘా వ్యవస్థను నిర్మాణించడానికి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పాలనా వ్యవస్థలకు అమెరికా యుద్ధం రక్షణను ఇచ్చింది.దానిలో మన ప్రభుత్వాలకు మన గురించి ప్రతీది తెలుసు కానీ మనకు వారి గురించి ఏమీ తెలియదు.అదేవిధంగా, అమెరికా నూతన మెకార్థీయిజం గొడుగు కింద ప్రపంచంలో ఉన్న దేశాల్లో ఘోరమైన విషయాలు పెరిగి, అభివృద్ధి చెందుతాయి. మన దేశంలో కొన్ని సంవత్సరాల క్రితమే ప్రారంభమైందనుకోండి. కానీ మనం మాట్లాడకుంటే, అది ఊపందుకుంటుంది, మనను తుడిచి పెడుతుంది.భారతదేశంలోని అగ్రశ్రేణి యూనివర్సిటీలలో ఒకటైన ఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ విద్యార్థుల ప్రవర్తనా నియమావళిని జారీ చేసింది.నిరాహార దీక్ష లేదా ధర్నాకు దిగిన ఏ విద్యార్థి అయినా రూ.20 వేలు జరిమానా చెల్లించాలి.దేశ వ్యతిరేక నినాదాలు చేస్తే రూ.10 వేలు జరిమానా విధించారు.ఆ నినాదాలు ఏమిటి అనేవి ఇంకా ఆ జాబితాలో లేవు. కానీ ముస్లింల జాతి నిర్మూలన, ముస్లింల జాతి ప్రక్షాళన కోసం ఇచ్చే పిలుపులు దానిలో ఉండవని మాత్రం ఖచ్చితంగా చెప్పొచ్చు. కాబట్టి పాలస్తీనాలో యుద్ధం కూడా మనదే. మనం చెప్పవలసింది ఖచ్చితంగా చెప్పాలి,పదే పదే స్పష్టంగా చెప్పాలి.

ఇజ్రాయిల్, వెస్ట్ బ్యాంక్‌ను ఆక్రమించడం, గాజాను ముట్టడించడం మానవత్వానికి వ్యతిరేకంగా జరిగిన నేరాలు. ఆక్రమణకు పెట్టుబడి పెట్టి, మద్దతిచ్చిన అమెరికా, ఇతర దేశాలు కూడా ఆ నేరంలో భాగస్వాములే. ప్రస్తుతం మనం చూస్తున్న ఘోరం, హమాస్‌తో పాటు ఇజ్రాయిల్ పౌరులను అనాలోచితంగా చంపడం అనేది ఆక్రమణ,ముట్టడిల పర్యవసానంగానే జరిగింది. క్రూరత్వం గురించి చేసే ఎన్ని వ్యాఖ్యానాలైనా,రెండు పక్షాల మితిమీరిన చర్యల ఖండనలైనా గానీ,పరిష్కారానికి దారి తీయవు. ఆక్రమణే రాక్షసత్వాన్ని పెంచుతుంది.ఇది నేరస్తులకు,బాధితులకు ఇరువురికీ హాని కలిగిస్తుంది.బాధితులు చనిపోతారు. నేరస్తులు, వారు చేసిన పనితో జీవించాల్సి ఉంటుంది. వారి పిల్లలు కూడా తరతరాలుగా అలాగే ఉంటారు.

పరిష్కారం మిలిటరీ సంబంధమైనది కాదు.ఇజ్రాయిలీలు, పాలస్తీనియన్లు ఇద్దరూ కలిసి గౌరవంగా,సమాన హక్కులతో జీవించే రాజకీయంగా మాత్రమే ఇది ఉంటుంది.ప్రపంచం జోక్యం చేసుకోవాలి.ఆక్రమణ అంతం కావాలి.పాలస్తీనియన్లు మాతృభూమిని కలిగి ఉండాలి.పాలస్తీనా శరణార్థులకు తిరిగి వచ్చే హక్కు ఉండాలి. లేకపోతే, పాశ్చాత్య ఉదారవాద నైతిక నిర్మాణం ఉనికిలో లేకుండా పోతుంది.ఇది ఎప్పుడూ కపటంగానే ఉన్నదనే విషయం మనకు తెలుసు. కానీ ఇది కూడా ఒక విధమైన ఆశ్రయాన్ని సమకూర్చింది.ఆ ఆశ్రయం మన కళ్ళముందే కనుమరుగవుతుంది. కాబట్టి దయచేసి పాలస్తీనా, ఇజ్రాయిల్ కొరకు, జీవించి ఉన్నవారి కొరకు,చనిపోయిన వారి పేరున, ఇజ్రాయిల్ జైల్లో ఉన్న పాలస్తీనియన్లు, హమాస్ చేతిలో బందీలుగా ఉన్న వారి కోసం, మొత్తం మానవాళి కోసం ఈ వధను ఆపండి.

("ఫ్రంట్ లైన్" సౌజన్యంతో)

అనువాదం : బోడపట్ల రవీందర్, 9848412451

విలక్షణ తీర్పునిచ్చిన సింగరేణి కార్మికులు

అనేక సంవత్సరాల కాలయాపన తర్వాత హైకోర్టు ఆదేశాల మేరకు ఎట్టకేలకు సింగరేణిలో డిసెంబర్ 27న ఎన్నికలు జరిగాయి. ఎన్నికలు వాయిదా వేయించాలని సర్కార్ సంఘాలు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోయింది. ఏఐటీయూసీ విజయం సాధించడాన్ని స్వాగతిస్తున్నాం. ఏఐటీయూసీ కార్మికులకు ఇచ్చిన హామీలను, వారి ఆకాంక్షలను నెరవేర్చడంలో సఫలం కావాలని ఆశిస్తున్నాం. ఈసారి సీఐటీయు మూడో స్థానంలోకి వచ్చింది. రామగుండంలోని మూడు ఏరియాల్లో కలిపి 2,437 ఓట్లు సాధించి ప్రధాన సంఘాలకు ధీటుగా నిలబడింది.



భూపాల్
9490098034

సుదీర్ఘకాలం పాటు ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా స్థానిక సమస్యలపై సీఐటీయు చేసిన పోరాటాలే పుంజుకోవడానికి ప్రధాన కారణం. ఇతర సంఘాలతో పాటు ప్రజాప్రతినిధులందరూ ఎన్ని ప్రయత్నాలు చేసినా సీఐటీయుకు స్వచ్ఛందంగా కార్మికులు ఓట్లు వేశారు. ఈ ఎన్నికల్లో సింగరేణి కార్మికులు విలక్షణమైన తీర్పునిచ్చారు. ఏఐటియుసికి గుర్తింపు సంఘంగా బాధ్యతను ఇస్తూనే అధికార పార్టీ సంఘం ఐఎన్‌టియుసిని కూడా ఆరు డివిజన్లో గెలిపించి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి తమ వంతు కర్తవ్యం నిర్వ

రాబోయే కాలంలో కేంద్ర ప్రభుత్వం కమర్షియల్ మైనింగ్ పేరుతో తెలంగాణలో బొగ్గు బావులను ప్రయివేటు పరం చేయబోతున్నది. సింగరేణిలో ఇప్పుడున్న అండర్ గ్రౌండ్ ఓపెన్ కాస్ట్ బొగ్గు నిక్షేపాలు 10 నుండి 15 ఏండ్లలో పూర్తవుతాయి. కొత్త బొగ్గు బ్లాక్‌లు రాకపోతే సింగరేణి భవిష్యత్తు ప్రశ్నార్థకమే. సింగరేణి పరిశ్రమను రక్షించుకోవాల్సిన ప్రధాన కర్తవ్యం కార్మికవర్గానిదే. గతంలో సీఐటీయు చొరవతో మూడు రోజులపాటు సమ్మె చేసి బొగ్గు బావులు ప్రయివేటు కాకుండా అడ్డుకున్నది సింగరేణి కార్మిక వర్గం. గెలిచిన ఏఐటీయూసీ గాని, అధికార కాంగ్రెస్ అనుబంధ సంస్థ ఐఎన్‌టియుసిలు పైరవీలకు ప్రాధాన్యత నివ్వకుండా పోరాటాలకు ప్రాధాన్యతనిస్తూ అందరినీ కలుపుకొని పోవాలి. ఓడిన సంఘాల కార్యకర్తలను వేధించకుండా, బ్లాక్ మెయిల్ చేయకుండా కార్మికవర్గ స్ఫూర్తిని కొనసాగించాలి.

ర్తించాలని నిర్దేశించారు. నిబద్ధతతో పోరాడే సీఐటీయుకు మంచి ఓటింగ్ ఇచ్చి భవిష్యత్తు పోరాటాలకు నాంది పలికారు.

ఈ ఎన్నికల్లో సింగరేణి కార్మికులను ప్రభావితం చేసిన ప్రధాన సమస్యలేవంటే -ఒకటి. పదేండ్లపాటు బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ విధానాలపైన కార్మిక వర్గం విసిగిపోయి ఉన్నారు. రెండవది కొత్త బావులు తవ్వలేదు. మూడవది అవినీతి, పైరవీలు ప్రతి పనికి లంచాలు విపరీతంగా పెరిగిపోయాయి. నాలుగవది సింగరేణి నిధులను సొంత ఆస్తులాగా ప్రభుత్వం వాడుకోవడాన్ని కార్మికులు జీర్ణించుకోలేకపోయారు. ఐదవది ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయలేదు. ఆరవది సింగరేణి సంస్థలో ప్రయివేటీకరణ, కాంట్రాక్టీకరణ, ఔట్‌సోర్సింగ్ విధానాలు యథేచ్ఛగా పెరిగిపోవడం, కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య 22వేలకు పైగా పెరగడం వారిని పర్మినెంట్ చేయకపోవడం , బీఆర్ఎస్ అనుబంధ సంఘం వీటిని ప్రశ్నించలేకపోవడం పైగా ప్రభుత్వానికే ఊడిగంచేయడంతో ప్రభుత్వ అనుబంధ సంఘాలు గెలవకూడదని కార్మికులు నిశ్చయానికి వచ్చారు. ఐఎన్‌టియుసి ఓడిపోవడానికి ఇది కూడా ఒక కారణం.

మరోవైపు సీఐటీయు గత కొంత కాలంగా చేసిన పోరాటాల ఫలితంగా కొన్ని సమస్యలను ఈసారి ఎన్నికల్లో అన్ని యూనియన్లు తమ ఎజెం డాగా పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వాటిలో సింగరేణి కార్మికులకు సొంత ఇంటి కల నెరవేర్చాలని, 2011లో కోల్ ఇండియాలో జరిగిన ఒప్పందం ప్రకారం సింగరేణిలో కూడా పెర్క్స్ పైన ఆదాయపన్ను తిరిగి కార్మికులకు చెల్లించాలని ప్రధాన సమస్య. సింగరేణి కార్మికుల పిల్లలకు సీబీఎస్ఈ సిల బస్‌తో కూడిన విద్య ఉండాలని, సింగరేణి హాస్పిటల్స్‌ను అభివద్ధి చేయాలని, కార్మికుల కాలనీలలో రోడ్లు వేయాలని, డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపరచాలని మిషన్ భగీరథ నీళ్లు అందించాలని ఎన్నికల్లో సీఐటీయూ ప్రచారం చేసింది. ఈ అంశాలన్నీ ప్రభావితం చేయడంతో ఏఐటీయూసీ, ఐఎన్‌టియుసి కూడా వాటిని హామీ ఇచ్చారు. రాబోయే కాలంలో బొగ్గు బావుల ప్రయివేటీకరణ ఆపడం, కొత్త బావులు తవ్వడం సింగరేణి కార్మికులకు సొంత ఇల్లు, అలవెన్స్‌ల సమస్యలను గెలిచిన సంఘం పరిష్కరించవలసి ఉంటుంది. ఓడిపోయిన ఐఎన్టీయూసీ కూడా తమ ప్రభుత్వం అధికారంలో ఉంది కాబట్టి ప్ర భుత్వం పైన ఒత్తిడి తీసుకొని వచ్చి సాధించవలసిన అవసరం ఉంటుంది. ఈ సమస్యలపై రాబోయే కాలంలో కూడా ఐక్య ఉద్యమాల కోసం సీఐటీయు శక్తివంచన లేకుండా కషి చేయాల్సిన అవసరం ఉంది. రోజురోజుకూ నిర్వీర్యం కాబోతున్న సింగరేణి సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత కార్మికులపై, సంఘాలపై ప్రధానంగా ఉంది.

సింగరేణిలో ప్రయివేటీకరణ విధానాలు!

సింగరేణి గనులు 1889లో ప్రారంభమయ్యాయి. సింగరేణి సంస్థలో రాష్ట్రం 51 శాతం, కేంద్ర వాటా 49 శాతం ఉన్న సంగతి తెలిసిందే. గోదావరి ప్రాణహిత నది పరివాహక ప్రాంతంలో 350 కిలోమీటర్ల పరిధిలో విస్తరించింది. ప్రస్తుతం 24 భూగర్భంలో 18 ఉపరితల గనులు మొత్తం 42 గనులున్నాయి. మరో వంద సంవత్సరాలకు సరిపడా బొగ్గు నిలువలు కలిగి ఉంది. 2022-23 ఆర్థిక సంవత్స రంలో67 మిలియన్ టన్నుల బొగ్గు ను ఉత్పత్తి చేశారు. రూ.32,978 కోట్ల టర్నోవర్ సాధించింది. రూ.2,184 కోట్లు లాభాలు వచ్చాయి. తొలిసారిగా ఒడిషాలో నైని బొగ్గు బ్లాక్‌ను సింగరేణి పొందింది. 16 రాష్ట్రాల్లోని పరిశ్రమలకు బొగ్గు రవాణా చేస్తున్నది. రాష్ట్రంలోని జెన్కోకు ఇతర విద్యుత్ ప్లాంట్లకు కూడా పెద్ద ఎత్తున బొగ్గు సరఫరా చేస్తున్నది. సుమారుగా రాష్ట్ర ప్రభుత్వం రూ.29 వేల కోట్లు సింగరేణికి బకాయి పడిందని లెక్కలు చెప్తున్నారు. సింగరేణి నిధులను బీఆర్ఎస్ ప్రభుత్వం పప్పు బెల్లల్లాగా వాడుకున్నది. ఈ పదేండ్ల కాలంలో సింగరేణి సంస్థ కేంద్ర ప్రభుత్వానికి రూ.26,208 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వానికి రూ.23,446 కోట్లు వివిధ రకాల టాక్సులు, రాయల్టీల రూపంలో చెల్లించింది.

అపారమైన ఈ సంపదను ప్రయివేటు వాళ్లకు కొల్లగొట్టి పెట్టాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయ త్నిస్తూ ఉన్నది. రాష్ట్ర ప్రభుత్వం కొత్త బావులు తవ్వకుండా ఉన్న వాటిలోనే ప్రయివేటు కాంట్రాక్టు విధానాల అమలు చేస్తూ కార్మికులను, సంస్థ నిధులను దోచుకుంటున్నది. 1998లో 1,06,00మంది ఉద్యోగులు ఉంటే, తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు 2012లో ఎన్నికలు జరిగినప్పుడు టీఆర్ఎస్ సంఘం గెలిచిన సందర్భంగా 65 వేల మందికి తగ్గారు. ఈ కాలంలోనే ఏఐటీయూసీ, ఐఎన్‌టియుసి గుర్తింపు సంఘాలుగా పనిచేశాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత 2017లో మరొకసారి ఎన్నికలు జరిగినపుడు ముఖ్యమంత్రిగా కేసీఆర్ జోక్యం చేసుకొని కార్మికులకు ఇచ్చిన హామీల వల్ల గెలిచారు. కానీ టీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలోనే 2023 నాటికి వచ్చేసరికి ఇది 25 వేల ఉద్యోగాలు తగ్గిపోయి 37,773కు చేరింది. డిపెండెంట్‌లకు ఉద్యోగాలివ్వాలని, కారుణ్య నియామకాలు ఉండాలని పెద్ద ఎత్తున పోరాడితే 2018లో 15256 మందికి వారసులకు ఉద్యోగాలు వచ్చాయి. ప్రస్తుతం సగం పాత వారు సగం యువతతో సింగరేణి కార్మికవర్గం ఉంది. 2002వ సంవత్సరంలో ఏఐటియుసి గుర్తింపులో ఉన్న సందర్భంగా డిపాండెంట్ల ఉద్యోగాలను రద్దు చేస్తూ ఒప్పందం చేసుకున్నారు. ఫలితంగా 16 సంవ త్సరాల పాటు డిపెండెంట్‌లకు ఉద్యోగాలు లేకుండా నష్టం ఏర్పడింది. సింగరేణి వ్యాప్తంగా కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ విధానం విస్తరించింది.బొగ్గును ప్రయివేటు యంత్రాల ద్వారా తీస్తున్నారు. సింగరేణి ప్రభుత్వ సంస్థగా సొంతంగా బొగ్గు బావులు తవ్వుకోవడానికి అవకాశం ఉన్నా ప్రయివేటు సంస్థలకు అవకాశం ఇస్తున్నారు. హెవీ మిషనరీ అంతా ఆపరేషన్ మెయింటెనెన్స్ పేరిట ప్రయివేటు సంస్థలే నిర్వహిస్తున్నాయి. ఒడిషాలోని నైనీ బ్లాకును, భూపాలపల్లి లోని కాకతీయ 2,5లను, మందమర్రిలోని శాంతిఖని, శ్రీరాంపూర్‌లో ఆర్‌కెపి-7, న్యూ టెక్ గనులను లాంగ్‌వాల్, షార్ట్‌వాల్ పేరుతో ప్రయివేటు కంపెనీలకు కట్టబెట్టింది.అండర్ గ్రౌండ్‌లో రూఫ్ బోల్టింగ్, శ్రాబ్ , బెల్ట్ క్లీనింగ్, కోల్ ట్రాన్స్‌పోర్ట్ అంతా కాంట్రాక్టర్లే నిర్వహిస్తున్నారు. కోల్ శాంప్లింగ్ అవుట్‌సోర్సింగ్ ఇచ్చారు. రూ.8 వేల కోట్లతో నిర్మించిన జైపూర్ పవర్ ప్లాంట్ నో స్టిగ్ జర్మనీ కంపెనీకి అప్పగించింది. సివిల్ వర్క్స్, ఆఫీసులు, గార్డెన్లు, నర్సరీలు, క్యాంటీన్‌లతో సహా ప్రయివేటు ఔట్‌సోర్సింగ్‌కి ఇచ్చారు. సిరుల కురిపించే సింగరేణి సంస్థ ప్రయివేటు సంస్థల వారికి స్వర్గధామంగా విలసిల్లుతున్నది. దీనికి ప్రభుత్వాలు ఎంత కారణమో గుర్తింపు సంఘాలుగా పని చేసిన సంఘాలు కూడా పరోక్షంగా అంతే కారణం.



గుర్తింపులో లేకున్నా సీఐటీయు నిరంతరం పోరాటం !

జేబీసీసీఐలో మెంబర్‌గా ఉంటూ వేతన ఒప్పందాల సందర్భంలో కార్మికులకు న్యాయంగా రావలసిన అంశాలపై

ఈ ఎన్నికల్లో సింగరేణి కార్మికులను ప్రభావితం చేసిన ప్రధాన సమస్యలేవంటే -ఒకటి. పదేండ్లపాటు బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ విధానాలపైన కార్మిక వర్గం విసిగిపోయి ఉన్నారు. రెండవది కొత్త బావులు తవ్వలేదు. మూడవది అవినీతి, పైరవీలు ప్రతి పనికి లంచాలు విపరీతంగా పెరిగిపోయాయి. నాలుగవది సింగరేణి నిధులను సొంత ఆస్తులాగా ప్రభుత్వం వాడుకోవడాన్ని కార్మికులు జీర్ణించుకోలేకపోయారు. ఐదవది ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయలేదు. ఆరవది సింగరేణి సంస్థలో ప్రయివేటీకరణ, కాంట్రాక్టీకరణ, ఔట్‌సోర్సింగ్ విధానాలు యథేచ్ఛగా పెరిగిపోవడం, కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య 22వేలకు పైగా పెరగడం వారిని పర్మినెంట్ చేయకపోవడం , బీఆర్ఎస్ అనుబంధ సంఘం వీటిని ప్రశ్నించలేకపోవడం పైగా ప్రభుత్వానికే ఊడిగం చేయడంతో ప్రభుత్వ అను బంధ సంఘాలు గెలవకూడదని కార్మికులు నిశ్చయానికి వచ్చారు.

సీఐటీయు పట్టుబట్టి పోరాడి సాధించింది. ఇప్పటివరకు 11 వేతన ఒప్పందాలు జరిగాయి. ఐదవ వేతన ఒప్పందంలో చొరవచేసి 210 పాయింట్లు పాయింట్‌కు రెండు రూపాయలు చొప్పున జరిగిన నష్టాన్ని సరి చేయించింది. ఆరవ వేతన ఒప్పందంలో మూడు ఇంక్రిమెం ట్లు ఇప్పించింది. ఏడవ వేతన ఒప్పందంలో వేతన ఒప్పందాలు ఐదేండ్ల కాలపరిమితి ఉండాలని, ఎనిమి దవ వేతన ఒప్పందంలో జీతం పెరుగుదల పర్సెంటేజ్ లోకి తీసుకు రావాలని, డీఏ న్యూట్రలైజేషన్ చేయాలని మూడు శాతం కుములేటివ్ ఇంక్రిమెంటు, తొమ్మిదవ వేతన ఒప్పందంలో కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు జేబీ సీసీఐ అగ్రిమెంట్లో రూపొందించడం జరిగింది. సీఎం పిఎఫ్ వడ్డీ రేటును 2018 నుంచి 20 మధ్యకాలంలో 8.5 శాతానికి బదులు 8శాతం లెక్కిస్తే సరిచేయించి వేల రూపాయలు కార్మికులకు ఇప్పించింది. సింగరేణి కార్మికుల కోసం 250 గజాల స్థలం కొలిండియా మాదిరిగా రూ.30లక్షల వడ్డీ లేని రుణం లేదా వారు నివసిస్తున్న క్వార్టర్ వారికి పర్మినెంట్ చేయాలని సొంతింటి పథకం అమలు చేయాలని రాష్ట్ర అధ్యక్షులు ఆమరణ నిరాహార దీక్షలతో సహా పెద్దఎత్తున పోరాటాలు చేసిన ఫలితంగా ఈరోజు ఎజెండా ముందుకొచ్చింది.

రాబోయే కాలంలో కేంద్ర ప్రభుత్వం కమర్షియల్ మైనింగ్ పేరుతో తెలంగాణలో బొగ్గు బావులను ప్రయివేటు పరం చేయబోతున్నది. సింగరేణిలో ఇప్పుడున్న అండర్ గ్రౌండ్ ఓపెన్ కాస్ట్ బొగ్గు నిక్షేపాలు 10 నుండి 15 ఏండ్ల లో పూర్తవుతాయి. కొత్త బొగ్గు బ్లాక్‌లు రాకపోతే సింగరేణి భవిష్యత్తు ప్రశ్నార్థకమే. సింగరేణి పరిశ్రమను రక్షించుకోవాల్సిన ప్రధాన కర్తవ్యం కార్మికవర్గానిదే. గతంలో సీఐటీయు చొరవతో మూడు రోజులపాటు సమ్మె చేసి బొగ్గు బావులు ప్రయివేటు కాకుండా అడ్డుకున్నది సింగరేణి కార్మిక వర్గం. గెలిచిన ఏఐటీయూసీ గాని, అధికార కాంగ్రెస్ అనుబంధ సంస్థ ఐఎన్‌టియుసిలు పైరవీలకు ప్రాధాన్యతనివ్వకుండా పోరాటాలకు ప్రాధాన్యతనిస్తూ అందరినీ కలుపుకొని పోవాలి. ఓడిన సంఘాల కార్యకర్తలను వేధించకుండా, బ్లాక్ మెయిల్ చేయకుండా కార్మికవర్గ స్ఫూర్తిని కొనసాగించాలి.

సామాజిక విప్లవమూర్తి సావిత్రిబాయి పూలే

మూడు వేల ఏండ్ల మనుస్మృతి మానసిక విషమ చట్టాల మాటున దేశంలో మెజార్టీ ప్రజలకు సకల హక్కులు నిషేధం. ద్వితీయ శ్రేణి పౌరురాలుగా అణిచివేతకు గురైన ఓ మహిళ, నాగరికపు సమాజాన్ని నిర్మించడానికి నానా కష్టాలు అవమానాలు భరించింది. మనుషులు అందరూ సమానులే నని చాటడానికి తన జీవితాంతం కృషి చేసింది. శూద్రులు మహిళలకు అస్పృశ్యులకు విద్య అనే ఆయుధాన్ని అందించింది. ఆమె నాటి చీకటి సమాజానికి వెలుగు దివిటి అందించింది. ఆమె వీరవనిత, సామాజిక విప్లవ మాతృమూర్తి, చదువుల తల్లి సావిత్రిభాయి పూలే. సావిత్రిభాయి కృషిని సరస్వతి దేవి దయగా మార్చేస్తున్న మనువాదపు కుతంత్రాలను ఛేధించాల్సిన అవసరం ఉంది. వేల ఏండ్లుగా శూద్రులు అస్పృశ్యులకు మహిళలు చదవకూడదు చదువు వినకూడదనే కఠిన విషమ షరతులు నూటికి 90శాతం మందిని నిరక్షరాస్యులుగా అనాగరిక సమాజంలో వదిలేసింది. దీనివల్ల దేశం వెనుకబాటు




టీ స్కైలాబ్ బాబు
9177 549646

కారణం అయింది. సావిత్రిభాయి పూలే 1831వ సంవత్సరం జనవరి 3న మహారాష్ట్రలోని సతారా జిల్లా నయగావ్ అనే గ్రామంలో ఒక రైతు కుటుంబంలో జన్మించింది. తొమ్మిదో ఏటనే జ్యోతిబాపూలేని వివాహమాడింది. నిరక్షరాశ్యురాలైన సావిత్రిబాయి పూలేకి తన భర్త జ్యోతిబాపూలే మొదటి గురువుగా విద్యాజ్ఞానం నేర్పి సామాజిక ఉద్యమకారిణిగా తీర్చిదిద్దాడు. 1947 నాటికి తన భర్తతో కలిసి శూద్ర కులాల బాలికల కోసం పూణేలో మొట్టమొదటి బాలికా పాఠశాలను ఆమె ప్రారంభించారు. న్యాయం, ప్రజాస్వామ్యం, స్త్రీ పురుష సమానత్వం అనే ఆదర్శాలు సావిత్రిబాయి పూలే జీవితంలో సహజ గుణాలుగా నిలిచిపోయాయి. ఆ రోజుల్లోనే స్త్రీ పురుష సమానత్వంపై సావిత్రిబాయి ప్రత్యేక చైతన్య కార్యక్రమాలను నిర్వహించింది. 19వ శతాబ్దంలో కుల వ్యతిరేక పురుషాధిక్య వ్యవస్థపై జరిగిన పోరాటాల్లో సావిత్రిబాయి పూలే ప్రత్యక్ష భాగస్వామురాలైంది.

1848లో మొట్టమొదటిసారిగా తొమ్మిది మంది విద్యార్థినీలతో ఒక బాలికా పాఠశాలను సావిత్రిబాయి తన స్నేహితురాలు ఫాతిమా షేక్ ఇరువురు కలిసి సమర్థవంతంగా నడిపారు. ఆమె రోజు పాఠశాలకు వెళ్లేదారిలో అటకాయించి మట్టి, పేడ, రాళ్ల విసిరేవారు. వేధింపులకు గురి చేయడమే కాక నానా బూతులు తిట్టి అవమానించేవారు. అయినప్పటికీ తన లక్ష్యం కోసం ఆమె నిలిచింది. 1870 సంవత్సరంలో దేశవ్యాప్తంగా తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి ఆ సమయంలో అనాధ బాలికలు కరువు పీడిత పేద పిల్లల కోసం ఒక వసతి గృహాన్ని నడిపించారు.1890లో నవంబర్ 28న జ్యోతిబాపూలే మరణించగా, సావిత్రి తన భర్త చితికి నిప్పంటించారు. అనంతరం సత్యశోధక్ సమాజ్ మొత్తం బాధ్యతలు అన్నిటినీ ఆమె స్వయంగా నిర్వహించారు. 1896లో కరువు సంభవించినప్పుడు ప్రభుత్వంతో పోరాడి బాధితుల కోసం నిధులు మంజూరు చేయించారు ప్లేగు వ్యాధి సోకిన బాధితులకు ప్రత్యక్షంగా సేవలందిస్తున్న క్రమంలోనే ఆమెకు సైతం ప్లేగు వ్యాధి సోకింది. చివరికి 1897 మార్చి 10న సావిత్రిబాయి కన్నుమూశారు.

నాడు సావిత్రిబాయి అందరికీ చదువు కోసం అహర్నిశలు తపిస్తే, నేటి పాలకులు కొనుక్కోగలిగిన కొందరికే చదువు అందించే బాధ్యత నిర్వహిస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్తు తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటుందని చెప్పిన కొఠారి కమిషన్ సిఫారసులను పాలకులు పట్టించుకోవడం లేదు కాసులు ఉన్నవారికి కార్పొరేట్ విద్య, కటిక దరిద్రం అనుభవిస్తున్న వారికి ప్రభుత్వ బడులలో నాసిరకమైన విద్యను అందిస్తున్న దుస్థితి నెలకొంది. విద్యా వైద్యం ఎట్టి పరిస్థితులలో ప్రయివేట్ కార్పొరేట్ శక్తుల చేతుల్లో ఉండకూడదని ఆ రెండు ఎల్లప్పుడు ప్రభుత్వ సంక్షేమ రంగంలో మాత్రమే ఉండాలని భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ మనకు నొక్కి చెప్పారు. కానీ నేడు జరుగుతున్నది ఏమిటి? అంబేద్కర్ ఆలోచనలు, సావిత్రిబాయి పూలే ఆచరణ పద్ధతిని నేటి పాలకులు తుంగలో తొక్కుతున్నారు. ఉన్నత విద్యను ఉన్నత వర్గాలకే కట్టబెట్టే ప్రయత్నంలో భాగంగా యూనివర్సిటీలను ప్రయివేటు కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారు. శాస్త్ర, సాంకేతిక రంగం పురోభివృద్ధి చెందుతున్న నేటి ఆధునిక యుగంలో సైతం విద్యా రంగంలో మనువాద మత చాందస భావాలను జొప్పిస్తున్నారు మూఢవిశ్వాసాలు, అశాస్త్రీయ భావాలు అబద్ధాలను ఆయుధాలుగా వాడుకొని కేంద్రంలోని బీజేపీ సర్కార్ విద్యారంగాన్ని పూర్తిస్థాయిలో కలుషితం చేస్తున్నది. చరిత్ర సామాజిక శాస్త్రాలను సమాధి చేస్తోంది. మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా పాఠ్యాంశాలను రూపొందిస్తుంది ఎన్సీఈఆర్టీలో మత ఉన్మాదం నింపుకున్న వారితోనే పాఠ్యాంశాలను తయారు చేయిస్తోంది. లౌకిక విలువలు మత సామరస్యం సమాఖ్యస్ఫూర్తి వంటి రాజ్యాంగ మార్గదర్శకాలను మట్టిలో పాతి పెడుతోంది. ప్రజల్లో రోజురోజుకీ పెరుగుతున్న అసంతృప్తిని పక్కదారి పట్టించడానికి అనేక ప్రయత్నాలు చేస్తోంది. నిరుద్యోగులు తమ ఉపాధి గురించి మాట్లాడకుండా దేశం సరిహద్దు విషయాలు పక్క దేశంపై పగ పెంచుకునే విషయాలు, మనోభావాల పేరిట యువతరాన్ని పక్కదారి పట్టిస్తోంది. నిరుద్యోగం ఉపాధి లేమి వ్యవసాయ సంక్షోభం కార్మికుల కనీస వేతనాల లేమి జీఎస్టీ పెద్దనోట్ల రద్దు, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం నిర్వీర్యం వంటి అనేక సమస్యల నుండి ప్రజల దష్టిని మళ్లిస్తోంది. గతంలో రాంనాథ్ కోవింద్‌ను అయోధ్య గుడిలో పలికి అనుమతించలేదు. నేడు ద్రౌపది ముర్మూ అయోధ్య రామమందిర భూమి పూజకు ఒక గిరిజన వితంతువు అని ఆహ్వానించలేదు. అత్యున్నత అతిథులకే ఈ కాలంలో జరిగిన వివక్షలను దేశమంతా కళ్లారా చూసింది.

సావిత్రిబాయి కాలంలో శూద్రులు అస్పృశ్యులు మహిళలకు చదువును నిరాకరిస్తే, నేటి పాలకులు ప్రయివేటు యూనివర్సిటీలు, విద్యాసంస్థలు నెలకొల్పి పేద విద్యార్థులకు విద్యను దూరం చేస్తున్నారు. రాష్ట్రంలో 86 కుల దురహంకార హత్యలు జరిగాయి. వీడీసీల పేరిట దళితులు, గిరిజనులు బలహీన వర్గాలను సాంఘిక బహిష్కరణలు చేస్తున్న దుస్థితిని నెలకొంది. దళితులపై దాడులు దౌర్జన్యాలు నేటికీ కొనసాగడం వెనకాల ఉన్న ఆర్థిక వెనుకబాటుతనం, సామాజిక అణిచివేతలు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. సావిత్రి బాయి పూలే లక్ష్యాలు ఆశయాల్ని ఆచరించాలనుకునే ప్రతి ఒక్కరూ ఆమె జీవితాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి. పేపర్ మీద గీసిన బొమ్మను చూపించి అందరికీ చదువు రావడానికి సరస్వతి దేవి కారణమంటూ ఆర్ఎస్ఎస్ వాళ్లు సాగిస్తున్న ప్రచారాన్ని ప్రతి ఘటించాలి దేశానికి మొట్ట మొదటి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలేనని చాటి చెప్పాలి. సావిత్రిబాయి కంటే ముందు శూద్రులు, అస్పృశ్యులు మహిళలు చదువుకు దూరంగా ఉన్న దుస్థితి. సావిత్రి బాయి పూలే లక్ష్యాలు, ఆశయాలు పాలకులు ఆచరించాలనుకుంటే అందరికీ సమాన విద్యను అందించే విధంగా ప్రయత్నాలు సాగించాలి. సావిత్రిబాయి పూలే ఏ సామాజిక విప్లవాత్మక మార్పుల కోసం పరితపించారో ఆ లక్ష్యం నేటికీ నెరవేర్చబడలేదు. ఆమె చూపిన మార్గం ప్రజాస్వామిక వాదులకు ఒక సవాలు గానే మిగిలింది.



(నేడు సావిత్రి బాయి పూలే 193వ జయంతి)



ప్రజలకు మెరుగైన సేవలు అందించండి

- విద్యుత్ ఇంజినీర్లతో సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ, ప్రభుత్వానికి సహకరించాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి విద్యుత్ ఇంజినీర్లకు సూచించారు. తెలంగాణ స్టేట్ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ (టీఎస్‌పీఈఏ) ఆధ్వర్యంలో పలువురు విద్యుత్ ఇంజినీర్లు మంగళవారం సచివాలయంలో సీఎంను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్‌రంగ ప్రధాన్యత, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. విద్యుత్ సంస్థల్లో త్వరగా డైరెక్టర్ల నియామకం చేపట్టాలని ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పీ రత్నాకరరావు, పీ సదానందం కోరారు. విద్యుత్ సంస్థల్లోని ఉద్యోగులు సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ టీఎస్‌ఎస్పీడీసీఎల్ కంపెనీ సెక్రటరీ జనప్రియ, టెక్నికల్ సెక్రటరీ గోపాలకృష్ణ, విద్యుత్ సౌధ బ్రాంచ్ సెక్రటరీ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం - ఎయిర్‌పోర్ట్ మెట్రో ఆపండి...

(మొదటిపేజీ తరువాయి)

తలపెట్టిన 31 కిలోమీటర్ల మేర మెట్రో (రూ.6,250 కోట్లు)ను పక్కన పెట్టేయాలని తెలిపారు. దానికి బదులుగా ఎంజీబీఎస్ నుంచి పాతనగరం మీదుగా, అదే విధంగా ఎల్‌బీ నగర్ నుంచి ఎయిర్ పోర్టుకు మెట్రో కనెక్టివిటీ ఇచ్చే దానిపై దృష్టి సారించాలని కోరారు. అదే విధంగా నాగోల్ మెట్రో స్టేషన్ నుంచి ఎల్.బీ.నగర్ మెట్రో స్టేషన్‌కు విస్తరించటం ద్వారా 5 కిలోమీటర్ల గ్యాప్ ను పూరించాలన్నారు. లక్ష్మీగూడ- జల్ పల్లి -మామిడిపల్లి మధ్య కొత్త మెట్రో మార్గానికి ఉన్న అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు. మెట్రోకు కేటాయించేందుకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిని గుర్తించాలని ముఖ్యమంత్రి కార్యాలయ ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రితో పాటు పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్‌ను ఆదేశించారు.

సమావేశంలో వచ్చిన అంశాల ఆధారంగా కేంద్ర పట్టణాభివద్ధి శాఖ మంత్రి హర్దీప్ సింగ్ కోసం లేఖను సిద్ధం చేయాలని హెచ్‌ఎండీఏ కమిషనర్, హెచ్‌ఎంఆర్‌ఎల్ ఎండీలను ఆదేశించారు. ఎయిర్ పోర్ట్ ఏరియా నుంచి కందుకూరుకు మెట్రో రైల్ కనెక్టివిటీ ఇచ్చేందుకు ప్రణాళికను సిద్ధం చేయాలనీ, అదే విధంగా మెట్రో మూడో దశలో జేబీఎస్ మెట్రో స్టేషన్ నుంచి శామీర్ పేట్, పారడైజ్ మెట్రో స్టేషన్ నుంచి కండ్లకోయ లేదా మేడ్చల్ వరకు కవర్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి, ఇంటలిజెన్స్ ఐజీ బి.శివ్‌ధర్ రెడ్డి, సీఎంఓ కార్యదర్శి షానవాజ్ ఖాసీం పాల్గొన్నారు.

దమ్ముంటే సీబీఐ విచారణ చేయండి

(మొదటిపేజీ తరువాయి)

శుభాకాంక్షలు తెలిపారు. 2024 గగన్‌యాన్ సంవత్సరంగా నిలవబోతున్నదని ఆకాంక్షించారు. కేసీఆర్ ప్రభుత్వం హయాంలో అతిపెద్ద స్కాం కాళేశ్వరం ప్రాజెక్టు అని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే ఆ ప్రాజెక్టుపై విచారణ చేయిస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడెందుకు చప్పుడు చేయడం లేదని ప్రశ్నించారు. చిత్తశుద్ధితో సీబీఐ విచారణ చేయించి కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ఒక్కటి కాదని నిరూపించుకోవాలని సూచించారు. తుమ్మితే ఊడిపోయేలా కాంగ్రెస్ ప్రభుత్వముందనీ, అందుకే బీఆర్‌ఎస్‌కు మేలు చేసేలా ఆ పార్టీ వ్యవహరిస్తోందని విమర్శించారు.

రెండు పార్టీల మధ్య విభేదాలొద్దనే ఎంఐఎం మధ్యవర్తిత్వంతో మాజీ సీఎం కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి లోపాయికారి ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వం వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని కాళేశ్వరం ద్వారా గోదాట్లో కలిపిందని విమర్శించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఆధ్వర్యంలో హైలెవల్ ఎక్స్‌పర్ట్ కమిటీ మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిన ఘటనపై విచారణ జరిపి రాష్ట్ర ప్రభుత్వ లోపాలను ఎత్తి చూపిందన్నారు. 20 అంశాలపై ఆ కమిటీ వివరాలను అడిగితే అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం 11 అంశాలపైనే అరకొర సమాధానాలిచ్చిందని విమర్శించారు. అవినీతితో విడదీయరాని బంధమున్న కాంగ్రెస్ పార్టీ బీఆర్‌ఎస్ స్కామ్‌ల పట్ల సానుభూతి చూపుతున్నదని ఆరోపించారు. సీబీఐ ఎంక్వైరీ జరపాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరితే 48 గంటల్లో దర్యాప్తును ప్రారంభిస్తుందని హామీనిచ్చారు.

అది మీ చేతుల్లోనే ఉందిగా...

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. "మీరు దోచుకోండి..మాకు వాటా ఇవ్వండి" అనేవిధంగా కేంద్రం వ్యవహరించిందని ఆరోపించారు. పవర్ ఫైనాన్స్ కార్పోరేషన్, రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పోరేషన్ నిబంధనలు మార్చి తెలంగాణ ఇరిగేషన్ ప్రాజెక్టులకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రుణాలు ఇప్పించిందని చెప్పారు. గతంలో ఎన్నడూ ఇలా జరగలేదన్నారు. కలిసి దోచుకుందామనే రుణాలు ఇప్పించారా? బీఆర్‌ఎస్ అవినీతికి నిలువుటద్దంగా నిలిచిన మేడిగడ్డ బ్యారేజీని ఇప్పటివరకు ఎందుకు సందర్శించలేదు? నోరు మెదపని అప్పటి సీఎంను ఎందుకు ప్రశ్నించలేదు? మీడియాపై నిషేధం విధించినా ఎందుకు స్పందించలేదు? అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై ఉత్తమ్ ప్రశ్నల వర్షం కురిపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్‌కు ఏటీఎంలా మారిందని విమర్శలు చేసే బీజేపీ అగ్ర నేతలు విచారణకు ఎందుకు ఆదేశించలేదు? కేసీఆర్‌ను అరెస్టు ఎందుకు చేయలేదు? అని నిలదీశారు. దేశంలో ప్రతిపక్ష నాయకులను అన్యాయంగా అరెస్టు చేసిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి కేసీఆర్‌పై అంత ప్రేమ ఎందుకని ప్రశ్నించారు. లిక్కర్ స్కాంలో కవితను అరెస్టు చేయకపోవడం వెనక మతలబేంటని నిలదీశారు. బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాల అవినీతి కారణంగా తెలంగాణ ప్రజలపై లక్షల కోట్ల భారం పడిందని చెప్పారు. కాళేశ్వరం అవినీతిలో భాగస్వాములైన ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తేలేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టంచేశారు.

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదును పెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు
(10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	64,090	▲	220
22 క్యారెట్లు	58,750	▼	200
కిలో వెండి	80,000	▲	300



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ.	112
రిటైల్ (లైవ్)	రూ.	134
స్కిన్‌తో	రూ.	194
స్కిన్‌లెస్	రూ.	221

కాంగ్రెస్‌లోకి వైఎస్ షర్మిల

(మొదటిపేజీ తరువాయి)



పడి, పార్టీ విలీనాన్ని తాత్కాలికంగా వాయిదా వేసింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్‌కు అనుకూలంగా రావడం, ఆ పార్టీ అధికారంలోకి రావడంతో మరోసారి వైఎస్ షర్మిల తన పార్టీని విలీనం చేసే అంశాన్ని తెరపైకి తెచ్చారు. అయితే ఈసారి తెలంగాణ కాంగ్రెస్‌లో కాకుండా ఆంధ్రప్రదేశ్ కమిటీలో పని చేయాలని అధిష్టానం సూచించినట్టు తెలుస్తోంది. ఏపీలో కాంగ్రెస్ బలహీనంగా ఉండటం, అక్కడ నాయకత్వ కొరత ఉండటం తోపాటు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో శాసనసభలో తగిన స్థానాలను దక్కించుకోవాలంటే షర్మిల అవసరం ఉందని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ఒకవైపు వైఎస్ఆర్ పార్టీ, మరోవైపు టీడీపీ, జనసేన కూటమి మధ్య ద్విముఖ పోటీ అనే వాతావరణం ఉన్నది. దీన్ని బ్రేక్ చేసేందుకు షర్మిలను రంగంలోకి దించాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ఇప్పటికే హస్తం పార్టీ నుంచి ఇతర పార్టీల్లో చేరిన పార్టీ సీనియర్ నేతలు కూడా షర్మిల చేరితే, తాము సొంతింటికి వస్తామని చెబుతున్నట్టు తెలుస్తోంది. సీఎం జగన్మోహన్‌రెడ్డిని ఎదుర్కొవాలంటే, ఆంధ్రలో షర్మిల బాణాన్ని వదలాలని ఏఐసీసీ నిర్ణయించింది. దీనికి షర్మిల కూడా సమ్మతించడంతో విలీన మార్గం సుగమమైనట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన ఏపి కాంగ్రెస్ సమన్వయ కమిటీ సమావేశం జరిగిన విషయం తెలిసిందే. ఏపీ అసెంబ్లీ, లోకసభ ఎన్నికలకు సన్నద్ధత, అనుసరించాల్సిన వ్యూహాలు, పొత్తులు, చేరికలు, పార్టీ బలోపేతంపై అందులో చర్చించారు. కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల్లో ఎన్నికల గ్యారంటీలు ఇచ్చినట్టుగానే ఏపీ ప్రజలకు కొన్ని గ్యారెంటీలు ఇచ్చే అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ రకంగా ఆ పార్టీ అధిష్టానం పావులు కదుపుతున్నట్టు ప్రచారం జరుగుతున్నది.

ఏపీపీసీసీ పగ్గాలు షర్మిలకేనా?

వైఎస్ షర్మిల కాంగ్రెస్‌లో చేరితే.. ఏఐసీసీలో ముఖ్యమైన స్థానంతోపాటు ఏపీలో పీసీసీ బాధ్యతలు కూడా తనకే అప్పగించాలని మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీని ఆమె కోరినట్టు తెలుస్తున్నది. అందుకు అధిష్టానం కూడా సుముఖంగా ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది.

తెలంగాణ క్యాడర్ డైలమా..

2021 జులై 8న వైఎస్ఆర్‌టీపీ పేరుతో రాజకీయ పార్టీని షర్మిల స్థాపించారు. తెలంగాణలో వైఎస్ఆర్ సంక్షేమ పాలన తీసుకురావటమే తన లక్ష్యమని ప్రకటించారు. ప్రజా ప్రస్థానం పేరుతో 3,800 కిలోమీటర్లకు పైగా ఆమె సుదీర్ఘ పాదయాత్ర నిర్వహించారు. రాష్ట్రంలో పార్టీ స్థాపించి రెండేండ్లు అయినప్పటికీ అది ఎంత మాత్రమూ ప్రభావాన్ని చూపించలేకపోయింది. ఆశించిన స్థాయిలో ప్రజల నుంచి స్పందన కరువైంది. అయితే షర్మిల కేసీఆర్ పాలనపై ఘాటుగా విమర్శలను సంధించారు. బీజేపీ, కాంగ్రెస్‌పై పదునైన వ్యాఖ్యలు చేస్తూ రాజకీయ వేడి పెంచారు. అయినప్పటికీ క్యాడర్‌లో జోష్ నింపలేకపోయారనే విమర్శలు సొంత పార్టీలోనే వచ్చాయి. ఆ తర్వాత తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయకుండా కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నట్టు ప్రకటించారు.

సెక్యులర్ పార్టీ..అందుకే చేరుతున్నా..

'దేశంలో కాంగ్రెస్ అతిపెద్ద సెక్యులర్ పార్టీ. ప్రతి ఒక్కరికి భద్రత కల్పిస్తున్నది. అందుకే ఆ పార్టీలో చేరేందుకు నాకు ఎలాంటి అభ్యంతరం లేదు. బుధవారం ఢిల్లీకి వెళ్తున్నాను. ఒకటి రెండు రోజుల్లో అందరి ప్రశ్నలకు సమాధానం దొరుకుతుంది' అని షర్మిల ప్రకటించారు.

జనవరి 13 నుంచి 15 వరకు కైట్ ఫెస్టివల్

పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి జూపల్లి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్.

అంతర్జాతీయ వేడుకైన హైదరాబాద్ కైట్ ఫెస్టివల్‌ను జనవరి 13 నుంచి 15 వరకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర పర్యాటక శాఖమంత్రి జూపల్లి కష్ణారావు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని బేగంపేట్ హరిత ప్లాజాలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.

అనంతరం మంత్రి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఫెస్టివల్‌ను నిర్వహిస్తామన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో 16 దేశాల నుంచి 40 మంది అంతర్జాతీయ కైట్ ప్లేచర్లు 60 దేశవాళీ కైట్ క్లబ్ సభ్యులు, పాల్గొని పలు డిజైన్లలో రూపొందించిన పతంగులను ఎగుర వేస్తారని తెలిపారు. వీటితో పాటు జాతీయ, అంతర్జాతీయ స్వీట్లను స్టాళ్లలో అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. సాంస్కతిక కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు హస్తకళలు, చేనేత వస్త్రాల స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సందర్శకులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా జీహెచ్ఎంసీ, పోలీసు, ఇతర శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, పర్యాటక శాఖ డైరెక్టర్ కె.నిఖిల, అసిస్టెంట్ డైరెక్టర్ కే.మహేశ్, ఓం ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరిస్తాం

పీఆర్టీయూటీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణలో సీఎం రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో విద్యారంగంలో నెలకొన్ని ఉన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామంటూ ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని పీఆర్టీయూటీఎస్ అధ్యక్షులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు తెలిపారు. మంగళవారం సచివాలయంలో ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డితోపాటు సీఎం రేవంత్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు ప్రకటించారు. పీఆర్టీయూటీఎస్ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, పెండింగ్ బిల్లులు తదితర విద్యారంగ సమస్యల గురించి సీఎం దృష్టికి వారు తీసుకెళ్లారు. త్వరలోనే సమీక్షా సమావేశాన్ని నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తామంటూ రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీలు బి మోహన్‌రెడ్డి, పూల రవీందర్, పీఆర్టీయూటీఎస్ మాజీ ప్రధాన కార్యదర్శి గుర్రం చెన్నకేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లతో చర్చలు జరపండి

- ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో చౌహాన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సమ్మెలో ఉన్న ఆయిల్ ట్యాంకర్ల డ్రైవర్లతో చర్చలు జరపాలని ఆయా ఆయిల్ కంపెనీల ప్రతినిధులను పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీ.ఎస్.చౌహాన్ కోరారు. సమ్మె నేపథ్యంలో మంగళవారం పౌరసరఫరాశాఖ కమిషనర్ డీ.ఎస్.చౌహాన్ బీపీసీఎల్, ఐఓసీఎల్, హెచ్‌పీసీఎల్ ప్రతినిధులతో హైదరాబాద్‌లోని పౌరసరఫరాల సంస్థ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్ల సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని సూచించారు.

పెట్రోల్, డీజిల్ నిరంతర సరఫరాకు అన్ని చర్యలు తీసుకున్నామనీ, ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. డ్రైవర్లకు, ఆయిల్ కంపెనీలకు ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

టీజీఎల్ఏ అధ్యక్షులుగా కనకచంద్రం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ (టీజీఎల్ఏ) నూతన కార్యవర్గం ఎన్నికైంది. మంగళవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. టీజీఎల్ఏ అధ్యక్షులుగా సిహెచ్ కనకచంద్రం, ప్రధాన కార్యదర్శిగా ఆర్ శేఖర్, అసోసియేట్ అధ్యక్షులుగా కొండల్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నరసింహ, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా సిద్దారెడ్డి, ప్రచార కార్యదర్శిగా నాగేందర్, అధికార ప్రతినిధిగా నంట శ్రీనివాస్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా పవన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కనకచంద్రం మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించేందుకు సంఘం ముందుంటుందని చెప్పారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వ కాలేజీలను బలోపేతం చేసేందుకు ప్రతి అధ్యాపకుడూ కృషి చేయాలని సూచించారు.

మరోసారి "మహామాంద్యం"! :ట్రంప్ హెచ్చరిక

ప్రపంచ గమనం



వచ్చే సంవత్సరం తాను అధ్యక్షుడిగా ఎన్నిక కాకపోతే అమెరికా ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కుప్పకూలుతుందని అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హెచ్చరించాడు. ఈ విషయాన్ని ఆయన తన ట్రూత్ సోషల్ ప్లాట్ ఫాం మీద పెట్టిన ఒక పోస్టులో వివరించాడు. 2024లో తాను అధ్యక్షుడిగా ఎన్నికవుతాననే ఆశతో మాత్రమే స్టాక్ మార్కెట్ ఉచ్చ స్థితిలో ఉందని ట్రంప్ రాశాడు. తాను మళ్ళీ గెలవకపోతే 1929లో వచ్చిన మహామాంద్యంలో కన్నా దారుణంగా స్టాక్ మార్కెట్ పతనమౌతుందని ట్రంప్ రాశాడు. తన పాలనలో సాధించిన విజయాల వల్లనే వర్తమానంలో ఆర్థిక వ్యవస్థ సజీవంగా ఉందని ఆయన అన్నాడు. జో బైడెన్ పాలనలో ద్రవ్యోల్బణం పెరిగి వినియోగదారుల కొనుగోలు శక్తి పూర్తిగా నశించిందని ట్రంప్ చెప్పాడు. 2021లో బైడెన్ పాలన మొదలయ్యాక ద్రవ్యోల్బణం 17% దాకా ఉందని చూపే గణాంకాలు లోపభూయిష్టమైనవని, అవి దాదాపు సగం ద్రవ్యోల్బణాన్ని మాత్రమే చూపిస్తున్నాయని, పాత పద్ధతి ప్రకారం గణిస్తే ద్రవ్యోల్బణం 30%దాకా ఉంటుందని ఆయన వాదిస్తున్నాడు. బైడెన్ పాలనలో ద్రవ్యోల్బణం గత 40సంవత్సరాలలో ఎన్నడూ లేనంతగా ఉంది.

1929లో జరిగిన స్టాక్ మార్కెట్ పతనంతో డౌ జోన్స్ పారిశ్రామిక సగటు 89% మూడు సంవత్సరాలపాటు పతనం అయింది. రెండు దశాబ్దాల తరువాత సంభవించిన రెండవ ప్రపంచ యుద్ధం ముగిసేవరకు ఈ పతనం నుంచి అమెరికా కోలుకోలేదు. రెండవ ప్రపంచ యుద్ధం తరువాతే అమెరికా ఆర్థిక వ్యవస్థ పునరుత్తేజం పొందింది. పట్ట పగ్గాలులేని స్పెక్యులేషన్, ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను పెంచటంవంటి అనేక కారణాలవల్ల అప్పటి మహామాంద్యం సంభవించింది. బైడెన్ పాలనకు కేవలం 34% కొత్త ఓటర్లు మాత్రమే అనుకూలంగా ఉన్నారు. అమెరికా ఆర్థిక పరిస్థితి బ్రహ్మాండంగా ఉందని బైడెన్ ప్రభుత్వం చెబుతున్నప్పటికీ అమెరికా వినియోగదారుల క్రెడిట్ కార్డు బకాయిలు గత నెలలో చరిత్ర లో ఎన్నడూ లేనంతగా ఉన్నాయి. ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ న్యూయార్క్, జెపి మోర్గాన్ విశ్లేషకులు పేర్కొన్నట్టుగా ఈ పరిస్థితి కోవిడ్-19 మహమ్మారి కాలంలో అమెరికన్లు చేసుకున్న పొదుపు పూర్తిగా కరిగిపోయిందని సూచిస్తోంది. ప్రతి 10మంది అమెరికన్లలో 4గురి దగ్గర అత్యవసర స్థితి ఏర్పడినప్పుడు ఆదుకునేందు కోసం 400డాలర్లు కూడా లేవని మే నెలలో నిర్వహించిన ఒక సర్వేలో తేలింది. అదే సమయంలో ఎస్‌ఎంపి 500 ఎన్నడూలేనంత ఎక్కువగా ఉంది. అలాగే డౌ జోన్స్ తన రికార్డును తానే బ్రేక్ చేసింది.

నేడు ఇండియా ఫోరం భేటీ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ప్రతిపక్ష పార్టీల ఇండియా ఫోరం వర్చువల్ మీట్ నేడు (బుధవారం) జరుగనుంది. జూమ్ మీటింగ్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సహా పలువురు కీలక నేతలు పాల్గొననున్నారు. ఫోరం ప్రధాన పార్టీల జాతీయ అధ్యక్షులంతా ఈ వర్చువల్ మీట్‌లో పాల్గొంటారు. ఈ సమావేశంలో నితీష్ కుమార్ పేరును ఫోరం కన్వీనర్‌గా కాంగ్రెస్ సీనియర్ నేతలు ప్రతిపాదించే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాల సమాచారం. నితీష్‌ను ఫోరం కన్వీనర్‌గా ప్రకటించే విషయంలో ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేష్ యాదవ్ అభిప్రాయాలు తీసుకుందని, శరద్ పవార్, ఉద్ధవ్ థాకరేతో ఇప్పటికే సంప్రందిపులు జరిపిందని తెలుస్తోంది. ఇండియా ఫోరం ఇంత వరకూ నాలుగు సార్లు సమావేశమైంది. తొలి సమావేశం పాట్నాలో జూన్ 23న, రెండో సమావేశం బెంగళూరులో జూలై 17-18న, మూడో సమావేశం ముంబాయిలో ఆగస్టు 31-సెప్టెంబర్ 1న, నాలుగో సమావేశం ఢిల్లీలో డిసెంబర్ 19న జరిగింది.

ఏప్రిల్, మేలో సార్వత్రిక ఎన్నికలు

కాగా, 18వ లోక్‌సభ ఎన్నికలు ఈ ఏడాది ఏప్రిల్-మే మాసాల్లో జరిగే అవకాశం ఉంది. జూన్ చివరికల్లా 17వ లోక్‌సభ గడువు తీరనుంది. గత లోక్‌సభ ఎన్నికలు 2019 ఏప్రిల్-మేలో జరిగాయి.

నాలుగో రోజు.. 20.39 దరఖాస్తులు


- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సీఎస్ శాంతికుమారి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రజాపాలనలో భాగంగా మంగళ వారం నిర్వహించిన అభయహస్తం కార్యక్రమం కింద 20,39,927 దరకాస్తులను స్వీకరించినట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వెల్లడించారు. ప్రజాపాలన నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో టెలీ కాన్పరెన్స్ నిర్వహించి సమీక్షించారు. రాష్ట్రంలోని అన్ని గామపంచాయతీలు, మున్సిపల్ వార్డుల్లో నిర్వహించిన గ్రామసభల్లో ఏవిధమైన ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు చేపట్టినట్టు జిల్లా కలెక్టర్లు వివరించారు. అన్ని గ్రామ సభల్లో దరకాస్తుల కొరత ఏర్పడకుండా ముందస్తుగానే అదనపు దరకాస్తులను అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. నాలుగోరోజైన నేడు మొత్తం 20 ,39 ,927 దరకాస్తులు స్వీకరించగా, వీటిలో అభయహస్తం గ్యారెంటీలకు సంబంధించి 17,39,146 దరకాస్తులు రాగా, ఇతర అంశాలకు సంబంధించి 3,00,817 వచ్చాయని చెప్పారు.

సిట్టింగ్‌లకే సీట్లని ఎవరు చెప్పారు?

- సగం సీట్లకు అభ్యర్థులు ఖరారైపోయారు
- ఫిబ్రవరి 28న లేదా మార్చి తొలివారంలో లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్
- 7,8 తేదీల్లో ఎన్నికల టీమ్ సమావేశం: మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'రాష్ట్రంలోని బీజేపీ సిట్టింగ్ ఎంపీలకు సీట్లు కన్ఫర్మ్ అని ఎవరు చెప్పారు? రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశంలో అమిత్‌షా హామీనిచ్చారని ఎవరన్నారు? దాని గురించి నిమిషం కూడా చర్చ జరగలేదు. ఆశావహుల మధ్య తీవ్ర పోటీ ఉంది. రాష్ట్రంలో 50 శాతం సీట్లకు అభ్యర్థులు ఖరారైపోయారు.' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి అన్నారు. లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ ఫిబ్రవరి 28వ తేదీనగానీ, మార్చి తొలివారంలోగానీ వస్తుందని చెప్పారు. తమ పార్టీపైనా, అయోధ్య రామాలయంపైనా సీపీఐ, సీపీఎం నేతలు పదేపదే చేస్తున్న విమర్శలు తమకే ప్లస్ పాయింట్ అవుతున్నాయని చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ నిర్వహించారు. జర్నలిస్టులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. బీజేపీని విమర్శించేందుకే కొందరు ట్విట్టర్(ఎక్స్)ను వాడుతున్నారని విమర్శించారు.

అయోధ్య రామాలయంలో ప్రాణ ప్రతిష్ట లైవ్ కార్యక్రమం అన్ని ఆలయాల్లోనూ ఉంటుందని చెప్పారు. రామ మందిరం నిర్మాణాన్ని వ్యతిరేకించిన వారిని కూడా ప్రాణ ప్రతిష్టకు ఆహ్వానించామన్నారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 7, 8 తేదీల్లో ముఖ్యనేతల సమావేశం నిర్వహించబోతున్నామనీ, దానికి జాతీయ నేతలు కూడా వస్తారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన కమిటీలను ఆ సమావేశంలోనే నిర్ణయిస్తామన్నారు. నెలాఖరులోగా పార్లమెంట్ సెగ్మెంట్లతో కార్యాలయాలు ప్రారంభిస్తామన్నారు. అధిష్టానం తనను అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయొద్దని ఆదేశించటంతోనే ఊరుకున్నానన్నారు. వరంగల్ నుంచి బీజేపీ అభ్యర్థిగా మందకృష్ణ మాదిగ పోటీ చేయబోతున్నారనే బేస్‌లెస్ న్యూస్ వస్తున్నదనీ, ఆ ప్రచారం సరిగాదని కొట్టిపడేశారు. ఢిల్లీలో పొగమంచు కారణంగా అమిత్‌షా లేటుగా వచ్చి..సాయంత్రం త్వరగా వెళ్లటం వల్లనే బీజేపీ ఎల్పీనేత నిర్ణయం వాయిదాపడిందన్నారు. కానీ, గెలిచిన ఎమ్మెల్యేల దగ్గరకు వెళ్లి అమిత్‌షా పలుకరించారన్నారు. జిల్లా అధ్యక్షుల మార్పుపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో గతం కంటే వంద శాతం ఓటింగ్ పెరిగిందని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లోనూ ఎక్కువ సీట్లు సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీసీలకు ఎక్కువ సీట్లుస్తామనీ, ఈసారి ముందే అభ్యర్థులను ప్రకటిస్తామని తెలిపారు. నిజమైన బీజేపీ కార్యకర్తలెవ్వరూ నేతలపై సోషల్‌మీడియా వేదికగా విమర్శలు చేయరనీ, సమస్య ఉంటే వచ్చి తమతో చర్చించి పరిష్కరించుకుంటారని తెలిపారు. 2047లో ఎవరు, ఏ పార్టీ వారు ఎర్రకోటపై జెండా ఎగురవేస్తారన్నది తమకు ముఖ్యం కాదనీ, అప్పటి వరకు అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో భారత్‌ను చూడాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య చీకటి ఒప్పందం కుదిరిందని ఆరోపించారు. తమకు ఎవ్వరితోనూ పొత్తు ఉండబోదనీ, స్వతంత్రంగా 17 స్థానాల్లోనూ పోటీచేస్తామని చెప్పారు.ఎన్డీయేలో పెద్ద పార్టీగా అందరినీ కలిసి వెళ్ళాలని నిర్ణయించుకున్నామనీ, అందులో భాగంగానే జనసేన తమతో ఉంటుందని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్-బీజేపీ మధ్యనే తీవ్ర పోటీ ఉంటుందనీ, బీఆర్ఎస్‌కు ఓటు వేసినా ప్రయోజనం ఉండదనే భావనకు ప్రజలు వచ్చారని తెలిపారు.

గాజాలో యుద్ధం 2024లో ముగియదు : ఇజ్రాయిల్



2024 చివరి వరకు గాజాలో ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధం కొనసాగుతుందని ఇజ్రాయిల్ రక్షణ దళాల అధికార ప్రతినిధి రియర్ అడ్మిరల్ డేనియల్ హగారి ఆదివారంనాడు ఒక ప్రకటనలో తెలిపాడు. ఇజ్రాయిల్ రక్షణ దళాలలో ఐదు రిజర్వ్ బ్రిగేడ్స్ ని ఉపసంహరించాలనే నిర్ణయాన్ని యుద్ధం సుదీర్ఘ కాలం కొనసాగే అవకాశం ఉన్నందున ఇజ్రాయిల్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయటం కోసం వ్యూహాత్మకంగా తీసుకున్నామని ఆయన వివరించాడు. అంతకు ముందు శనివారంనాడు ప్రధాని బెంజమిన్ నెతాన్యాహు మాట్లాడుతూ యుద్ధం అనేక నెలలపాటు కొనసాగుతుందని చెప్పటం జరిగింది. గాజాలో యుద్ధం మొదలయిన తరువాత రెండు నెలల కాలంలో దాదాపు 22000మంది పాలస్తీనా వాసులు మరణించారు. మరో 56000మంది తీవ్రంగా గాయపడ్డారు. గాజాలోని 23లక్షల జనాభాలో 85% ప్రజలు కాందిశీకులుగా మారారు. కాల్పుల విరమణ కోసం ఐక్య రాజ్య సమితి భద్రతా మండలిలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని వీటో చేయటంతో సహా అమెరికా ఇజ్రాయిల్ కు పూర్తి స్థాయిలో మద్దతునిస్తోంది. గాజాను తమ ఆధీనంలోకి తీసుకోవాలని ఇజ్రాయిల్ ప్రయత్నిస్తుండగా ప్రపంచ దేశాలు నిరసిస్తున్నాయి. పాలస్తీనాలో పాలస్తీనా ప్రజల కోసం ఒక రాజ్యం ఏర్పడకుండా అక్కడ శాంతి నెలకొనటం దుస్సాధ్యమని అందరికీ తెలుసు. అటువంటి పాలస్తీనా రాజ్య నిర్మాణాన్ని ఇజ్రాయిల్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది.

క్రమబద్ధీకరణ కోసం నిరీక్షణ

వేతనాల కోసం పోరాటం

- ఉపాధి హామీ ఉద్యోగుల వెతలు
- గత ప్రభుత్వం పెండింగ్ పెట్టింది..
- కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై ఆశలు



నవతెలంగాణ - వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రం ఏర్పడిన తర్వాత పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో భాగంగా రాష్ట్రంలో వివిధ విభాగాల్లో 4000 మంది ఉద్యోగులు 17 ఏండ్లుగా పనిచేస్తున్నారు. రాష్ట్ర విభజనకు ముందు వీరందరినీ ఫిక్స్‌డ్ టెన్యూర్ ఎంప్లాయిస్ (ఎఫ్‌టీఈ) కింద నియ మించారు. ఉపాధి హామీ అడిషనల్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ అసోసియేషన్, ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ అసోసియేషన్, టెక్నికల్ అసిస్టెంట్స్ అసోసియేషన్, కంప్యూటర్ ఆపరేటర్స్ అసోసియేషన్‌లు కలిసి 2020లో జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడి నియమిత కాలానికి నియమించబడిన ఉద్యోగులను క్రమబద్ధీకరించి పే స్కేల్‌వర్తింప చేయాలని పోరాటం ప్రార ంభించారు. సొసైటీ ఫర్ ఎలిమినేషన్ రూరల్ పావర్టీ (సెర్ప్) కింద నియమితులైన 3,972 మంది ఉద్యోగాలను క్రమబద్ధీకరించి, పే స్కేల్ అమలు చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం, ఇదే శాఖలో ఎఫ్‌టీఈ ఉద్యోగులను క్రమబద్ధీకరించకుండా తీవ్ర జాప్యం చేసింది. దాంతో ఎఫ్‌టీఈ ఉద్యోగులను క్రమబద్ధీకరించి పే స్కేల్ అమలు చేయాలని ఆనాటి ప్రభుత్వానికి, ఎమ్మెల్యేలకూ వినతిపత్రాలు సమర్పించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నుంచి వీరి నియామకాలకు సంబంధించిన దస్త్రం ఆర్థిక శాఖకు పంపినా అప్పటి నుంచి పెండింగ్‌లో ఉంది. వీరికి వేతనాలు సైతం మూడు నెలలకోసారి వస్తున్నాయి. కాగా, శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టోలో ఎఫ్‌టీఈ ఉద్యోగులను క్రమబద్ధీకరించి, పే స్కేల్ వర్తింపచేస్తామని ప్రకటించారు. దాని అమలు కోసం ఉద్యోగులంతా ఎదురుచూస్తున్నారు.

ఉపాధి హామీ చట్టంలో అదనపు ప్రోగ్రాం ఆఫీసర్లు, ఇంజినీర్ కన్సల్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లుగా నియమిత కాలానికి నాలుగు వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరంతా 2006లో జిల్లా సెలెక్షన్ కమిటీ (డీఎస్‌ఈ) నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణులైన వారు.. ఎఫ్‌టీఈ పద్ధతిలో నియమించారు.

రాష్ట్రవ్యాప్తంగా అడిషనల్ ప్రోగ్రాం ఆఫీసర్లు 400 మంది, టెక్నికల్ అసిస్టెంట్లు 2,072, మండల ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు 500, కంప్యూటర్ ఆపరేటర్లు 1000 మంది, మొత్తం 3,972 మంది 17 ఏండ్లుగా పనిచేస్తున్నారు. ఉపాధి హామీ చట్టంలో ఎఫ్‌టీఈలుగా నియమితులైన ఉద్యోగులతోపాటు మరో 4 వేల మంది ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామాల్లో పనిచేస్తున్నారు. వీరంతా కలిసి నాలుగు సంఘాలుగా ఏర్పడ్డారు. ఈ నాలుగు సంఘాలు 2020లో జాయింట్ యాక్షన్ కమిటీ (జాక్)గా ఏర్పడి తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించి, పే స్కేల్ వర్తింపచేయాలని పోరాటం ప్రారంభించారు.

ఎమ్మెల్యేల లేఖలతో..

తమ లాగే నియమితులైన 'సెర్ప్' ఉద్యోగులను క్రమబద్ధీకరించి మమ్మల్ని విస్మరించడం ఏమిటని ఎఫ్‌టీఈ ఉద్యోగులు ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 74 మంది ఎమ్మెల్యేల లేఖలను ఉద్యోగాల క్రమబద్ధీకరణకు మద్దతుగా సమీకరించి వాటిని రాష్ట్ర ప్రభుత్వానికి అందజేశారు. ఈ లేఖలతోపాటు ఎమ్మెల్సీలు, జడ్పీ చైర్మెన్ల లేఖలను సైతం ప్రభుత్వానికి పంపారు. నాటి ఆర్థిక మంత్రి హరీశ్‌రావు.. వారిని త్వరలోనే క్రమబద్ధీకరిస్తామని చెప్పినా, పెండింగ్‌లోనే ఉండిపోయింది. ఉద్యోగులు తీవ్ర నిరాశలో ఉన్నారు. ఉపాధి హామీ చట్టం ఉద్యోగులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు తక్షణమే వేతనాలను పెంచి, ఉద్యోగ భద్రత కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించింది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో ఎఫ్‌టీఈ ఉద్యోగుల ఆశలు చిగురించాయి. ఈ ప్రభుత్వ హయాంలోనైనా మమ్మల్ని క్రమబద్ధీకరిస్తుందని ఆశతో ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు.

'సెర్ప్' ఉద్యోగుల్లానే మమ్మల్ని క్రమబద్ధీకరించాలి : ఇనుగుర్తి వెంకట్రాంరెడ్డి, 'జాక్' కో చైర్మెన్



పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో పనిచేస్తున్న 'సెర్ప్' ఉద్యోగులను క్రమ బద్ధీకరించి, పే స్కేల్ ఇచ్చినట్టుగానే ఎఫ్‌టీఈ ఉద్యోగులనూ క్రమబద్ధీకరించి, పే స్కేల్ ఇవ్వాలి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో మాకు వేతనాల పెంపుతోపాటు క్రమబద్ధీకరణ చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి.

ఐకానిక్ డిజైన్ ఎంపిక చేయాలి

- మూసీ నదీ పరివాహక అభివృద్ధికి కృషి
- తొలిదశలో 55 కిలోమీటర్ల అభివృద్ధి : హెచ్ఎండీఏ అధికారుల సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అన్ని వర్గాల ప్రజలకు అనువైన ఐకానిక్ డిజైన్ ఎంపిక చేయాలని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. మూసీ నదీ పరివాహక అభివృద్ధిపై మంగళవారం నానక్‌రామ్ గూడ హెచ్ఎండీఏ కార్యాలయంలో అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. మూసీ నదీ పరివాహక ప్రాంతాన్ని రాబోయే 36 నెలల్లో అభివృద్ధి చేయాలని అధికారులకు ఆదేశించారు. అందులో భాగంగా తొలుత హైదరాబాద్ నగరం పరిధిలోని 55 కిలోమీటర్ల మేర ఉన్న మూసీ నదీ పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని నిర్దేశించారు. ఎమ్యూస్ మెంట్ పార్క్, వాటర్ ఫాల్స్, చిల్డ్రన్ వాటర్ స్పోర్ట్స్, స్ట్రీట్ వెండర్స్, బిజినెస్ ఏరియా, షాపింగ్ మాల్స్ ఇలా అన్ని వర్గాలకు అందుబాటులో ఉండే విధంగా డిజైన్ ఉండాలన్నారు. ఇందుకోసం విదేశాలతోపాటు దేశంలోని ఇతర రాష్ట్రాల్లో నదీ పరీవాహక ప్రాంతాల్లో ఇప్పటికే చేపట్టిన ప్రాజెక్టుల డిజైన్లను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.

మూడు నెలల్లోగా సంబంధిత పనులు ప్రారంభించేందుకు కావాల్సిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఆకస్మిక వరదలు వచ్చినా తట్టుకునే విధంగా నీటిని మూసీలోకి మళ్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మూసీ నది పరీవాహక అభివృద్ధికి భవిష్యత్తులో ఎలాంటి అడ్డంకులు రాకుండా ముందు జాగ్రత్తగా అవసరమైన చర్యలను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆ ప్రాంతాల్లో నెలకొన్న చారిత్రక కట్టడాలు చార్మినార్, తారామతి బరాదరీ, ఇతర పర్యాటక ప్రాంతాలను కలుపుతూ ఒక టూరిజం సర్క్యూట్ డిజైన్ రూపొందిచాలన్నారు. పీపీపీ పద్ధతిలో ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. సమీక్షా సమావేశంలో మునిసిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, హెచ్ఎండీఏ జాయింట్ మెట్రోపాలిటన్ కమీషనర్ ఆమ్రపాలి, సీఎం ఓఎస్డీ అజిత్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సర్కార్ మోసం చేసింది....

- కోదండరాంతో చెరుకు రైతులు
- కాంగ్రెస్ ఆదుకుంటుందని భరోసా ఇచ్చిన ప్రొఫెసర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గత బీఆర్ఎస్ ప్రభుత్వం చక్కెర పరిశ్రమ ఏర్పాటు విషయంలో తమను మోసం చేసిందని జహీరాబాద్ ప్రాంతానికి చెందిన చెరుకు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది డిసెంబర్ 28న చక్కెర పరిశ్రమను ప్రారంభించాలని కోరుతూ చేపట్టిన పాదయాత్ర మంగళవారం హైదరాబాద్ చేరుకుంది. ప్రజాభవన్‌లో విన్నవించుకునేందుకు వచ్చిన రైతులు అనంతరం హైదరాబాద్ నాంపల్లిలోని తెలంగాణ జన సమితి రాష్ట్ర కార్యాలయంలో టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాంను కలిసి తమ సమస్యలను చెప్పుకున్నారు. గత ప్రభుత్వం ఏ విధంగా మోసం చేసిందో వివరించారు. ఈ సందర్భంగా కోదండరాం వారు చేసిన పోరాటాన్ని ప్రత్యేకంగా అభినందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఆదుకుంటుందనీ, వారి కష్టాలను తీరుస్తుందని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆశప్ప, రాష్ట్ర నాయకులు రాజ మల్లన్న, శ్రీనివాసరెడ్డి, ముజాహిద్దీన్ ,రావుల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పదోన్నతులివ్వండి

- మంత్రి సీతక్కకు జీటీఏ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ ఉపాధ్యాయులకు విద్యాశాఖలో అన్ని పదోన్నతులు ఇవ్వడంతోపాటు స్థానిక సంస్థల ఉపాధ్యాయులకు పంచాయతీరాజ్ వ్యవస్థలో పదోన్నతుల వ్యవస్థను రూపొందించాలని జీటీఏ కోరింది. ఈ మేరకు మంత్రి సీతక్క, విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశంను మంగళవారం హైదరాబాద్‌లో ఆ సంఘం అధ్యక్షులు కాసం ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి మేరోజు బ్రహ్మచారి కలిసి వినతిపత్రం సమర్పించారు. దీనిపై వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం బాధ్యులు సోమ్యానాయక్, నాయకులు పాశం కృష్ణమూర్తి, శ్రవణ్‌కుమార్, నర్సింహా, రాజు, సుధాకర్, యాలాల కృష్ణారావు, కె శివకుమార్, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది దుర్మార్గ పాలన

- గజ్వేల్ నియోజకవర్గ ప్రజాపాలన కార్యక్రమంలో..: మాజీ సీఎం, ఎమ్మెల్యే కేసీఆర్ ఫోటో లేదని సర్పంచ్ విజయవర్ధన్ రెడ్డి ధ్వజం



నవతెలంగాణ-గజ్వేల్

ప్రజాపాలన పేరిట ప్రొటోకాల్ పాటించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గమైన పరాకాష్ట పాలన సాగిస్తుందని గజ్వేల్ మండలం బూరుగుపల్లి సర్పంచ్ ఒంటేరు విజయవర్ధన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం బూరుగుపల్లి గ్రామంలో అధికారులు మంగళవారం ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫొటో లేకుండా కార్యక్రమాన్ని ఎలా నిర్వహిస్తారని సంబంధిత అధికారులను సర్పంచ్ నిలదీశారు. దాంతో పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో అధికారులు, సర్పంచ్‌కు మధ్య వాగ్వివాదం జరిగింది. ప్రజాపాలనలను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పటికీ గజ్వేల్ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యేగా, రెండుసార్లు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్ ఫొటో బ్యానర్‌పై లేకుండా ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తే సహించేది లేదన్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్, అధికారులు వివరణ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం అంటే హుందాగా ఉండాలన్నారు. 6 గ్యారంటీల పేరిట ప్రజలను గారడీ చేస్తుందని విమర్శించారు. పథకాలు అమలు చేసేవారు ప్రజలకు నానా ఇబ్బందులు పెట్టడమేమిటని ప్రశ్నించారు. పథకాల అమలు కోసం గతంలో కేసీఆర్ ఒకరోజు సర్వే చేశారని గుర్తు చేశారు. కాలయాపన చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు.

రూ.300 కోట్లతో వికారాబాద్ జిల్లా అభివృద్ధి

- ఆరు గ్యారంటీలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలి : స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- ప్రజాపాలనలో దరఖాస్తుల స్వీకరణ



నవతెలంగాణ-వికారాబాద్ ప్రతినిధి

వచ్చే ఐదేండ్లలో రూ.3000 కోట్లతో వికారాబాద్ జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. ఆరు గ్యారంటీలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మంగళవారం వికారాబాద్ మున్సిపల్ పరిధి 20వ వార్డు రాజీవ్ గృహకల్ప కాలనీలో నిర్వహించిన ప్రజా పాలన సభలో ఆయన పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పాలకులు ప్రాణహిత చేవెళ్ల, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు అన్యాయం చేశారని అన్నారు. ఈ ప్రాజెక్టులను పూర్తి చేసి జిల్లా ప్రజలకు సాగు, తాగునీరు అందించే దిశగా ముందుకు వెళ్తామని తెలిపారు. జిల్లాలోని పంచాయతీరాజ్, రోడ్లు భవనాల రహదారులన్నీ అస్తవ్యస్తంగా ఉన్నాయని, రోడ్ల నిర్మాణం కోసం రూ.300 కోట్ల నిధులను మంజూరు చేయించి అభివృద్ధి చేస్తామన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు అనంతగిరి గుట్టను ఎకో టూరిజం కింద రూ.200 కోట్ల నిధులతో అభివృద్ధి చేస్తామన్నారు. ఇప్పటికే కోటిపల్లి ప్రాజెక్టు వద్ద బోటింగ్ సదుపాయం కల్పించి యువతకు ఉపాధి కల్పించినట్టు తెలిపారు. వికారాబాద్‌లో టెక్స్‌టైల్స్ పార్క్ తీసుకువచ్చి 4,000 మంది మహిళలకు, అలాగే పరిశ్రమలను స్థాపించి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం 6 గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. ఒక్కటే దరఖాస్తుతో అన్ని గ్యారంటీలకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. రేషన్ కార్డుల కోసం తెల్ల కాగితంపై దరఖాస్తులు రాసి ఇవ్వాలని తెలిపారు. అన్ని పథకాలను ఇంటింటికీ అందించే పూర్తి బాధ్యత తనదేనని అన్నారు. జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి కుటుంబానికీ 6 గ్యారంటీలు అందే విధంగా ఒకే ఒక దరఖాస్తును సులువుగా రూపొందించినట్టు తెలిపారు. దరఖాస్తులో తప్పులు దొర్లకుండా నింపాలని సూచించారు. జిల్లాలోని 566 గ్రామ పంచాయతీలు, నాలుగు మున్సిపాలిటీల్లోని 97 వార్డుల్లో గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రమేష్, వైస్ చైర్‌పర్సన్ శంషాద్ బేగం, వార్డు కౌన్సిలర్ మురళి, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అటవీ రక్షణే ధ్యేయంగా పనిచేయాలి

- క్యాలెండర్ ఆవిష్కరణలో పీసీసీఎఫ్ ఆర్ఎం : డోబ్రియాల్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అడవుల రక్షణ ధ్యేయంగా అధికారులు పనిచేయాలని పీసీసీఎఫ్, హెచ్ఓఎఫ్ఎఫ్ ఆర్ఎం. డోబ్రియాల్ సూచించారు. మంగళవారం హైద రాబాద్‌లోని అరణ్య భవన్‌లో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. జూనియర్ అటవీ అధికారుల సంఘం రూపొందించిన న్యూ ఇయర్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాఖలో పని చేస్తున్న ప్రతి ఒక్కరూ కొత్త సంవత్సరంలో పని పట్ల పున:రంకితం కావాలనీ, ప్రభుత్వ ప్రాధామ్యాలకు అనుగుణంగా పనిచేయాలని కోరారు. విధి నిర్వహణలో సమయ పాలన, రాష్ట్ర వ్యాప్తంగా మరింతగా పచ్చదనం పెంపు దిశగా ముందకెళ్లాలని పిలుపు నిచ్చారు. కార్య క్రమంలో పీసీసీఎఫ్‌లు ఎంసీ. పర్గెయిన్, సువర్ణ, అదనపు పీసీసీఎఫ్ సునీతా భగవత్, ఇతర ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గృహలక్ష్మి రద్దు

- ఆ స్థానంలో అభయహస్తం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసింది. ఆ స్థానంలో అభయహస్తం పథకాన్ని ప్రవేశపెట్టింది. గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు గృహలక్ష్మి పథకం ద్వారా ఖాళీ స్థలం ఉన్న పేదలకు ఇల్లు కట్టుకొనేందుకు రూ.3 లక్షలు ఇస్తామని పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు పలు జిల్లాల్లో కలెక్టర్లు కొందరు లబ్దిదారుల్ని గుర్తించి వారికి మంజూరు పత్రాలు కూడా ఇచ్చారు. అయితే ఆ స్కీం స్థానంలో అభయహస్తం ప్రవేశపెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇస్తామని చెప్పిన విషయం తెలిసిందే. ఆ మేరకు గృహలక్ష్మి పథకంతో పాటు లబ్దిదారులకు కలెక్టర్లు ఇచ్చిన మంజూరు పత్రాలను కూడా రద్దు చేస్తున్నట్టు ప్రభుత్వం పేర్కొంది. అభయహస్తం కింద అర్హులైన పేదలకు రూ.5 లక్షలు ఇస్తామని తెలిపింది.

ప్రజాపాలన సభల్లో.. పోటెత్తిన దరఖాస్తులు

- ప్రోటోకాల్ పాటించలేదని గ్రామసభను అడ్డుకున్న బీఆర్ఎస్ నాయకులు
- జతచేయాల్సిన పత్రాలపై అవగాహనలోపం
- సిబ్బంది కొరత



నవతెలంగాణ-విలేకరులు

రెండు రోజుల సెలవుల అనంతరం మంగళవారం ప్రజాపాలన సభల్లో దరఖాస్తులు వెల్లువల వచ్చాయి. కానీ ఇప్పటికీ సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. దరఖాస్తులు సరిపడా లేకపోవడంతో జిరాక్స్ సెంటర్ల వద్ద ప్రజలు బారులు తీరుతున్నారు. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో ప్రోటోకాల్ పాటించలేదని బీఆర్ఎస్ నాయకులు గ్రామసభను అడ్డుకున్నారు. మాజీ మంత్రి, ప్రస్తుత బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఫొటో లేకుండానే ఫ్లెక్సీ ఏర్పాటు చేశారని అధికారులతో వాగ్వావాదానికి దిగారు. రెండు గంటల అనంతరం మరో ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంతో గ్రామసభ పున: ప్రారంభించి దరఖాస్తులు స్వీకరించారు. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా నాలుగోరోజు 89,058 దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. నాలుగు రోజులకు గాను 2,85,891 దరఖాస్తులు వచ్చాయి. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా మంగళవారం 47324 దరఖాస్తులు రాగా.. నాలుగు రోజులకు గాను 1,54,586 దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని పలు గ్రామాల్లో దరఖాస్తుదారులు ఫారానికి జత చేయాల్సిన డాక్యుమెంట్స్ విషయంలో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు అవగాహన కల్పించకపోవడంతో జిరాక్స్‌ల కోసం ప్రజలు ఆన్‌లైన్ సెంటర్లకు క్యూ కడుతున్నారు. జిరాక్స్ సెంటర్ల నిర్వాహకులు అదనంగా డబ్బులు తీసుకుంటున్నారు. సిరిసిల్ల జిల్లాలో దరఖాస్తుల స్వీకరణ సందర్భంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దరఖాస్తు నింపడంపై అవగాహన లేక అపసోపాలుపడ్డారు. దరఖాస్తులు నింపేందుకు ఆశాలు, అంగన్వాడీలు సహాయంగా ఉంటారని అధికారులు పేర్కొన్నా.. అధికారుల స్థానంలో వారే ఉండి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. భద్రాద్రి జిల్లా బూర్గంపాడులో 2000కు పైగా దరఖాస్తులు వచ్చాయి.

న్యాయ సంస్కరణలు రాజ్యాంగ విరుద్ధం

- ఇజ్రాయిలీ సుప్రీం కోర్టు చారిత్రాత్మక తీర్పు
- నెతన్యాహుకు గట్టి ఎదురు దెబ్బ



టెల్‌అవీవ్: న్యాయవ్యవస్థ అధికారాలు, ప్రజాస్వామిక హక్కులను కాలరాసే వివాదాస్పద న్యాయ సంస్కరణలను ఇజ్రాయిల్ అత్యున్నత న్యాయస్థానం కొట్టి పారేసింది. ఇది నెతన్యాహుకు గట్టి ఎదురుదెబ్బ. ఈ సంస్కరణలు రాజ్యాంగ విరుద్ధమని 15 మంది న్యాయమూర్తులతో కూడిన సుప్రీం కోర్టు సంపూర్ణ ధర్మాసనం 8-7 తేడాతో చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. ఇజ్రాయిల్‌కు మన దేశంలో ఉన్నట్లు లిఖిత పూర్వక రాజ్యాంగం ఏదీ లేదు. ఇజ్రాయిల్ ఏర్పడినప్పటి నుంచి కొన్ని నిర్దిష్టమైన బేసిక్ చట్టాల ఆధారంగా ప్రభుత్వ పాలన సాగుతుంది. న్యాయవ్యవస్థ పీక నులిమేసే ఈ చట్టాన్ని ఇజ్రాయిల్ పార్లమెంటులో సంకుచిత రాజకీయ మెజార్టీ ఆధారంగా నెతన్యాహు ప్రభుత్వం ఆమోదింపజేసుకుంది. ఇది న్యాయవ్యవస్థను బలహీన పరస్తుందని, ప్రజాస్వామ్యానికి పెను ముప్పుగా మారనుందని ప్రతిపక్షాలు, ప్రజాతంత్రవాదులు, న్యాయవాదులు దేశవ్యాపితంగా ఆందోళనలు నిర్వహించారు. ఇంతలో గాజాపై నెతన్యాహు దురాక్రమణపూరిత యుద్ధాన్ని ప్రకటించడంతో ఈ అంశం వెనక్కి పోయింది. ఈ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించిన సుప్రీం కోర్టు నూతన సంవత్సర ప్రారంభ రోజున తన తీర్పును వెలువరించింది. ప్రభుత్వం చేసే వాదనలకు వ్యతిరేకంగా, అనుకూలంగా న్యాయమూర్తులు అంశాల వారీ వివరణ ఇచ్చారు. శాసనాలు చేసే అధికారం పార్లమెంటుకు వుందనడంలో ఎలాంటి సందేహమూ అక్కర్లేదు. కానీ, పార్లమెంటు చేసే ఏ చట్టమైన రాజ్యాంగ స్ఫూర్తికి లోబడి ఉండాలి. న్యాయానికి పరిమితులు విధిస్తామంటే కుదరదు. న్యాయవ్యవస్థను శాసించే అధికారం రాజ్యాంగం ప్రకారం కీసెట్ (పార్లమెంటు)కు లేదు. ఈ విషయం గుర్తెరిగి వ్యవహరించాలని సుప్రీం కోర్టు ఆ తీర్పులో స్పష్టం చేసింది,. మందబలం ఉంది కదా అని సంకుచిత రాజకీయ మెజార్టీతో పౌరుల, మైనార్టీల వ్యక్తిగత స్వేచ్ఛ, హక్కులను హరిస్తామంటే కుదరదు అని నెతన్యాహుకు సుప్రీం గట్టిగా మొట్టికాయలు వేసింది. నెతన్యాహు తీసుకొచ్చిన ఈ న్యాయ సంస్కరణలు అమలులోకి రావడానికి జనవరి12వతేదీని గడువుగా విధించారు. గాజాలో ఇజ్రాయిల్ యుద్ధాన్ని ప్రకటించిన తరువాత నెతన్యాహు నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వం నడుస్తోంది. సుప్రీం తీర్పు నేపథ్యంలో న్యాయ వ్యవహారాలకు సంబంధించిన వివాదాస్పద అంశాల జోలికి వెళ్లకూడదని సంకీర్ణ పభుత్వంలో భాగస్వామ్య పక్షాలు నిర్ణయించాయి.

'ఉపాధి' వేతనాలు 'ఆధార్'తో చెల్లింపు తగదు

- కేంద్రం వెంటనే వెనక్కి తీసుకోవాలి
- కూలీలను కుదించే కుట్ర దుర్మార్గం
- మ్యానువల్ పద్ధతిలోనే వేతనాలు చెల్లించాలి : వ్యకాస



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఉపాధి హామీ చట్టం కింద పనిచేసే కూలీలకు ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్, ఉపాధిజాబ్ కార్డు అనుసంధానం ఆధారంగా వేతనాలు చెల్లించడం సరిగాదనీ, కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.నాగయ్య, ఆర్.వెంకట్రాములు డిమాండ్ చేశారు. 'ఉపాధి' కూలీలను కుదించే కుట్ర దుర్మార్గపూరితమని పేర్కొన్నారు. మ్యానువల్ పద్ధతిలోనే వేతనాలు చెల్లించాలని కోరారు. మంగళవారం ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఓవైపు బడ్జెట్‌లో నిధులు సరిగా కేటాయించకుండా, మరోవైపు ఉపాధి హామీ చట్టాన్ని కుదించే ప్రయత్నాన్ని కేంద్రం చేస్తోందని విమర్శించారు. పని ప్రదేశంలో ఉదయం, సాయంత్రం రెండుసార్లు ఫోటోలు దింపి నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం అనే ప్రత్యేక యాప్‌లో అప్‌డేట్ చేసే క్రమంలో ఇంటర్నెట్ సౌకర్యం లేక కోట్లాది మంది కూలీలు వేతనాలు అందక ఎదురుచూస్తున్న తీరును వివరించారు. తెలంగాణలో గతేడాది పనిచేసిన కూలీలకు పదివేల కోట్ల రూపాయలకుపైగా బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ నెల నుంచి డ్రోన్ సాయంతో కూలీల పనిని ఫొటోల ద్వారా క్యాప్చర్ చేయడం, బ్యాంకు అకౌంటు, జాబ్ కార్డు నెంబరు, ఆధార్ కార్డు నెంబరు లింకైన వారికి మాత్రమే ఆన్‌లైన్ చెల్లింపులు చేస్తామని చెప్పడమంటే కూలీలను పనుల నుంచి దూరం చేయడమేనని పేర్కొన్నారు. నేటికీ 65 శాతానికిపైగా కూలీల ఆధార్ నెంబర్ జనరేట్ కాలేదని తెలిపారు. అలాంటప్పుడు ఆధార్ అనుసంధానం ఆధారితంగా వేతనాల చెల్లింపు ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు.

బ్యాంకుల విలీనం పేరుతో గ్రామీణ, మండల ప్రాంతాల్లో చాలా బ్యాంకులు మూసివేతకు గురయ్యాయనీ, ఆదివాసీ, గిరిజన ప్రాంతాలలో బ్యాంకు సౌకర్యం లేదని తెలిపారు. సరైన ఆధారాలు లేవని ఏడు కోట్లకు పైగా జాబ్ కార్డుదారులను తొలగించినట్టు పార్లమెంట్‌లో ప్రభుత్వం ప్రకటన చేయడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు.

పకడ్బందీగా ప్రజాపాలన



నవతెలంగాణ-మీర్‌పేట్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రజాపాలన కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని ప్రజా పాలన కార్యక్రమం ప్రత్యేక అధికారి రంగారెడ్డి జిల్లా పరిశ్రమల సంస్థ జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 4, 12, 27, 29వ డివిజన్‌లో ప్రజా పాలన కార్యక్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని దరఖాస్తు ఫారాలను అందరికీ అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. అనంతరం లబ్దిదారులకు దరఖాస్తు ఫారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వాణి, మేనేజర్ వెంకట రెడ్డి, ఆర్వో అంజన్ రెడ్డి, డిఈ గోపీనాథ్, టౌన్ ప్లానింగ్ అధికారి దేవానంద్ మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మంగళవారం జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు మేయర్ గద్వాల్ విజయలక్ష్మికి శుభాకాంక్షలు తెలిపారు. నవతెలంగాణ-సిటీబ్యూరో

నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ-చైతన్యపురి

నవతెలంగాణ-2024 క్యాలెండర్‌ను మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి శ్రీనగర్ కాలనీలోని తన నివాసంలో మంగళవారం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద శర్మ, ఆర్కే పురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రా రెడ్డి మాట్లాడుతూ సమాజంలోని సమస్యలను వెలికి తీసి ప్రజల ముందు ఉంచడంలో నవ తెలంగాణ దినపత్రిక ముందుంటుందన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం చేసే వారికి ఎప్పుడు ప్రజల అండదండలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్కేపురం డివిజన్ ఎన్నికల ఇన్‌చార్జి నెటంటూరి రవీందర్ రెడ్డి, బేర బాల కిషన్, కొండ్ర శ్రీనివాస్, కంచర్ల శేఖర్, పెంబర్తి శ్రీనివాస్, సాజిద్, శ్రీరాములు, వెంకటేష్ గౌడ్, వల్లూరి రమేష్, మురళీధర్ రెడ్డి, స్థానిక రిపోర్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలను తప్పనిసరిగా అమలు చేస్తాం

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

హామీనిచ్చిన ఆరు గ్యారెంటీలను తప్పనిసరిగా అమలు చేస్తామని రాష్ట్ర రవాణా శాఖ, హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంగళవారం మెహిదీపట్నం సర్కిల్ విజయనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన అభయ హస్తం దరఖాస్తుల స్వీకరణ సెంటర్‌ను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు నగర వ్యాప్తంగా కంటోన్మెంట్‌తో పాటు 650 కేంద్రాలను ఏర్పాటుచేసి రూ. 9.92 లక్షల దరఖాస్తులు స్వీకరించడం జరిగిందన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా జీహెచ్ఎంసీ అధికారులు సమర్థవంతంగా ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. అధికసంఖ్యలో ప్రజలు వచ్చినా ఇబ్బంది లేకుండా అవసరం మేరకు కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటామని, అర్హులైన నిరుపేదలకు పథకాలు అందుతాయని తెలిపారు. జీహెచ్ఎంసీ వ్యాప్తంగా ఉన్న 150 వార్డులలో ఎలాంటి అపశతి లేకుండా సమర్థవంతమైన ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. మొదట దరఖాస్తులకు కొరత ఉండేదని, ప్రస్తుతం అప్లికేషన్ కొరత లేదు. అందరికి ఉచితంగా అప్లికేషన్ అందిస్తామని, దరఖాస్తు అమ్మితే కఠినంగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్టు గుర్తు చేశారు. వివరాలు మాత్రమే అడుగుతున్నామని, ప్రతి ఒక్కరూ ప్రజా పాలనలో భాగస్వామ్యం కావాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, జోనల్ కమిషనర్ వెంకటేష్ దొత్రే, ప్రత్యేక అధికారి, డిప్యూటీ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగించుకోవాలి

డీప్యూటీ మేయర్ ఇబ్రహీం శేఖర్



నవతెలంగాణ-బడంగ్ పేట్

రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రహీం శేఖర్ అన్నారు. మంగళవారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 15, 16, 17, 18 డివిజన్లకు సంబంధించి వార్డు సభలను బాలాపూర్ మండల తహశీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సమావేశంలో బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ మాట్లాడుతూ ప్రజా పాలన కార్యక్రమంలో బాగంగా దనికులైన ప్రజలు ప్రభుత్వంపై ఆధారపడకుండా అవసరం లేని వారు తాము స్వచ్ఛందంగా ప్రభుత్వ పథకాలు అందే తెల్ల రేషన్ కార్డును రద్దు చేసుకుంటే, అవసరం ఉన్న లక్షలాది మంది నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. దీనివల్ల పేదరిక నిర్మూలన జరుగుతుందని సందేశమిచ్చారు. రాష్ట్ర ప్రజలు బాగుపడాలని హితవు పలికే నాయకులు, ధనవంతులు తమ తమ తెల్ల రేషన్ కార్డులను రద్దు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుమన్ రావు, డి.ఈ.జ్యోతి,కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి,కార్పొరేటర్లు ఎర్ర మహేశ్వరి జైహింద్,మెడికల్ సూపర్ వైజర్ నర్సింగ్ రావు, శానిటేషన్ అధికారి యాదగిరి, వివిధ అధికారులు, ఆయా డివిజన్ల ప్రజలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాదర్‌గుల్‌లో ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్న మేయర్



నవతెలంగాణ-బడంగ్ పేట్

నేటి సమాజంలోని ప్రజలు దైవ భక్తి భావంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని నాదర్ గుల్ గ్రామంలో అయ్యప్ప స్వాముల ఇడుముళ్ల కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహా రెడ్డి పాల్గొన్నారు. అనంతరం దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు భక్తి భావంతో పాటు పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద బడుగు బలహీనవర్గాల ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నిమ్మల సునీతా శ్రీకాంత్ గౌడ్,నాయకులు భాస్కర్ రెడ్డి, బంగారి అశోక్, సుబాన్ యాదవ్, మధుసూదన్ రెడ్డి, అయ్యప్ప స్వాములు తదితరులు పాల్గొన్నారు.

మూన్ వాకర్ డ్యాన్స్ స్టూడియోలో నూతన సంవత్సర వేడుకలు



నవతెలంగాణ-చైతన్యపురి

కొత్తపేట్ లోని మూన్ వాకర్ డ్యాన్స్ స్టూడియోలో నూతన సంవత్సర వేడుకలు మూన్ వాకర్ డైరెక్టర్ చక్రి డ్యాన్స్ మాస్టర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం విద్యార్థుల సమక్షంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. డ్యాన్స్ అకాడమీలో ఐదు సంవత్సరాల పిల్లల నుండి 60 సంవత్సరాల వరకు డ్యాన్స్ నేర్పించబడుతుందని తెలిపారు. ఆన్‌లైన్ క్లాసులు ఇతర దేశాల విద్యార్థిని, విద్యార్థులకు కూడా డాన్స్ క్లాసులు నేర్పించబడును తెలిపారు.

'మీ సేవలను బోర్డు ఎప్పటికీ మర్చిపోదు..'

ఇద్దరు జలమండలి ఉద్యోగుల పదవీ విరమణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

మీ సేవలను బోర్డు ఎప్పటికి మర్చిపోదని జల మండలి పీ అండ్ ఏ సీజీఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ తెలిపారు. పదవీవిరమణ పొందామని కృంగిపోకుండా, తమ శేష జీవితాన్ని కుటుంబసభ్యులతో సంతోషంగా గడపాలన్నారు. బోర్డు పరిధిలోని ఓ అండ్ ఎం డివిజన్ - 1, డివిజన్- 8లో జీపీఈలుగా విధులు నిర్వర్తిస్తున్న ఆనంద్, మల్లమ్మ గత నెలలో పదవీ విరమణ పొందారు. మంగళ వారం ఖైరతాబాద్‌లోని బోర్డు ప్రధాన కార్యాలయంలో వారిని అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. పదవీ విరమణ ద్వారా లభించే గ్రాట్యూటీ వంటి తదితర ప్రయోజనాలు చెక్కు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో జీఎం సరస్వతితో పాటు పలువురు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆవాజ్ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ధూల్ పేట్

సౌత్ జిల్లా పార్టీ కార్యాలయంలో ఆలం ఖుస్ మీరి భవన్‌లో ఆవాజ్ క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు. ముఖ్యంగా నగర కార్యదర్శి అబ్దుల్ సత్తార్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం ఆవాజ్ పేరుతో క్యాలెండర్ రిలీజ్ చేయడం జరుగుతుందన్నారు. ఉర్దూ, ఇంగ్లీషులో ఈ క్యాలెండర్ ఉండటంతో ముస్లీం సోదరులు ఎంతో ఆప్యాయతతో, అభిమానంతో కోరుకుంటున్నారు. ఇదే తరహాలో భవిష్యత్తులో కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కలిముద్దీన్, గులాం నసీర్ అఖ్తర్ బేగం, అన్వర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగించుకోవాలి



నవతెలంగాణ-బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 20వ డివిజన్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వార్డు సభలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ మిషనర్ సుమన్ రావు, కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, వైద్యాధికారి నర్సింగరావు, పార్టీల నాయకులు వివిధ కాలనీల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి శుభాకాంక్షలు తెలిపిన టీజీవో నాయకులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

టీజీవో హైదరాబాద్ జిల్లా నాయకులు రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హైదరాబాద్ జిల్లా ఇంఛార్జి పొన్నం ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సచివాలయంలోని ఆయన ఛాంబర్‌లో టీజీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎంబీ కృష్ణ యాదవ్, సెక్రెటరీ మహమ్మద్ అబ్దుల్ ఖాదర్‌లు మంగళవారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీవో కార్యవర్గ సభ్యులతోపాటు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షలు



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ కాంగ్రెస్ మహిళ విభాగం అధ్యక్షురాలు యంజాల పరమేశ్వరి సంజీవ, ప్రధాన కార్యదర్శి ఊసిగారి మమతరాజులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి పూల బోకేను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి నూతన సంవత్సర సందర్భంగా మర్యాద పూర్వకంగా కలవడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే సారథ్యంలో 2024 సంవత్సరంలో పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీ శరవేగంగా అభివృద్ధి జరగనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సంక్షేమ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే రంగారెడ్డి అడుగులో అడుగై యువత ముందుకు సాగుతుందన్నారు.

నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



నవతెలంగాణ-హస్తినాపురం

స్మశాన వాటిక నిర్మాణానికి నిధులు మంజూరు అయినప్పటికీ గత కొంత కాలంగా పెండింగ్‌లో వున్న స్మశాన వాటిక పనులను తిరిగి ప్రారంభించడం శుభపరిణామని హస్తినాపురం కార్పొరే టర్ బానోతు సుజాతా నాయక్ అన్నారు. డివిజన్ పరిధిలోని నందనవనంలో జీహెచ్ఎంసీ ద్వారా స్మశాన వాటిక నిర్మాణం కొరకు నిధులు మంజూరై చాలా కాలం అయినా పలు కారణాల వల్ల పనులలో జాప్యం జరిగిందన్న సంగతి విధితమే.. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుజాతా నాయక్ మాట్లాడుతు స్థానిక ప్రజలు స్మశాన వాటిక లేక పలు ఇబ్బందులకు గురవుతున్నారని, గతంలో స్మశాన వాటికను ఆదునీకరించాలని పలు వినతులు వచ్చాయని తెలిపారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి తక్షణమే పనులు ప్రారంభించాల్సిందిగా కోరామని, నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేసి స్థానిక వాసులకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్ర మంలో స్మశాన వాటిక అధ్యక్షుడు దయ్యాల వెంకటేష్, ఆర్బీసీ కృష్ణ స్టార్ నరసింహ, సతీష్ గౌడ్ ,రేణుక గౌడ్ మమత మల్లేష్ గౌడ్, గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, రామచందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్ రెడ్డి మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పూల బోకే అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ సందర్భంగా చిలుక మధుసూధన్ రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసినట్లు తెలిపారు. తెలంగాణ ప్రజా సంక్షేమాభివృద్ధి ప్రదాత, బడుగు బలహీన వర్గాల ఆశాదీపం సీఎం రేవంత్ రెడ్డి అని కొనియాడారు. కాంగ్రెస్ చేపట్టిన ఆరు గ్యారంటీ పథకాలను పేదలందరికీ అందేటట్లు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు.

డీజీపీకి శుభాకాంక్షలు తెలిపిన కృష్ణకుమార్



నవతెలంగాణ-చైతన్యపురి

తెలంగాణ స్టేట్ పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) రవి గుప్తను గిన్నిస్ వరల్డ్ రికార్డ్ హెూల్డర్ (4 టైమ్స్), రచయిత, ప్రముఖ కళాకారులు, సోషల్ వర్కర్ డా. పెండెం కృష్ణ కుమార్ మర్యాదపూర్వకం గా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి పర్యావరణ రక్షణ కొరకు ప్లాస్టిక్ వాడకం తగ్గించి క్లాత్ సంచులు వాడుట కొరకు క్లాత్ సంచులను అందజేయడం జరిగింది. కృష్ణ కుమార్ కళాత్మక ఫొటోలతో ఉన్న క్యాలెండర్ లను అందచేయడం జరిగింది. సమాజ సేవ చేస్తున్నందున సేవను కొన సాగించాలని డీజీపీ సూచించినట్లు ఆయన తెలిపారు.

ఘనంగా మాజీ వైస్ చైర్మెన్ నర్సింహ్మారెడ్డి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బడంగ్‌పేట్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ చిగిరింత నర్సింహ్మారెడ్డి జన్మదిన సందర్భంగా అస్సాంలోని కామాఖ్య అమ్మ వారిని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బోయపల్లి రాఘవేందర్ రెడ్డి, నాయకులు పన్నాల రాజేందర్‌రెడ్డిలు పాల్గొని నర్సింహ్మా రెడ్డిని పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



నవతెలంగాణ-సంతోష్ నగర్

సాయిరాం నగర్ కాలనీలో అయోధ్య రామ మందిరం నుండి, వచ్చిన అక్షింతలను, భజనలు చేసుకుంటూ హరినామ సంకీర్తనలు పాడుకుంటూ ముఖ్య అతిథిగా కర్మన్ ఘాట్ ధ్యానంజనేయ స్వామి ఆలయ చెర్మెన్ రఘుమారెడ్డి పాల్గొని గడప గడపకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు సుఖజీవన్ రెడ్డి, ముకుంద్ రెడ్డి, చంద్రపాల్ రెడ్డి, రఘునందన్ రావు, శేఖర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, సర్వేశ్, విజయ లక్ష్మి, షాలిని, తదితరులు పాల్గొన్నారు.

3, 4న సిటీ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగం జాతీయ సదస్సు

నవతెలంగాణ-ధూల్‌పేట్

ప్రభుత్వ సిటీ కళాశాల రాజనీతి శాస్త్ర విభాగం, కమీషన్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ టెక్నికల్ టెర్మినాలజీ, ఢిల్లీ సంయుక్తంగా 3, 4న జాతీయ సదస్సు నిర్వహిస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బాల భాస్కర్ తెలిపారు. రాజ్యాంగంలో సాంకేతిక పదాల ప్రాముఖ్యతపై నిర్వహించే సదస్సు ప్రారంభ సభ ఆజామ్ హాల్‌లో ఉంటుందని, ఈ సభలో ముఖ్య అతిథిగా విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి బుర్రా వెంకటేశం, గౌరవ అతిథిగా ఉస్మానియా విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య రవీందర్, కమీషన్ ఉప సంచాలకులు డాక్టర్. షహజాద్ ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొంటారని తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అభివృద్ధి చేయండి : బండారి



నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్‌లోని మల్లాపూర్, సూర్యనగర్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మరింత అభివృద్ధి చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డిలు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు వినతి పత్రాన్ని అందజేశారు. 100 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయాలన్నారు. మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఓల్డ్ మల్లాపూర్, నెహ్రూనగర్ కాలనీ బ్లాక్3లో బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేయాలని కోరారు. అందుకు భవనాలు కూడా అందుబాటులో ఉన్నాయని మంత్రికి తెలిపారు. ఆస్పత్రి అభివృద్ధిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మల్లారెడ్డిని కలిసిన మేకల అయ్యప్ప



నవతెలంగాణ-జవహర్‌నగర్

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డిని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు మేకల అయ్యప్ప కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం బోయినపల్లిలోని ఎమ్మెల్యే మల్లారెడ్డి నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ జవహర్ నగర్‌ను మరింత అభివృద్ధి చేసి మెడల్‌గా నిలుపుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మెట్టు వెంకన్న, బాలస్వామి పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబురాల గోడ పత్రిక ఆవిష్కరణ



నవతెలంగాణ-కాప్రా

జనవిజ్ఞాన వేదిక చెకుముకి సైన్స్ సంబురాల 2023 గోడ పత్రికను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనవిజ్ఞాన వేదిక 35 ఏండ్లుగా విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తిని, సైంటిఫిక్ టెంపర్‌ను పెంచేందుకు చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తుందన్నారు. ఎనిమిదేండ్లుగా బీపీ, షుగర్, పేషెంట్లకు చక్రీపురం క్రాస్ రోడ్‌లోని రీచక్రి విద్యానికేతన్ హై స్కూల్లో మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక మేడ్చల్ అధ్యక్షులు పిట్టల నాగరాజు మాట్లాడుతూ.. చెకుముకి సైన్స్ సంబరాలు 2023లను మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో పాఠశాల స్థాయిలో జనవరి 19 న, మండల స్థాయి జనవరి 27న, జిల్లా స్థాయి ఫిబ్రవరి 3 న, రాష్ట్రస్థాయి ఫిబ్రవరి 9, 10, 11వ తేదీల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా 300పైగా ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో 60 వేల మంది విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సైన్స్ సంబురాలకు సహకరిస్తున్న పాఠశాల యాజమాన్యాల అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దుర్గాచారి, శివ ప్రసాద్, నాయకులు మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

'ప్రజాపాలన'ను ప్రజలు సద్వినియోగించుకోవాలి



- నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి

నవతెలంగాణ-కీసర

ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని నాగారం చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ప్రజా పాలనలో భాగంగా నాగారం మున్సిపాలిటీలోని 7, 8, 9, 10వ వార్డుల్లో ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ప్రజల కోసం చేపడుతున్న ప్రజా పాలన కార్యక్రమంలో లబ్ధిదారులందరూ తమకు కావాల్సిన పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఐదు గ్యారంటీలకు 5041 మంది దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్ కుమార్, కౌన్సిలర్లు కౌకుంట్ల మమత, కోమిరెల్లి అనీత, కొట్టే దివ్య మున్సిపల్ మేనేజర్ చంద్రశేఖర్, సానిటరీ ఇన్స్‌స్పెక్టర్ రామ్‌రెడ్డి, నాయకులు గూడూరు ఆంజనేయులు, కౌకుట్ల కృష్ణా రెడ్డి, కోమిరెల్లి సుధాకర్ రెడ్డి మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసి కార్పొరేటర్ పద్మారెడ్డి



నవతెలంగాణ-బోడుప్పల్

మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిని బోడుప్పల్ 5వ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి ఆయన నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ.. ఈ ఏడాది ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కార్పొరేటర్లు కొత్త చందర్‌గౌడ్, సుమన్ నాయక్, కో ఆప్షన్ సభ్యుడు రంగ బ్రహ్మన్నగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులను పరిశీలించిన బొంతు శ్రీదేవి



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ నాగార్జున నగర్ కాలనీలోని ఆరు వీధుల్లో వేసిన 700 మీటర్ల సీసీ రోడ్డు పనులను చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ పరిశీలి ంచారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. నాణ్యత ప్రమాణాలతో రోడ్డు నిర్మాణం చేపట్టామని తెలిపారు. రోడ్డుకు క్యూరింగ్ పూర్తి చేసిన తర్వాతే వాడుకోవాలని కాలనీ వాసులకు సూచించారు.

ఐవోసీఎల్ చర్లపల్లి వద్ద పెట్రోల్ ట్యాంకర్ డ్రైవర్ల ధర్నా



- 'హిట్ అండ్ రన్' చట్టాన్ని వ్యతిరేకిస్తున్నాం
- పెట్రోల్ ట్యాంకర్స్ లోకల్ డ్రైవర్స్, వర్కర్స్, క్లీనర్ యూనియన్ చర్లపల్లి అధ్యక్షుడు ఉదయ్ కుమార్ (బాబు)

నవతెలంగాణ-బోడుప్పల్

కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా టాక్సీ డ్రైవర్ల కోసం తెచ్చిన 'హిట్ అండ్ రన్' చట్టాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ పెట్రోల్ ట్యాంకర్స్ లోకల్ డ్రైవర్స్, వర్కర్స్, క్లీనర్ యూనియన్ చర్లపల్లి అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయ్ కుమార్ (బాబు) ఆధ్వర్యంలో ఐ వోసీఎల్ చర్లపల్లి వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయ్ కుమార్ (బాబు) మాట్లాడుతూ అనివార్య కారణాల వల్ల జరిగే రోడ్డు ప్రమాదాలకు డ్రైవర్లను బాధ్యులను చేస్తూ కేంద్ర ప్రభుత్వం యాక్సిడెంట్ చేసిన డ్రైవర్‌పై పదేళ్ల జైలు సుమారు రూ.15 లక్షల జరిమానా విధించే చట్టాన్ని తీసుకురావడం అమానుషం అని వాపోయారు. రూ.20 వేల లోపు జీతంతో తమ కుటుంబాన్ని పోషించే డ్రైవర్లు రూ.15 లక్షలు జరిమానా ఎలా కడతారని, పదేళ్ల జైలు శిక్ష పడితే తన కుటుంబం ఏమవుతుందని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని డ్రైవర్ యూనియన్లు ఈ చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ శాంతియుతంగా నిరసన ధర్నా నిర్వహిస్తున్నామని, తమ ధర్నాకు మద్దతుగా లారీ ఓనర్స్ అసోసియేషన్ వారు మద్దతు ప్రకటించి పెట్రోల్ ట్యాంకర్లను నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా చర్లపల్లి ఐవోసీఎల్‌లోని శర్మ శశాంక్ అనే అధికారులు డ్రైవర్లను అనేక రకాలుగా హింసిస్తున్నారని, చిన్న చిన్న తప్పులను సాకుగా చూపి ఐడీ కార్డులు తీసుకుని వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైవర్ల సమస్యలను రాష్ట్రస్థాయిలో తీసుకెళ్తామని, ఇకనైనా ఐవోసీఎల్ చర్లపల్లి అధికారులు డ్రైవర్లపై వేధింపులు ఆపాలని హెచ్చరించారు. ఓనర్స్ కూడా డ్రైవర్ల నడ్డి విరిచేందుకు కేంద్రం తీసుకొస్తున్న చట్టాలను ఖండించి తమకు మద్దతు తెలిపాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పెట్రోలియం ట్యాంకర్ లోకల్ డ్రైవర్ క్లీనర్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు రామకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఇక్బాల్ బాయ్, జనరల్ సెక్రెటరీ మనోహర్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ అరుణ్ కుమార్, సురేందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీకాంత్, చంద్రమౌళి, ట్రెజరీ సత్తిరెడ్డి, శ్రీకాంత్, ఏటీఎఫ్ విష్ణు, కాశీ, వెంకట్ రెడ్డి, రాము పాల్గొన్నారు.

'ప్రజాపాలన'లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రావొద్దు

- మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య
- దరఖాస్తు కేంద్రాల పరిశీలన



నవతెలంగాణ-బోడుప్పల్

ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు చేసుకునేందుకు వచ్చిన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రావొద్దు అని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య అన్నారు. పీర్జాదీగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వార్డుల్లో చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య, మేయర్ జక్కు వెంకట్ రెడ్డి, కమిషనర్ ఇస్లావత్ నమ్య మంగళవారం పరిశీలించారు. ఇప్పటి వరకు కౌంటర్ల ద్వారా తీసుకున్న దరఖాస్తుల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ ఆగస్త్య మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బందులు లేకుండా దరఖాస్తు లు స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన సదస్సులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రేషన్ కార్డు లేని వారి కోసం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దరఖాస్తుల స్వీకరణలో సిబ్బంది నిర్లక్ష్యం చేయవద్దని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం మేడిపల్లి బస్తీ దవాఖానను పరిశీలించి అక్కడ అందుతున్న వైద్య చికిత్స, వైద్య పరీక్షలు, మందుల వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ బోడిగె రాందాస్ గౌడ్, నాయకులు ఈశ్వర్ రెడ్డి, డాక్టర్ పి. సుధేష్ణ పాల్గొన్నారు.

చెంగిచెర్ల దోబిఘాట్ స్థలాన్ని కబ్జా నుంచి కాపాడండి

- దోబిఘాట్ పునర్ నిర్మాణం చేపట్టాలి
- రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పైళ్ల ఆశయ్య



నవతెలంగాణ-బోడుప్పల్

మేడ్చల్ జిల్లా బోడుప్పల్ కార్పొరేషన్ పరిధి చెంగిచెర్లలో రజకుల దోబిఘాట్ స్థలాన్ని ఆక్రమణదారుల నుంచి కాపాడి కూల్చిన దోబిఘాట్‌ను పునర్ నిర్మాణం చేపట్టాలని రజకవృత్తి దారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పైళ్ల ఆశయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం చెంగిచెర్ల మూడేలయ యువజన రజక సంఘం జనరల్ బాడీ సమావేశాన్ని అధ్యక్షుడు అంబే శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళల ఆశయ్య మాట్లాడుతూ.. చెంగిచెర్ల గ్రామ ప్రజలకు చింతల చెరువు వద్ద 1985 లో సర్వేనెంబర్ 57లో ఒక ఎకరా స్థలం దోబిఘాట్ కోసం కేటాయించి దోబిఘాట్‌ను నిర్మించినట్లు తెలిపారు. కొన్ని రోజుల నుంచి చెంగిచెర్లలోని వివిధ కాలనీలకు చెందిన మురుగు నీరంతా వచ్చి చెరువులో చేరడంతో దోబిఘాట్ కుడిపోయిందని పేర్కొన్నారు. దీంతో రజకులు బట్టలు ఉతికేందుకు అనుకూలంగా లేకుండా పోయిందన్నారు. దీనిని అసరగా చేసుకున్న కొంతమంది భూ కబ్జాదారులు దోబిఘాట్ స్థలాన్ని మట్టితో కప్పి కబ్జా చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని వాపోయారు. దీనిపై అధికారులు విచారణ జరిపి కబ్జాదారులపై చర్యలు తీసుకోని దోబిఘాట్ స్థలానికి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. అనేకమంది వృత్తిదారులు తమ ఇండ్ల ముందే బట్టలు ఉతుక్కుంటున్నారని తెలపారు. ప్రభుత్వం ఆలోచించి వృత్తిదారులకు మెడ్రన్ దోబీఘాట్, కమ్యూనిటీ హాల్ నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు ఎస్. సుభద్ర మాట్లాడు తూ.. రజక వృత్తిదారులు వృత్తులు లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వమైన వెంటనే రజక వృత్తిదారులకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి సట్టు రవి సోషల్ మీడియా రాష్ట్ర కో కన్వీనర్ రాపర్తి ప్రభాకర్, అధ్యక్షులు అంబే శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు రాజేష్, కార్యదర్శి కృష్ణ, వెంకటేష్,కోశాధికారి బాలకృష్ణ, రమేష్,సలహాదారులు వెంకటేష్, మహేష్ పాల్గొన్నారు.

డీజీపీని కలిసిన సూర్యనారాయణ



నవతెలంగాణ-ఘట్కేసర్

డీజీపీ డి. రవీందర్ గుప్తాను ఘట్కేసర్ మున్సిపల్ ఎన్ఎఫ్‌సీ నగర్‌కు చెందిన సూర్యనారాయణరావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీజీపీకి పూల బొకే అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి శాలువాతో ఘనంగా సన్మానించారు.

కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్ మండలానికి చెందిన 92 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత మంగళవారం ఎమ్మార్వో కార్యాలయంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్వో వెంకట్ నరసింహా రెడ్డి, కార్పొరేటర్లు చేతన హరీష్, రజితాపరమేశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ గ్రేటర్ నాయకులు బన్నాల ప్రవీణ్ , సాయి జెన్ శేఖర్, ఎద్దుల కొండల్ రెడ్డి, కోకొండ జగన్, రామాంజనేయులు, రమేష్, శ్యామ్, బాలు తదితరులున్నారు.

అభయహస్తం వినియోగించుకోవాలి



నవతెలంగాణ-శామీర్‌పేట

అభయహస్తం సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ప్రజలకు పిలుపు నిచ్చారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా తూంకుంట మున్సిపాలిటీ, మూడుచింతలపల్లి మండలంలోని కొల్తూరు, నారాయణపూర్, శామీర్‌పేట మండలంలోని అలియబాద్, లాలుగడిమలకపేట గ్రామాల్లో మంగళవారం అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. కాగా మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి కొల్తూరు గ్రామాన్ని సందర్శించి దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. అలియబాద్‌లో 1252, లాలుగడి మలకపేటలో 1052, మూడుచింతలపల్లి మండలంలోని కొల్తూరులో 920, నారాయణ పూర్‌లో 25 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో స్మిత, ఎంపీపల్లి మండల వైస్ ఎంపీపీ మంద శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవోలు వత్సలా దేవి, వాణి గరుదాస్, ఎమ్మార్వోవోలు వాణరెడ్డి, సత్యనారాయణ, ఎంపీవోలు మంగాతా యారు, సునీత, సర్పంచులు శిల్పయాదగిరి, రాంచంద్రయ్య, వనజశ్రీనివాస్ రెడ్డి, గుర్క కుమార్ యాదవ్, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

దీప దాస్ మునిషాను కలిసిన కాంగ్రెస్ నేతలు



నవతెలంగాణ-ఘట్కేసర్

తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనరెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా నియమితులైన దీపదాస్ మునిషాను యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పొన్నం తరుణ్‌గౌడ్ నేతృత్వంలో పలువురు నాయకులు మంగళవారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఘట్కేసర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కె. వినోద్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూల బొకే అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అంబటి అజయ్, భాను, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మల్లారెడ్డిని కలిసిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-మేడ్చల్

మాజీ మంత్రి, ఎమ్మెల్యే చమకూర మల్లారెడ్డిని మేడ్చల్ మండల బీఆర్ఎస్ నాయకులు మంగళవారం వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి నూతన సంవత్సర శుభాకంక్షలు తెలిపారు. కలిసిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు దయానంద యాదవ్, ప్రధాన కార్యదర్శి సుదర్శన్,మాజీ అధ్యక్షులు శ్రీనివాస్ రాజు, నాయకులు రఘుపతి రెడ్డి, విష్ణు ఉన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు ఇబ్బంది లేకుండా చూడాలి



నవతెలంగాణ-ఉప్పల్

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు చూడాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం ఉప్పల్ ప్రభుత్వ ఆస్పత్రిని ఆయన సందర్శించారు. అక్కడ రోగులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం రోగులకు ఇలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రభుత్వ డాక్టర్లు సమయానికి వచ్చి రోగులకు చికిత్స అందించాలని ఆయన కోరారు. సమయానికి రాని డాక్టర్ల మీద ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ, తెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-శామీర్‌పేట

తూంకుంట మున్సిపల్ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూ తెలంగాణ క్యాలెండర్ ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ -మల్కాజ్ గిరి జిల్లా ప్రధాన కార్యదర్శి రామిడి వెంకట్రామ్ రెడ్డి, రాష్ట్ర బాధ్యులు సి.యచ్.సిద్ధరాములు, శామీర్ పేట్ మండల అధ్యక్షుడు యం.వెంకటేషం, రాష్ట్ర బాధ్యులు కె.ఎల్.మేరీ. తూంకుంట ప్రాథమిక పాఠశాల ఎల్ ఎఫ్ ఎల్ హెచ్ వి.కరుణశ్రీ, పాల్గొన్నారు .

అంబేద్కర్ వాదులపై బీజేపీ మతోన్మాదుల దాడి హేయం



నవతెలంగాణ-మేడ్చల్

అంబేద్కర్ వాదులపై బీజేపీ మతోన్మాదులు దాడి హేయమైన చర్యని మేడ్చల్ మండల మూఢ నమ్మకాల నిర్మూలన కమిటీ సభ్యులు చంద్రశేఖర్, ఆనంద్, మన్నె ప్రశాంత్, నర్సింగరావు, జ్యోతిచౌదరిలు అన్నారు. మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ..సోమవారం ములుగు జిల్లా, ఏటూరు నాగారం గ్రామంలో స్థానిక అంబేద్కరిస్టులు మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం వారు నిర్వహించ తలపెట్టిన "విజయ్ దివాస్" కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు, అయ్యప్ప స్వామి మాలలో ఉన్న అమాయక భక్తులను రెచ్చగొట్టి సభను జరగకుండా అడ్డుకోవడం అప్రజాస్వామికమని తెలిపారు. అయ్యప్ప స్వామి మాలలో ఉన్నవారు సభ నిర్వాహ కులను బూతులు తిడుతూ కుర్చీలను చిందర వందరగా వేయడం దౌర్జన్యం అని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం, మత్తు పదార్థాలు, మూఢనమ్మకాలు వీడుదాం శాస్త్రీయంగా జీవిద్దాం" అనే ఉద్దేశంతో ప్రజాస్వామ్యబద్ధంగా జరుగుతున్న కార్యక్రమాన్ని రాజకీయ దురుద్దేశంతోనే అడ్డుకున్నరని విమర్శించారు. గతంలో 2022లో బైరి నరేష్ అయ్యప్ప స్వామిపై చేసిన వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పారని గుర్తు చేశారు. మళ్లీ ఇప్పుడు 2024లో క్షమాపణలు చెప్పాలని కోరడం సరైనది కాదన్నారు. భీమా కోరేగాం అమరవీరుల గురించి మాట్లాడవద్దని హుకుం జారీ చేయడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎటువంటి గొడవలు జరగకూడదని అందరి మనోభావాలు గౌరవించి బాధపడిన వారికి బైరి నరేష్ క్షమాపణ చెప్పి శాంతియుతంగా వెళ్లిపోతుండగా ఆయన వాహనంపై దాడి చేయటం సిగ్గుచేటని చెప్పారు. అంబేద్కర్ పేరుతో జరిగే కార్యక్రమాలపై మతతత్వ శక్తులు విషం చిమ్ముతూ అడ్డుకోవడం ప్రగతి నిరోధకమన్నారు. ప్రభుత్వం ఈ ఘటన పై సమగ్ర విచారణ జరిపి బైరి నరేష్ కుటుంబానికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

ప్రజాపాలనకు విశేష స్పందన : కమిషనర్ రామలింగం



నవతెలంగాణ-జవహర్‌నగర్

తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన ఆరు గ్యారంటీ పథకాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని కమిషనర్ రామలింగం అన్నారు. మంగళవారం కార్పొరేషన్‌లోని ప్రజాపాలన కేంద్రాలను మున్సిపల్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జవహర్ నగర్‌లోని 28 డివిజన్‌లో కలిసి 3157 దరఖాస్తులు అందాయని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, మెప్మా సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

పనికి వెళ్లిన బాలిక అదృశ్యం.. కేసు నమోదు

నవతెలంగాణ-జవహర్ నగర్

తల్లితో పాటు ఇండ్లల్లో పారిశుధ్య పనులు చేయడానికి వెళ్లిన బాలిక అదృశ్యమైంది. ఈ సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్ నగర్‌లోని మల్లికార్జున నగర్‌లో నాయుడు నగేష్, భార్య కాశీ, ముగ్గురు పిల్లలతో కలిసి నివాసముంటున్నారు. 7వ తరగతి వరకు చదివిన భవానీ (17) తల్లితో కలిసి ఇండ్లల్లో పనిచేయడానికి వెళ్లేది. ఈ నెల 1న తల్లీకూతుర్లు పక్కపక్కనే ఇండ్లల్లో పని చేయడానికి వెళ్లారు. భవానీ పని అయిపోయినా ఎంతకు ఇంటికి రాకపోవడంతో ఇంటి యజమానిని భవానీ గురించి అడిగారు. గుర్తు తెలియని వ్యక్తికి ఫోన్‌చేసి వెళ్లిపోయిందని వారు తెలిపారు. ఆమె ఆచూకి కోసం చుట్టు పక్కల, బంధువుల వద్ద వెతికినా సమాచారం లభించలేదు. తరచు గుర్తు తెలియని వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడేదని తెలిపారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ మంత్రులను కలిసిన బీఆర్ఎస్ నాయకులు







నవతెలంగాణ-కీసర

నూతన సంవత్సరం సందర్భంగా మాజీ మంత్రులు చామకూర మల్లారెడ్డి, పి.సబితా ఇంద్రారెడ్డిలను మేడ్చల్ జిల్లా రైతు సమన్వయ సమితి మాజీ డైరెక్టర్ గండి అంజయ్య గౌడ్ ఆధ్వర్యంలో నాగారం మున్సిపాలిటీ రాంపల్లి గ్రామ బీఆర్ఎస్ నేతలు కలిసి శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు క్యాసారం అశోక్ గౌడ్ ,నాగారం మున్సిపాలిటీ మచ్చ శ్రీనివాస్ గౌడ్, పెంటయ్య గౌడ్ తదితరులున్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



- ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో 130 - సుభాష్ నగర్ డివిజన్ ఎస్.ఆర్.నాయక్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్, ముమ్మిడిశెట్టి వాసు యువసేన ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌లను ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎమ్.ఎస్.వాసు, ఎస్.ఆర్. నాయక్ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు టీటీకే.శ్రీనివాస్, సభ్యులు గోపాల్ రెడ్డి, మురళీధర్ రెడ్డి, చౌడగం శ్రీనివాస్, కిషోర్, బాబీ, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

జగదీశ్వర్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపిన యాదగిరి



నవతెలంగాణ-కూకట్‌పల్లి

నూతన సంవత్సరం సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి జగదీశ్వర్ గౌడ్‌ను, వివేకానంద నగర్ డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ భాషిపాక నాగమణి యాదగిరి కలిసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ముకయ్య, డాన్ వెంకటేష్, మహిళా నాయకురాలు ఆర్.లక్ష్మి, మైనార్టీ నాయకుడు యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి



- కార్పొరేటర్ మేకల సునీత

నవతెలంగాణ-మల్కాజిగిరి

సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి వేగవంతంగా పూర్తి చేయాలని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని న్యూ మిర్జాల కూడా విజయ వినాయక ఆలయ మార్గంలో రూ.58 లక్షలతో కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణం పనులను ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి ఈ లౌక్య, ఏఈ దివ్య జ్యోతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేంద్ర, స్థానిక నాయకులు మేకల రామ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలన దరఖాస్తు స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించిన స్థానిక కార్పొరేటర్ ..

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన దరఖాస్తు కేంద్రాన్ని మంగళవారం స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రామ యాదవ్ పర్యవేక్షించారు. స్థానిక మధుసూదన నగర్ కమిటీ హాల్లో ఆమె దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించి దరఖాస్తులపై ఆరా తీశారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దరఖాస్తులను స్వీకరించాలని సంబంధిత అధికారులకు కోరారు.



ఆరు గ్యారంటీ పథకాలకు దరఖాస్తు పంపిణీ



- దూసకంటి కళ్యాణ్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా, ఆరు గ్యారంటీల పథకాలకు సంబంధించిన దరఖాస్తు ఫార్మ్‌లను కూకట్‌పల్లి నియోజకవర్గ ఓబీసీ సెల్ ప్రెసిడెంట్ దూసకంటి కళ్యాణ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళ్యాణ్ మాట్లాడుతూ..పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధినీ దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన ఈ ఆరు గ్యారంటీ పథకాలు ప్రతి ఒక్క లబ్ధిదారుడికి చేరాలన్నారు. ఈ నెల ఆరో తేదీ వరకు అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అధికారులకు ప్రజా సమస్యలు పట్టవా..



- రింగ్ బస్తీలో రోడ్డును తక్షణమే బాగు చేయాలి
- సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఈ.ఉమామహేష్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

అధికారులకు, పాలకులకు ప్రజా సమస్యలు పట్టవా అని సీపీఐ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కార్యదర్శి ఈ.ఉమామహేష్ విమర్శించారు. జగద్గిరిగుట్ట డివిజన్ రింగ్ బస్తీలో ప్రభుత్వ పాఠశాలకు ఎదురుగా ఉన్న రోడ్డును మూడు నెలల క్రితం తవ్వి అలాగే వదిలివెయ్యడం వల్ల ప్రజలు ఇబ్బందులకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే రోడ్డును వేయ్యాలని కోరుతూ సీపీఐ మగ్దూంనగర్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అసంపూర్తిగా ఉన్న రోడ్ల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు హడావుడిగా కొత్త రోడ్డు వేస్తామని చెప్పి ఉన్న రోడ్డును తవ్వి నెలలు గడుస్తున్నా వేయకుండా ఉండటం వల్ల స్థానికులు పాదచారులు, వాహనాలు నడిపే వారు గుంతల వల్ల ప్రమాదాలు సర్వసాధారణమయ్యాయని తెలిపారు. అధికారులు, పాలకులు రేపు మాపు అంటూ కాలం వెళ్ళదిస్తున్నారే కానీ రోడ్డు వెయ్యడం లేదని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇప్పటికైనా రోడ్డు తక్షణమే వేయ్యాలని లేకపోతే స్థానిక స్థానిక ప్రజలతో కలిసి జీహెచ్ఎంసీ మున్సిపల్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి అధ్యక్షుడు ఆకుబత్తిని ప్రవీణ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వంగాల శ్రీనివాస్, జిల్లా మున్సిపల్ అధ్యక్షుడు చర్లపల్లి రాములు, కోశాధికారి సదానంద, శాఖ కార్యదర్శి సుధాకర్, స్థానికులు కరణ్ సింగ్, చంద్ర, ఖాదర్, మహేందర్, మున్నీ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోత్స్నా శివారెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-బాలానగర్

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కొంపల్లి మున్సిపల్ కౌన్సిలర్ కందాడి జ్యోత్స్నా శివా రెడ్డికి తన నివాసంలో కొంపల్లి కాంగ్రెస్ నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కొంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరి ప్రశాంత్ గౌడ్, శివ కుమార్, మాజీ సర్పంచ్ జమ్మి దేవేందర్, గోపాల్ రెడ్డి, అశోక్ రెడ్డి, మాజీ ఎంపీపీ కావలి గోపాల్, ఉపేందర్, నరేందర్, నవీన్ తదితరులు హాజరయ్యారు.



టీపీసీసీ ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డిను మంగళవారం వారి నివాసంలో కూకట్‌పల్లి నియోజకవర్గ కో ఆర్డినేటర్, టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం కలిసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.
నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

నూతన సంవత్సరం సందర్భంగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును మంగళవారం బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ శిరీష బాబురావు , డివిజన్ ప్రెసిడెంట్ ప్రభాకర్ గౌడ్, భాస్కర్ రావులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.
నవతెలంగాణ-కేపీహెచ్‌బీ





మేడ్చల్ ఎమ్మెల్యే మల్లా రెడ్డిని ఆయన నివాసంలో మంగళవారం తుంకుంట మున్సిపల్ బీఆర్ఎస్ నేతలు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ కారంగుల రాజేశ్వర్ రావు, తూముకుంట మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు నోముల శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు కోమటిపల్లి సురేష్, పి.నర్సింగ్ రావు గౌడ్ , నాయకులు కొడిమెల అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-శామీర్ పేట



రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రజల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనలో భాగంగా మూడుచింతలపల్లి మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో రేపు (బుధవారం) ఉదయం అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించబడుతుందని ఈ కార్యక్రమాన్ని సద్విని సద్వినియోగం చేసుకోవాలని లక్ష్మాపూర్ గ్రామ ఉపసర్పంచ్, మూడు చింతలపల్లి మండల యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ కటికల వైద్యనాథ్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అభయహస్తం దరఖాస్తులు తీసుకొని వారు ఎవరైనా ఉంటే తీసుకుని దరఖాస్తు చేసుకోవాలని ఆయన గ్రామ ప్రజలకు సూచించారు.
నవతెలంగాణ-శామీర్‌పేట

అందరూ సుఖసంతోషాలతో ఉండాలి



- ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలందరూ నూతన సంవత్సరంలో సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని స్థానిక ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. మంగళవారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని లక్ష్మి గణపతి భువనేశ్వర సహిత, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం(2024)నూతన సంవత్సర క్యాలెండర్‌ను దేవస్థానం వ్యవస్థాపక ట్రస్ట్ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్, మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు పార్శి ప్రకాష్ గుప్తా, దేవాలయం అధ్యక్షులు ఉప్పల రమేష్ గుప్త, కార్యనిర్వాహక కమిటీ సభ్యులతో కలిసి దేవాలయం హాల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా కుల సంఘాలు ఐక్యంగా ఉండాలని తెలిపారు. ఈ ప్రాంత ఆర్యవైశ్యులకు తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జగద్గిరిగుట్ట ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి తేరాల శ్రీనివాస్ గుప్తా, వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ వ్యవస్థాపక ట్రస్ట్ కమిటీ గౌరవ చైర్మెన్ కాచం కైలాసం గుప్తా, వైస్ ప్రెసిడెంట్ నేతి శంకర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి చిగుళ్లపల్లి లక్ష్మణరావు గుప్తా, కోశాధికారి మహంకాళి సురేష్ గుప్తా, వర్కింగ్ ప్రెసిడెంట్ యాద నరేందర్ గుప్తా, అదనపు వర్కింగ్ ప్రెసిడెంట్ గంజి స్వామి గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు తరలిన అయ్యప్ప స్వాములు



నవతెలంగాణ-శామీర్‌పేట

41 రోజుల పాటు అయ్యప్ప మాలధారణ దీక్ష చేపట్టి 41 రోజులు నిష్ట నియమాల మధ్య అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు చేసిన అయ్యప్ప స్వాములు మంగళవారం శబరిమలకు తరలివెళ్లారు. తుంకుంట మున్సిపల్ కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో అయ్యప్ప స్వాములకు సత్యం గురు స్వామి ఇరుముడ్లు కట్టారు. అనంతరం అయ్యప్ప స్వాములు కామేష్ యాదవ్ గురుస్వామి, శేఖర్ యాదవ్ గురుస్వామి, అశోక్ గురుస్వామి, హిమగిరి, ప్రసాద్ స్వాములు శబరిమలకు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మెన్ చిర్రబోయిన రాంచందర్ యాదవ్, నాయకులు మల్లేష్ యాదవ్, నాగేష్ యాదవ్, భుజంగ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకర్ ఢీకొని చిన్నారి మృతి



నవతెలంగాణ-మేడ్చల్

వాటర్ ట్యాంకర్ ఢీకొని మూడు సంవత్సరాల చిన్నారి ఆద్య మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం ఉదయం 11గంటల ప్రాంతంలో మేడ్చల్ మున్సిపాలిటీ చెక్ పోస్ట్ పారిశ్రామిక వాడ ప్రాంతంలో చిన్నారి ఆద్య (3) తన ఇంటి ముందు ఆడుకుంటున్న సమయంలో ఏపీ 28 డబ్ల్యూ 3574 నెంబర్ గల వాటర్ ట్యాంకర్ డ్రైవర్ దనవత్ నాగేష్ వాహనాన్ని నిర్లక్ష్యంగా నడుపుతూ చిన్నారి ఆద్యను ఢీకొట్టడంతో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది.కాగా పోలీసులు కేసు నమోదు చేసికుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.



మేడ్చల్ మండల పరిధిలోని రాజబొల్లారం గ్రామంలో అయోధ్య రామ తీర్థ క్షేత్ర ట్రస్ట్ నుండి వచ్చిన అక్షింతలను గ్రామ పెద్దలు,యువకులు మంగళవారం ఇంటింటికి అందజేశారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణం చారిత్రాత్మకమైన విషయంగా నిలిచిపోతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.శ్రీరాముడి ఊరేగింపుతో గ్రామంలో ఇంటింటికి అక్షింతలు పంపిణీ చేసి ఈనెల 22న సాయంత్రం ప్రతి ఇంట్లో 5దీపాలను వెలిగించాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో భక్తులు శ్రీకాంత్ ముదిరాజ్, నవీన్ గౌడ్,వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-మేడ్చల్

'టీఎన్జీవో' ఆధ్వర్యంలో నూతన సంవత్సరం వేడుకలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షులు, తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు బి.రవి ప్రకాష్ అధ్యక్షతన నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులు, వివిధ యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు, వారి కార్యవర్గ సభ్యులు కలెక్టరేట్ లోని వివిధ శాఖల ఉద్యోగులతో కలసి కేక్ కట్‌చేసి నూతన సంవత్సరం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రవి ప్రకాష్ మాట్లాడుతూ జనవరి 5వ తేదీ లోపే జీతం సరైన సమయానికి ఇచ్చి ఉద్యోగుల్ని సంతోషపరిచేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు వేయాలని సర్కారు తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కేవలం జనవరి నెలకే పరిమితం కాకుండా, ఇలాగే ప్రతి నెలా 5వ తేదీ లోపే జీతాలు చెల్లించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులకు సీఎం రేవంత్ రెడ్డి త్వరలో చిరకాల సమస్యలైన పెండింగ్ బిల్లులు, నూతన పీఆర్సీ, సీపీఎస్ రద్దు వంటి అంశాలు త్వరలో పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగులు కూడా అప్రమత్తంగా పని చేయాలని తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లోని అన్ని కార్యాలయాలు తిరుగుతూ అదనపు కలెక్టర్ అభిషేకిక్ అగస్త్యను కలిశారు. వివిధ జిల్లా అధికారులు,ఉద్యోగులని కలిసి కేక్ అందజేసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సంఘం కార్యవర్గ సభ్యులు పలుభై ఈశ్వర్, కార్యదర్శి భరత్, అసోసియేట్ ప్రెసిడెంట్ శామ్యూల్ పాల్, కోశాధికారి శేష సాయి గిరి కాంత్, ఉమెన్స్ ప్రెసిడెంట్ శ్రీదేవి, జాయింట్ సెక్రెటరీ చాంద్, ఉమెన్స్ సెక్రెటరీ పారిజాతం, ఆఫీస్ సెక్రెటరీ పద్మ, ఈసీ సభ్యులు అన్నపూర్ణ, పంచాయత్ కార్యదర్శుల శాఖ అధ్యక్షులు భాస్కర్, మేడ్చల్ యూనిట్ అధ్యక్షులు శ్రీనివాస్, మల్కాజిగిరి యూనిట్ కోశాధికా అరుణ, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షులు జేమ్స్ దాస్, ఫోరం అధ్యక్షులు రాంరెడ్డి, అనిత, శ్రీనివాస్, అక్షయ్, పాల్గొన్నారు.

డీఎంఅండ్‌హెచ్ ఆఫీసులో నూతన సంవత్సరం వేడుకలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

నూతన సంవత్సరం సందర్భంగా మంగళవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం సందడిగా కనిపించింది. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ రఘునాథ్ స్వామికి ప్రోగ్రాం అధికారులు, మినిస్టీరియల్ ఉద్యోగులు, డెమో అండ్ రిపోర్టింగ్ ఉద్యోగులు, ఎంహెచ్ఎం ఉద్యోగులు, నాలుగో తరగతి ద్యోగులు పుష్పగుచ్చాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తనను కలిసి శుభాకాంక్షలు తెలిపిన అధికారులు, ఉద్యోగులతో కలసి డాక్టర్ రఘునాథస్వామి కేక్ కట్‌చేసి అధికారులు, ఉద్యోగుల అంకిత భావానికి, కషికి, సహకార స్ఫూర్తికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ గీతా ప్రసాద్, డాక్టర్ సరస్వతి, డాక్టర్ పద్మావతి, అంజయ్య, శేష పద్మ, సత్యం, కార్యాలయ సూపరిం టెండెంట్లు పలుభై ఈశ్వర్, శ్రీనివాస్, మినిస్టీరియల్ ఉద్యోగులు శేష సాయి గిరికాంత్, అనిత, అన్నపూర్ణ, పద్మ, అనిల్, రాంరెడ్డి, జేమ్స్ దాస్, విజయ్, ఉమాపతి, శ్రీనివాస్, అక్షయ్, చందు, మంజులారెడ్డి, నాగరాజు, నాగలక్ష్మి, నాలుగో తరగతి ఉద్యోగులు బాలాజీ, సత్యనారాయణ, షమ్మీ, అమరేశ్వరి, సరోజినియమ్మ సత్తార్, గణేష్, కుమార్ పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్‌ను తన నివాసం వద్ద కుత్బుల్లాపూర్ కాపు సంఘం నాయకులు, హెచ్ఎంటీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, పలువురు బీజేపీ నాయకులు కలిసి ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. చిత్తారమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని, ఈ ఏడాది ప్రజల కోరికలు, సరికొత్త లక్ష్యాలు నెరవేరాలని మాజీ ఎమ్మెల్యే ఆకాంక్షించారు.
నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

10
నవతెలంగాణ
నమ్మదగ్గ తెలుగు దినపత్రిక
హైదరాబాద్
బుధవారం | జనవరి 03, 2024 | www.navatelangana.com

సీఎంకు నూతన సంవత్సర శుభాకాంక్షలు



నవతెలంగాణ-హిమాయత్ నగర్

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటి (టీ-జేఏసీ) ప్రతినిధి బందం రాష్ట్ర సీఎం ఎ.రేవంత్ రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపింది. ఈ మేరకు మంగళవారం టీ-జేఏసీ చైర్మెన్, ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం, జేఏసీ కో-కన్వీనర్ ఎం.వేణు రాష్ట్ర సచివాలయంలో సీఎంను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

నేడు సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 193వ జయంతిని నిర్వహిస్తున్నామని తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి రాష్ట్ర అధ్యక్షులు బెల్లపు దుర్గారావు, ప్రధాన కార్యదర్శి కీర్తి యుగంధర్ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. ఈనెల 3న గాంధీ భవనంలోని ప్రకాశం హాల్లో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ది లీడర్ అవార్డ్స్ ప్రధానం చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీ లందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు

ఉప్పల్‌లో భారీ అగ్ని ప్రమాదం

- సీఎంఆర్ షాపింగ్ మాల్‌లో ఎగిసిపడిన మంటలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ నగరంలో మరో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఉప్పల్ సీఎంఆర్ షాపింగ్ మాల్‌లో మంగళవారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ సీఎంఆర్ షాపింగ్ మాల్ ముందు భాగంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కొంత సమయానికే ఆ మంటలు భవనం మొత్తం వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, ఉప్పల్ పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. నాలుగు ఫైర్ ఇంజన్లతో మంటలను ఆర్పారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని తెలిసింది. ఆస్తి నష్టం మాత్రం భారీగా జరిగిందని సమాచారం. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

హిందీ ప్రచార సభ సొసైటీలో
అక్రమాలకు పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

- రూ.200 కోట్ల నిధులు దోచుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి
- హిందీ ప్రచార సభ పూర్వ ఉద్యోగుల డిమాండ్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

హిందీ ప్రచార సభను ఆక్రమించి సొసైటీలో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని హిందీ ప్రచార సభ పూర్వ ఉద్యోగులు ఆర్.పి.కపూర్, కె.నరేందర్, మహేష్ సింగ్, నమ్రతలు డిమాండ్ చేశారు. మంగళవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ హిందీ ప్రచార సభను ఆక్రమించి, ఆ సొసైటీలో దాదాపు రూ.200 కోట్ల నిధులు దోచుకున్న షేక్ గైబువలీ, చంద్రదేవ్ కౌడే, సురేష్ పూరీలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హిందీ ప్రచారం కోసం హైదరాబాద్ 1935లో స్థాపించిన హిందీ ప్రచార సభ 1966లో రిజిస్ట్రేషన్ గుర్తింపు పొందిందని గుర్తు చేశారు. 1966లో హిందీ ప్రచార సభ ట్రస్ట్ కు చైర్మన్ గా ఎల్ఎన్.గుప్తా, సభ్యులు బాదామి భాయ్, అచితరెడ్డి, మల్లప్ప కొల్లూర్ ట్రస్ట్ సభ్యులు మోహన్ లాల్ ట్రస్ట్ సభ్యుల పేరుతో రిజిస్ట్రేషన్ అయిందన్నారు. హిందీ ప్రచార సభను షేక్ గైబువలీ, చంద్రదేవ్ కౌడే, సురేష్ పూరీలు సొసైటీని అక్రమంగా ఆక్రమించి, అన్యాక్రాంతం చేశారని ఆరోపించారు. ట్రస్ట్ లో జరుగుతున్న అన్యాయాలను నిలదీసిన బాధితులమైన ఆర్.పి. కపూర్, కె.నరేందర్, మహేష్ సింగ్, నమ్రతలను అన్యాయంగా తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులను, న్యాయస్థానం, పబ్లిక్, విద్యార్థులను తప్పుదారి పట్టించి, హిందీ ప్రచార సభ హైదరాబాద్ సొసైటీని 59 సంవత్సరాల నుంచి సొసైటీ రిజిస్టర్ పునరుద్ధరించకుండా అందులోని వ్యక్తులు కోట్ల డబ్బులు దండుకుంటున్నారని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వ స్టాంప్ డిపార్ట్‌మెంట్ ను, న్యూఢిల్లీలోని భారత విద్యా ప్రభుత్వ (హెచ్.ఆర్.డీ) మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ నిధులను ప్రక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల నుంచి భారీ మొత్తంలో వసూలు చేసిన ఫీజులను దుర్వినియోగం చేస్తున్నారని, విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హిందీ ప్రచార సభ, హైదరాబాద్ దక్షిణ భారతదేశంలో హిందీని ప్రచారం కోసం 1935 సంవత్సరంలో ఏర్పాటు చేశారని అన్నారు. టీఎస్ కార్యాలయం గ్రాడ్యుయేషన్ స్థాయి వరకు వివిధ హిందీ పరీక్షలను నిర్వహించి, ఉపాధ్యాయ శిక్షణా కోర్సులను ఏర్పాటు చేసి లక్షల రూపాయలు గ్రాంట్ రూపంలో సెంట్రల్ హిందీ డైరెక్టరియల్, భారత ప్రభుత్వం, న్యూఢిల్లీ ద్వారా పొందుతున్నారన్నారు. దీనికి అదనంగా హిందీ ప్రచార సభ హైదరాబాద్‌లో వివిధ పరీక్షలు రాస్తున్న విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తోందని, ట్రస్ట్ ఆస్తులను సైతం అమ్ముకుని కోట్ల నిధులు దోచుకున్నారని, నాంపల్లిలోని హిందీ ప్రచార సభకు చెందిన ట్రస్ట్ భూమిని కోట్లలో అమ్ముకుంన్నారని ఆరోపించారు. ట్రస్ట్ లో జరుగుతున్న అవినీతిపై హైదరాబాద్ కలెక్టర్, చీఫ్ జస్టిస్ తెలంగాణ ప్రభుత్వం, సీబీఐ, తెలంగాణ డీజీపీ, సెంట్రల్ హోమ్ మినిస్ట్రీ, హైదరాబాద్ సిటీ కమిషనర్, చీఫ్ సెక్రెటరీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు ఫిర్యాదు చేశామని తెలిపారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ ట్రస్ట్ పై దర్యాప్తు చేసి నివేదిక ఇవ్వాలని చీఫ్ సెక్రెటరీ, ప్రిన్సిపాల్ హోమ్ కు ఆదేశాలు ఇచ్చారని గుర్తు చేశారు. గత నెలలో నాంపల్లిలోని ప్రధాన కార్యాలయం హిందీ ప్రచార సభను హైదరాబాద్ కలెక్టర్ సీజ్ చేయడం జరిగిందన్నారు. హిందీ ప్రచార సభ ట్రస్ట్ నిధులు దోచుకున్న మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ కు చెందిన వారిపై సీఎం ఎ.రేవంత్ రెడ్డి ప్రత్యేక దర్యాప్తు చేపట్టి, ప్రభుత్వానికి చెందిన ఆస్తులను కాపాడాలని వారు కోరారు.

రాజీ కుదర్చడమే ప్రథమ కర్తవ్యం..

- సౌత్, వెస్ట్ జోన్ మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రావు



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

దంపతులు మనస్పర్థాలతో, చిన్నపాటి అపోహలతో వచ్చినప్పుడు వారికి సర్ది చెప్పి రాజీ కుదర్చడమే ప్రథమ కర్తవంగా కషి చేస్తున్నామని సౌత్, వెస్ట్ జోన్ మహిళా పోలీస్ స్టేషన్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్ రావు అన్నారు. మంగళవారం షాయినాథ్ గంజ్‌లోని సౌత్, వెస్ట్ జోన్ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఆయన ఛాంబర్‌లో మాట్లాడారు. చాలా కుటుంబాలలో దంపతుల నడుమ తలెత్తిన చిన్న,చిన్నపాటి మనస్పర్థలు, అపోహలు చిలికి చిలికి గాలివానగా మారి పోలీస్ స్టేషన్లకు చేరుతున్నవన్నారు. భార్యభర్తలు కూడా అపోహలు, కొద్దిపాటి అహంకార ధోరణితో గొడవలు పడి కేసుల కోసం వస్తుంటారని.. ఇలాంటి వారికి పలు దఫాలుగా కౌన్సిలింగ్ నిర్వహిస్తాం అన్నారు. వారి ప్రవర్తనలో మార్పు తీసుకువచ్చేందుకు కషి చేస్తున్నామని తెలిపారు. అయితే కౌన్సిలింగ్ దశలో కొంత శాతం వరకు ఫిర్యాదులను రాజీ కుదిర్చి సంసారాలను చక్కదిద్ద గలుగుతున్నాం అన్నారు. ఇరు కుటుంబాల శ్రేయాభిలాషులను పిలిచి మాట్లాడి రాజీ కుదర్చి, వారి సంసారాన్ని చక్కదిద్దడమే ప్రథమ కర్తవ్యంగా కృషి చేస్తున్నామన్నారు. తమ మహిళా పోలీస్ స్టేషన్ పరిధిలో షాయినాథ్ గంజ్, మంగళ్ హాట్, హుమాయున్ నగర్, ఆసిఫ్ నగర్, హబీబ్ నగర్, లంగర్ హౌస్, గోల్కొండ, కులుసుంపుర, గుడిమ ల్కాపూర్, టపచ్చ పుత్ర ప్రాంతాలు వస్తాయన్నారు. ఎస్ ఐలు శివకుమారి, అనిత, మహమ్మద్ జాఫర్ తదితరులు దంపతులకు పలు విధాల కౌన్సిలింగ్ అందిస్తున్నారన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీఎల్‌ఎఫ్ అన్ని స్థానాల్లో పోటీ



- బీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్
- బీఎల్ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశం

నవతెలంగాణ-అంబర్‌పేట

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) తెలంగాణలోని అన్ని పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేస్తుందని బీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని నల్లకుంట బీఎల్ఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో బీఎల్ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశం బీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ కె.పర్వతాలు అధ్యక్షతన జరిగింది. బీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ వెంకట్, బీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బహుజన రాజ్యాధికారం లక్ష్యంగా ఏర్పడిన బీఎల్ఎఫ్ కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం పార్టీలకు ప్రత్యామ్నాయంగా రాజకీయ పోరాటం చేస్తుందని చెప్పారు. బీజేపీ, ఎంఐఎం పార్టీలు రెండు కూడా మతోన్మాద రాజకీయాలు చేస్తుంటే, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఆధిపత్య ఆర్థిక దోపిడి విధానాలు అనుసరిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను వందరోజుల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్రంలో పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాల ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్,బీఆర్ఎస్ పార్టీలకు ప్రత్యామ్నాయంగా వామపక్ష పార్టీలు బీఎల్ఎఫ్‌తో కలిసి పార్లమెంట్ ఎన్నికల్లో రాజకీయ పోరాటం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్లు వనం సుధాకర్,నూనె వెంకట్ స్వామిల, రాష్ట్ర నాయకులు వస్కుల మట్టయ్య, వర్గల్ గోపాల్, పోతుగంటి కాశి, లింగస్వామి బీఎల్ఎఫ్ భాగస్వామిక పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




అయ్యప్ప స్వామి ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రమేష్ నాయక్, తదితర నాయకులు.

నవతెలంగాణ-అంబర్‌పేట

బీసీ, ఎంబీసీలకు
జనాభా ప్రతిపాదికన నిధులు కేటాయించాలి

- ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో బీసీ, ఎంబీసీలకు జనాభా ప్రతిపాదికన నిధులు కేటాయించాలని ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఆయన సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బీసీ, ఎంబీసీ సంచార జాతుల సంక్షేమానికి జనాభా ప్రతిపాదికను 2024-25 బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. బీసీ, ఎంబీసీలకు కార్పొరేషన్ రుణాలు, బీసీ కులాల ఫెడరేషన్‌లోని వివిధ వత్తిదారులు ఏర్పాటు చేసుకున్న సొసైటీల ద్వారా నిధులు మంజూరు చేయాలని లేఖలో కోరామన్నారు. బడ్జెట్ ప్రతిపాదనలు చేసే క్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ కు, ఎంబీసీ ప్రిన్సిపల్ సెక్రెటరీ లకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. వెనుకబడిన కులాల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని కోరారు. అధికారులు ప్రత్యేకంగా ఎంబీసీ, బీసీ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసేలా ఆదేశాలు ఇవ్వాలన్నారు. రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధినాయకుడు రాహుల్ గాంధీ హామీ ఇచ్చిన విషయాన్ని ఆ లేఖలో గుర్తు చేశామని తెలిపారు. ఈ సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు.



రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్‌ను ఆయన ఛాంబర్‌లో కలిసి పూల బొకే అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన కింగ్ కోఠి జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రనాథ్, ఆర్ఎంఓ డాక్టర్ సాధన, హెచ్ ఓ డి డాక్టర్ జలజ, షాహిదా తదితరులు. నవతెలంగాణ-సుల్తాన్ బజార్

కష్టమర్లపై దాడికి పాల్పడిన నిందితులు అరెస్ట్

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

అబిడ్స్ గ్రాండ్ హోటల్ లో కస్టమర్లపై దాడి జరిగిన సంఘటన తెలిసిందే. ఈ సంఘటనలో దాడికి పాల్పడిన వారిని సిసి ఫుటేజీ ద్వారా గుర్తించామని అబిడ్స్ ఇన్‌స్పెక్టర్ నరసింహ రాజు తెలిపారు. డిసెంబర్ 31 రాత్రి గ్రాండ్ హోటల్ లో కస్టమర్లపై దాడికి పాల్పడిన నిందితులను సీసీ పుటేజీల ద్వారా పదిమందిని గుర్తించి న్యాయస్థానం ముందు హాజరు పరిచి రిమాండ్‌కు తరలించామన్నారు. హోటల్ యజమాని పాత్రపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. కేసును ఛేధించిన అబిడ్స్ పోలీసులను పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.



కేటీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-అంబర్‌పేట

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని అంబర్‌పేట బీఆర్ఎస్ నాయకులు అడ్వకేట్ మధుసూదన్ రెడ్డి, ఎర్రబెల్లి నరసింహారెడ్డి, మొర శ్రీరాములు ముదిరాజు, మహేందర్ రెడ్డి తదితర నాయకులు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ నీ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.



ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

నవతెలంగాణ-ముషీరాబాద్

నూతన సంవత్సరం సందర్భంగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో లక్ష్మీ గణపతి దేవాలయం చైర్మెన్, ముషీరాబాద్ నియోజకవర్గం మీడియా సెల్ ఇన్‌చార్జ్ ముచ్చకుర్తి ప్రభాకర్, సీనియర్ నాయకులు శంకర్ ముదిరాజ్, ఎం.వి జనార్దన్ తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.



టీడీపీ అంబర్‌పేట నియోజకవర్గం కోఆర్డినేటర్ ఎదెల్లి భాను ప్రకాష్ ఆధ్వర్యంలో టీడీపీ రాష్ట్ర నాయకులు అరవింద్ కుమార్ గౌడ్ ని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కిరణ్, ఎదెల్లి సత్యనారాయణ, పరశురాం తదితర నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-అంబర్‌పేట



అయోధ్య అక్షింతలు వితరణ..

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

తులసి నగర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అయోధ్య అక్షింతలు వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు మా బాబు, ఉపాధ్యక్షులు సంజీవరావు, ముఖ్య సలహాదారులు జగన్నిని వాస ఆచార్యులు, జాయింట్ సెక్రెటరీ గోపాలకృష్ణ. సభ్యులు పాల్గొన్నారు.

అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయాలి

- మాజీ మంత్రి సి.కృష్ణ యాదవ్



నవతెలంగాణ-అంబర్‌పేట

ప్రజా పాలన పథకాల దరఖాస్తుల సమర్పణ మరిన్ని రోజులు పొగిడించాలని, అదేవిధంగా అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు మాజీ మంత్రి సి కష్ణ యాదవ్ అన్నారు. మంగళవారం బాగ్ అంబర్‌పేట డివిజన్ పరిధిలోని శ్రీనివాస నగర్ కమ్యూనిటీ హాల్లో ప్రజా పాలన దరఖాస్తులను పరిశీలించి అనంతరం లబ్దిదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఇచ్చిన గ్యారంటీ పథకాలను ప్రజలకు ఇబ్బందులు లేకుండా అర్హులైన వారందరికీ అందే విధంగా చూడాలన్నారు. ప్రజలకు క్యూ లైన్‌ల మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు చుక్క జగన్ బీజేపీ ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి అచ్చిని రమేష్, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి డి వెంకటేష్, డివిజన్ ప్రధాన కార్యదర్శి ఇ.భాస్కర్, పరమేష్, యాదవ్,రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలి



- తొలగించబడిన 26 బీసీ కులాల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ రామకష్ణ

నవతెలంగాణ-హిమాయత్ నగర్

సావిత్రిబాయి పూలే జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని తొలగించబడిన 26 బీసీ కులాల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ రామకష్ణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మంగళవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సావిత్రిభాయి పూలే ఫౌండేషన్, ఎంబీసీ, డీఎన్‌టీ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం 1 గంటలకు నిర్వహించే సావిత్రిభాయి పూలే 193వ జయంతి ఉత్సవాలు, సావిత్రిబాయి పూలే అంతర్జాతీయ ఐకాన్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆళ్ళ రామకష్ణ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే ఉపాధ్యాయురాలు మాత్రమే కాదని, ఆమె రచయిత్రి, కవయిత్రి, సామాజిక కార్యకర్తగా కుల, మత, లింగ బేధాలు లేకుండా సమాజంలోని మహిళలు, బడుగు బలహీన వర్గాల బాగు కోసం శక్తివంచన లేకుండా ఎంతో కృషి చేశారని కొనియాడారు. సావిత్రిబాయి పూలే పేరుపై పురస్కారం, ప్రత్యేక మహిళా సంక్షేమం, విద్య, వైద్య, ఆర్థిక రంగాల్లో మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రజలందరూ ఘనంగా నిర్వహించాలని కోరారు. సావిత్రిభాయి పూలే జయంతి ఉత్సవాలను, సావిత్రిభాయి పూలే అంతర్జాతీయ ఐకాన్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాలను బుధవారం మధ్యాహ్నం 1 గంటకు రవీంద్రభారతిలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, ఆత్మీయ ముఖ్య అతిథులుగా శాసన సభ్యులు దానం నాగేందర్, పాయల్ శంకర్, రాజాసింగ్, గంగుల కమలాకర్ తదితరులు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సావిత్రిబాయి పూలే ఫౌండేషన్ సీఈఓ పరమేశ్వరి, బోయ హక్కుల పోరాట సమితి అధ్యక్షులు మీనగ గోపీ, తెలంగాణ ఆరెకటిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.సురేందర్, బేడ బుడగ హక్కుల సాధన సమితి అధ్యక్షులు గగనం వెంకటస్వామి, అక్షర నేస్తం తెలుగు దినపత్రిక ఎడిటర్ తిపిరిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త బండి బీభత్సం.. ఒకరు మృతి

- ఒకరికి తీవ్ర గాయాలు
- మేడిపల్లి లో ఘటన



నవతెలంగాణ-బోడుప్పల్

చెత్త సేకరించే ఆటో ఢీకొని ఒక వ్యక్తి ఘటన స్థలంలోనే మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన మేడిపల్లి పీఎస్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. మేడిపల్లి సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. నాచారం ప్రాంతానికి చెందిన లోంపి బాబి (24) అతని భార్య రోజాతో కలిసి చెంగిచెర్ల నుంచి వరంగల్ హైవే పైకి తన ద్వీ చక్ర వాహనం టీఎస్ 08 జేజెడ్7735 పై వస్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న చెత్త సేకరించే వాహనం టీఎస్08 యూజీ6362 బలంగా వారిని ఢీ కొట్టడంతో బాబీ అక్కడికక్కడే మృతి చెందగా రోజాకు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర గాయాలైన రోజాను ప్రయివేటు హాస్పిటల కు తరలించారు. ఈ ఘటనలో మరో రెండు కార్లు, రెండు ద్వీచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



ఇటీవల నిర్వహించిన జాతీయ త్రోబాల్ ఛాంపియన్ షిప్ లో తెలంగాణ రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించి రన్నరప్ గా నిలిచిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా హైదర్ నగర్ డివిజన్ సెవెన్ హిల్స్‌కి చెందిన క్రీడాకారిణి షేక్ జైనాబ్ ను డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ముఖ్యమంత్రికి మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి శుభాకాంక్షలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మంగళవారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డిని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ఆయన పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు.

సైఫాబాద్ కళాశాలకు గవర్నర్ ప్రశంసలు



నవతెలంగాణ-ఓయూ

రాష్ట్ర గవర్నర్ డా. తమిళిసై సౌందరరాజన్ మంగళవారం సైఫాబాద్ సైన్సు కళాశాలకు హృదయపూర్వక శుభాకాంక్షలు చెబుతూ ప్రశంసలతో కూడిన లేఖ పంపారు. ప్రిన్సిపాల్, ప్రొఫెసర్. జె. లక్ష్మణ్ నాయక్, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు అసోసియేషన్, నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థులు, యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్, సైఫాబాద్, ఉస్మానియా యూనివర్సిటీలో డిసెంబర్ 30న, మెగా అలుమ్ని మీట్-2023 ఈవెంట్‌ని నిర్వహించడం ద్వారా పాత విద్యార్థులను (50 బ్యాచ్‌లు) తిరిగి ఒక వేదికపైకి తీసుకు రావడం కోసం తీసుకున్న చొరవ కృషి అంకితభావాన్ని గవర్నర్ అభినందించారు. రానున్న రోజుల్లో అన్ని కళాశాలలు పూర్వ విద్యార్థులను ఒక వేదికపైకి తీసుకు వచ్చి కళాశాలల పురోగతి కోసం పాటుపడాలని కోరారు. ప్రిన్సిపాల్ ప్రో. లక్ష్మణ్ నాయక్ పరిపాలనా, కళాశాల అభివృద్ధి కోసం చేస్తున్న కృషిని గవర్నర్ కొనియాడారు.

పథకాలు అర్హులకు అందేలా చూడాలి



- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హత కలిగిన ప్రతి లబ్దిదారునికి అందేలా చూడాల్సిన బాధ్యత మనపై ఉందని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా మంగళవారం కలెక్టరేట్ సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేస్తూ.. అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా సిబ్బందిని ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికల నిర్వహణలో ప్రభుత్వ పథకాల అమలులో మీరంతా టైం అనేది చూసుకోకుండా కష్టపడి పని చేయడంతో పాటు ఎలాంటి తప్పులు లేకుండా విధులు నిర్వహించారన్నారు. ప్రజావాణి, ప్రజాపాలన కార్యక్రమాలు రొటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారని గుర్తుచేశారు. ప్రభుత్వ ప్రాముఖ్యత పథకాల అమలుకు స్పెషల్ ఆఫీసర్లతో సహకరిస్తూ.. అన్ని నియోజకవర్గాలలో పకడ్బందీగా మహాలక్ష్మి పథకంతో పాటు మిగిలిన పథకాలను ప్రారంభించామన్నారు. గత సంవత్సరం కంటే 2024లో రెట్టింపు ఉత్సహంతో పని చేయాలన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు హైదరాబాద్ జిల్లాను ఆదర్శంగా నిలపాలన్నారు. వందశాతం సిన్సియర్‌గా మనకు అప్పగించిన పని చేయాలని, అలా చేసినప్పుడే మనకు పనిలో తృప్తి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్, డీఆర్వో వెంకటచారి, సూపరిటెండెంట్ రాములు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ముజీబ్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు..



నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా సహాధ్యక్షుడు, స్కూల్ ఎడ్యూకేషన్ డిపార్టుమెంట్ యూనిట్ జిల్లా అధ్యక్షులు కె.ఆర్.రాజ్‌కుమార్, కార్యదర్శి ఎం.భాస్కర్, అసోసియేట్ ప్రెసిడెంట్ వి.డేవిడ్, కోశాధికారి ఎస్‌డీ ప్రేమ్ కుమార్, వారి కార్యవర్గం అధ్వర్యంలో మంగళవారం గృహాకల్పలోని టీఎన్జీవోస్ భవన్‌లో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎం. హుస్సేనిని(ముజీబ్) కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముజీబ్‌కు పూలబొకే అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం స్కూల్ ఎడ్యూకేషన్ డిపార్టుమెంట్ యూనిట్ టెబుల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. టీఎన్జీవో జిల్లా ఈసీ శంకర్, స్కూల్ ఎడ్యూకేషన్ యూనిట్ ఉపాధ్యక్షుడు రుగేష్, ప్రచార కార్యదర్శి ఎంవై రవి, ఈఎస్ఐ రాజ్ కుమార్, ఉస్మాన్, రామకృష్ణ, ఈసీ మెంబర్ ముజాహిద్ అలీ, ప్రియాదేవ్ ఠాకూర్, మొయిన్, ప్రాథమిక సభ్యులు చక్రవర్తి, యోగేందర్, రమేష్, సూర్య, జంబయ్య, లక్ష్మిపతి, అనిల్, జకీర్, అజీజ్, పరమేష్, సాదత్, రవి, ఇమ్రాన్, సర్ఫరాజ్, దామోదర్ పాల్గొన్నారు.



'దరఖాస్తు పత్రాలు అందేలా కార్యకర్తలు చొరవ చూపాలి'



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను మంగళవారం బంజారా హిల్స్‌లోని ఆయన నివాసంలో టీఎమ్మార్పీఎస్ నేత నల్ల శివ మాదిగ ఆధ్వర్యంలో నేతలు కార్యకర్తలు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ... ప్రజాపాలన కార్యక్రమంలో అర్హులకు అందరికీ దరఖాస్తులు అందించేలాకార్యకర్తలు చొరవ చూపాలన్నారు. ఆ పథకాల గురించి క్షేత్రస్థాయిలో కార్యకర్తలు అందరికీ అవగాహన కల్పించాలని సూచించారు.కొంత మంది దళారులు దరఖాస్తు ఫారాలు అమ్ముతూ,పథకాలు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. అలాంటి వారిని గుర్తించి తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. దానంను కలిసిన వారిలో సోమేశ్వర్ రావు,రజినీకాంత్, నర్సింగ్ రావు,లింగం తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరించిన ఐపీఈ డైరెక్టర్



నవతెలంగాణ-ఓయూ

దినపత్రికలు సామాజిక బాధ్యతగా ఉన్నత విద్యా, ఉపాధి రంగాల అభివృద్ధి కోసం, నూతన ఆవిష్కరణల పురోగతి కోసం తోడ్పాటు ఇవ్వాలని ఐపీఈ డైరెక్టర్ ప్రొపెసర్. ఎస్.శ్రీనివాస మూర్తి కోరారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో నవ తెలంగాణ నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించారు. క్యాలెండర్ ఎంతో నాణ్యతగా ఉందన్నారు.

చిన్నారులతో డైజైన్ చేయడం పట్ల అయిన ప్రశంసించారు. ఐపీఈ ప్రొఫెసర్స్, ఉద్యోగులు, విద్యార్థులు, సిబ్బందికి నుతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. దేశంలో టాప్ బిజినెస్ స్కూల్లో ఐపిఈ ఒకటి అని ధీమా వ్యక్తం చేశారు.

ప్రజాభవన్‌కు తరలిన బేగంపేట ప్రకాశ్‌నగర్ ఎక్సటెన్షన్ వాసులు



నవతెలంగాణ....బేగంపేట్

గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యే దానం నాగేందర్ అనేక భూ కబ్జాలకు చేశాడని, ఇప్పటికి బలవంతంగా రౌడీల చేత ఖాళీ చేయించేందుకు అనేక కుట్రలు చేస్తున్నాడని ఎమ్మెల్యే పై వేంటనే చర్యలు తీసుకోవాలని బేగంపేట ప్రకాశ్‌నగర్ ఎక్సటెన్షన్ వాసులు ప్రజాభవన్‌కు పెద్దఎత్తున్న తరలివెళ్లారు. భూ కబ్జాదారుడు ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొవాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది బస్తీవాసులు ప్రత్యేకంగా బ్యానర్లు ఏర్పాటు చేసుకొని బేగంపేట ప్రజా భవన్ వద్దకు మంగళవారం ఉదయమే చేరుకున్నారు. అతని నుండి తమకు ప్రాణహని ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకాశ్‌నగర్ ఎక్స్టెన్షన్ నుండి మహిళలు సైతం ప్రజాభవన్‌కు చేరుకొని ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు.

బస్తీకి చెందిన ఉపేందర్, స్వామి, అనిల్. నారాయణ, బాబురావు, శ్రీశైలం, వెంకటేష్, ఆశోక్‌లతో పాటు వందలాది మంది చేరుకొని ప్రజా భవన్ కార్యాలయంలో ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దీనిపై విచారణ చేయిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

బేగంపేటలో స్థలం ఎక్కడిది ....

బేగంపేట డివిజన్ ప్రకాశ్‌నగర్ ఎక్స్టెన్షన్‌లోని సర్వే నంబర్ 184,185,186. 194బై1 లో దాదాపు 4 ఎకరాలకు పైగా స్థలం ఉంది. ఇందుల్లో కొంత ప్రభుత్వ ప్రయివేటు స్థలం ఉన్నాది. అయితే దాదాపు 25 సంవత్సరాల క్రితం ఈ స్థలంలో చాల మంది పేద ప్రజలు పైసాపైసా కూడేసుకొని అప్పులు చేసి మరి 50 గజాలు, 100 గజాల స్థలాన్ని కొనుగోలు చేసుకొని ఇండ్లను నిర్మించుకున్నారు. అడవి ప్రాంతాన్ని తలపించిన ప్రకాశ్‌నగర్ ఎక్స్టెన్షన్ రాను రాను అన్ని సౌకర్యాలు కల్పించబడ్డాయి. ఇక్కడ నివసిస్తున్న వారికి కరెంటుతోపాటు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, నల్లాబిల్లులు ఉన్నాయి. కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన వేలాది మంది ఓటర్లు ఇక్కడే ఉన్నారు. ఇక్కడ ఉన్న వారందరికి ఓటు హక్కు కూడా ఉన్నాది. ఇంత వరకు బాగానే ఉన్నా ఓ బడా వ్యక్తి అక్కడ ఉన్న కొంత స్థలాని కొనుగోలు చేసుకున్నాడు. ఇక అంతే తాను కొనుగోలు చేసుకున్న స్థలంతోపాటు పక్కనే బస్తీలో ఉన్న స్థలం కూడ తమదే అంటూ దౌర్జన్యానికి తెగబడ్డాడని తెలిసింది. దీంతో ఒక్కసారికి ఆశ్చర్యపోయిన బస్తీవాసులు లబోదిబో మంటూ ఈ విషయాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కొంతవరకు కబ్జాదారులను నిలువరించే ప్రయత్నం చేశారు. బస్తీలో పర్యటించి మీకు అండగా ఉన్నా అంటూ భరోసా ఇచ్చారు. కొంతకాలం కబ్జాదారులు సైలంట్‌గా ఉన్నారు. ఆ తర్వాత రెచ్చిపోయి తమ వద్ద కోర్టు ఆర్డర్ ఉందంటూ బుకాయించారు. బస్తీ పైకి రౌడీలను పంపిస్తూ బస్తీవాసులను చంపి వేస్తామంటూ బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపణలు ఉన్నాయి. తాజాగా బస్తీవాసులు ప్రజాభవన్‌కు భారీగా చేరుకుని ఫిర్యాదు చేశారు.

డీఈవో ఆఫీస్‌లో నూతన సంవత్సర వేడుకలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎన్జీవోస్ యూనియన్ స్కూల్ ఎడ్యూకేషన్ డిపార్టుమెంట్ యూనిట్ అధ్యక్షులు, జిల్లా సహాధ్యక్షుడు, కె.ఆర్.రాజ్‌కుమార్, కార్యదర్శి ఎం.భాస్కర్, అసోసియేట్ ప్రెసిడెంట్ వి.డేవిడ్, కోశాధికారి ఎస్‌డీ ప్రేమ్ కుమార్, వారి కార్యవర్గం అధ్వర్యంలో మంగళవారం డీఈవో ఆఫీస్‌లో ఘనంగా న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు డీఈవో రోహిణికి పూలబోకే అందించి శాలువాతో సన్మానించారు. అనంతరం ఏడీ బి.శ్రీనివాస్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ నర్సింగ్ రావు సమక్షంలో డీఈవో చేతులమీదుగా కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో యూనిట్ వైస్ ప్రెసిడెంట్ రుగేష్, పబ్లిసిటీ సెక్రటరీ ఎంవై రవి, జాయింట్ సెక్రటరీ జయంతి రెడ్డి, ఈసీ మెంబర్లు ముజాహిద్ అలీ, ప్రియాదేవ్ ఠాకూర్, మొయిన్, ప్రాథమిక సభ్యులు రమేష్, సూర్య, అరుణ, లావణ్య, కె.పి.అనురాధ, సచిదానంద చారి, కనీజ్ ఫాతిమా, జి.రాజ్‌కుమార్, డి.శ్రీకాంత్, విజయలక్ష్మి, చక్రవర్తి, ప్రవీణా, జేమ్స్, రాణి, రేణుక, హేమావతి, బషీర్, విజయ్ కుమార్, వనజ శివజ్యోతి, గౌసియా, చైతన్య, సునీల్, సౌజన్య, సుకన్య, ఎండీఎం శ్రీకాంత్, రోషన్, లక్ష్మి, మారతమ్మ, ప్రవీణ్ పాల్గొన్నారు.

హైదరాబాద్ జేటీసీగా రమేష్ బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌గా(జేటీసీ) సి.రమేష్ మంగళ వారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఈ పోస్టులో పనిచేసిన పాండురంగ నాయక్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జేటీసీ రమేష్‌కు పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. పాండురంగ నాయక్ ఎస్టీఏ జేటీసీ అడ్మిన్‌గా బదిలీ అయిన విషయం తెలిసిందే.

ఎమ్మెల్యేకు అధికారుల శుభాకాంక్షలు



నవతెలంగాణ-బేగంపేట్

మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మంగళ వారం పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వెస్ట్ మారేడ్ పల్లిలోని నివాసంలో తన నివాసంలో కలిసి శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలను అందజేశారు. మత్స్యశాఖ ఉన్నతాధికారులు మురళీకృష్ణ, మహిపాల్, జీహెచ్ఎంసీ ఈఈ సుదర్శన్, జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు మేకల రాములు యాదవ్, సభ్యులు గుడిగే శ్రీనివాస్ యాదవ్, బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి, డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, నాయకులు శ్రీహరి, శేఖర్, ఆరీఫ్, మోహిన్, ఎస్ఆర్ నగర్ కు చెందిన సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ అధ్యక్షుడు మాణిక్ రావ్ పాటిల్ తదితరులు ఉన్నారు.

స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని మంత్రికి వినతి



నవతెలంగాణ-ఓయూ

నగరంలో వివిధ పోటీ పరీక్షలు సిద్ధమవుతున్న ఆదివాసీ నిరుద్యోగ యువతకు ప్రత్యేకమైన వసతిగహం, స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర పంచాయితీ రాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్కకు ఆదివాసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. మంత్రిని మంగళవారం వారి నివాసంలో ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సాగబోయిన పాపారావు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరెం అరుణ్ కుమార్ కలిసి కోరారు.

పెట్రోల్ కోసం బారులు



హబ్సిగూడలో పెట్రోల్ బంక్ వద్ద..



తార్నాక చౌరస్తా పెట్రోల్ బంక్ వద్ద..

నవతెలంగాణ-ఓయూ

పెట్రోల్ ఆయిల్ ట్యాంకర్స్ డ్రైవర్స్ ధర్నాతో సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని అన్ని పెట్రోల్ బంక్స్ వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. తార్నాక ప్రధాన చౌరస్తాలో మూడు పెట్రోల్ బంక్స్ ఉండటంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. అటు వైపుగా వెళ్తున్న వాహనదారులకు అసలు అక్కడ ఎం జరుగుతుందో తెలియని దుస్థితి నెలకొంది. హబ్సిగూడ ప్రధాన రహదారి వెంట ఉన్న పెట్రోల్ బంక్ వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొంది. నల్లకుంట ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ జామ్ లేకుండా ఉండేందుకు కృషి చేశారు. ఇక పెట్రోల్ బంక్స్ వద్ద సరైన క్యూ పద్ధతిలో లేకపోవడంతో పలువురు వాహనదారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.

అటు లాలా గూడా, ఇటు ఓయూ పీఎస్ పోలీసులు అక్కడ వాహనదారులను సముదాయించారు. ఇక పెట్రోల్ బంక్ యజమానులు, సిబ్బంది తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బారులు తీరిన వాహన దారులను కట్టడి చేసేందుకు ఇటు పోలీసులకు అటు యజమా నులకు, ట్రాఫిక్ పోలీసులకు కాస్త ఇబ్బంది పడ్డారు.



ఇఫ్లూ వీసీ ప్రో.ఈ. సురేష్ కుమార్ రిలీవ్

నవతెలంగాణ-ఓయూ

ఇఫ్లూ వీసీ ప్రో.ఈ.సురేష్ కుమార్ వీసీ పదవి నుంచి రిలీవ్ అయ్యారు. ఆయన ఆరున్నర సంవత్సరాలుగా ఇఫ్లూ వీసీగా పని చేశారు. తన వ్యక్తిగత కారణాలతోనే రిలీవ్ అయినట్టు ఆయన చెప్పారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇఫ్లూకు తాను వీసీ గా చేసిన కాలంలో అన్ని రకాలుగా అభివద్ధి చేసినట్టు చెప్పారు. తనకు అవకాశం ఇచ్చిన కేంద్ర ప్రభుత్వానికి ,ఇన్ని రోజులు సహకారాన్ని అందజేసిన ప్రొఫెసర్స్, ఉద్యోగులు, సిబ్బందికి కతజ్ఞతలు చెప్పారు. ప్రో.సురేష్ కుమార్ గతంలో ఓయూ రిజిస్ట్రార్‌గా సేవాలు అందజేశారు. ఇక ఇఫ్లూ ఇన్‌చార్జి వీసీగా ప్రస్తుతం అక్కడ ప్రో వైస్ ఛాన్సలర్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న ప్రో.సురభి భారతికి బాధ్యతలు అందజేశారు. ప్రో.సురేష్ కుమార్ ను ప్రొఫెసర్స్, ఉద్యోగులు, ఘనంగా సన్మానించారు.



పెద్దమ్మ తల్లి క్యాలెండర్లను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కార్యలయం వద్ద బోరబండ డివిజన్ నాయకులు నూతన సంవత్సరం సందర్భం గా ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పెద్దమ్మ తల్లి క్యాలెండర్లను మాగంటి గోపీనాథ్ చేతుల మీదుగా ఆవిష్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. బోరబండ డివిజన్ కో ఆర్డినేటర్ విజయసింహారెడ్డి, కదిర్ భాయ్ ఖదీర్, ధన్వీర్, రమేష్, అమర్, అరుణ్, శేఖర్, సాయిస్వరూప్, సతి, శ్రీను, చారి, హంసరాజ్, శ్రీధర్, శ్రీకాంత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



- ఎస్ఎఫ్ఐ ఆర్ట్స్ కాలేజీ కమిటీ అధ్యక్షులు, కార్యదర్శి శ్రీధర్, శ్రీకాంత్

నవతెలంగాణ-ఓయూ

ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆర్ట్స్ కాలేజీ కమిటీ అధ్యక్షులు, కార్యదర్శి శ్రీధర్, శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింత గణేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు, మాట్లాడుతూ ఆర్ట్స్ కాలేజీలో విద్యార్థులకు తాగునీటి సమస్య ఉందని, ఆర్‌ఓ ప్లాంట్ మంచినీళ్ల కోసం ఉపయోగించారు కానీ అది సరిగా పనిచేయడం లేదన్నారు. ప్రతిష్టాత్మకమైన, చరిత్ర కలిగిన ఆర్ట్స్ కాలేజీ బిల్డింగ్ చుట్టూ, పైన చెట్ల మొక్కలు వెలుస్తున్నాయని, దీనిని వెంటనే తొలగించాలని కోరారు. భావితరాలకు విద్యను అందించే రకంగా ఆర్ట్స్ కాలేజీ బిల్డింగ్‌ను తయారు చేయాలన్నారు. ఆర్ట్స్ కాలేజ్ ముందు ఇష్టాను సారంగా వాహనాలు పెడుతున్నారు కావున పార్కింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. అందుకు ప్రిన్సిపాల్ సానుకూలంగా స్పందిస్తూ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు ప్రశాంత్, నిహారిక, వెంకటేష్ సహాయక కార్యదర్శి శిరీష హుస్సేన్ పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ కమిషనర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మంగళవారం జీహెచ్ఎంసీ అడిషనల్, జోనల్ కమిషనర్లు, ఉన్నతాధికారులు జీహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో అడిషనల్ కమిషనర్లు స్నేహ శబరీష్, యాదగిరిరావు, ఉపేందర్ రెడ్డి, శంకరయ్య, వి.కృష్ణ, సరోజ, జయరాజ్ కెన్నడి, ఈ.వి.డి.ఎం డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి, అడిషనల్ ఎస్.పి సుదర్శన్ రెడ్డి, చీఫ్ ఇంజనీర్ జియా ఉద్దీన్, సిసిపి రాజేంద్ర ప్రసాద్ నాయక్, సి.ఇ ప్రాజెక్ట్ దేవానంద్, సి.ఇ సురేష్, జోనల్ కమిషనర్లు వెంకటేష్ దోత్రె, వెంకన్న, మమత, శ్రీనివాస్ రెడ్డి, పంకజ, రవి కిరణ్, సిపిఆర్‌ఓ మహమ్మద్ ముర్తుజా, ఓ.ఎస్.డి లు వేణుగోపాల్, రమణ, సి.ఇ. కిషన్ సింగ్, ఎస్టేట్ ఆఫీసర్ భాష తదితరులు ఉన్నారు.



కేంద్రమంత్రిని కలిసిన డాక్టర్ ముజీబ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని(ముజీబ్), కార్యదర్శి విక్రమ్ కుమార్ మంగళవారం కేంద్ర సాంస్కృతిక, పర్యాటక, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కేంద్ర మంత్రి అభివృద్ధి, సామాజిక కార్యక్రమాలను కొనియాడారు. ఆ తర్వాత కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, డాక్టర్ ముజీబ్‌ను శాలువాతో సత్కరించారు. ఉద్యోగుల కోసం పడుతున్న శ్రమ, సమాజ సేవలను గుర్తించానని చెప్పి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఈఎస్ఐ యూనిట్ అధ్యక్షుడు రాజ్ కుమార్, మిత్రులు ఉస్మాన్ అలీ ఉస్మాని, రామకృష్ణ రెడ్డి, మొహమ్మద్ ముస్తఫా, అక్రమ్ పాల్గొన్నారు.

పాఠశాలను పరిశీలించిన కార్పొరేటర్



నవతెలంగాణ-కంటోన్మెంట్

అంబేద్కర్ నగర్ వద్ద ఉన్న ప్రభుత్వ పాఠశాలను సోమవారం కార్పొరేటర్ కొంతం దీపిక ఎంవీ ఫౌండేషన్ మండల ప్రాజెక్ట్ ఇన్‌చార్జ్ లక్ష్మీనారాయణ కలిసి మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థులు పాఠశాలకు రావడానికి కౌన్సిలింగ్ చేయాలని సూచించారు. బస్తీలో ఒక ఇన్‌చార్జిని పెట్టాలని నిర్ణయించారు. అలాగే డీఈవోతో చర్చించి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రత్యేక నిధులు కేటాయించి పాఠశాలకు మౌలిక సదుపాయాలు ఉండేలా ఏర్పాటు చేస్తామన్నారు. గత మూడు సంవత్సరాల నుండి ఈ పాఠశాలకు నిధులు కేటాయించాలని స్థానిక ఎమ్మెల్యేకు పలుసార్లు వినతి పత్రాలు అందజేసినా ఇంతవరకు ఫలితం కనిపించడం లేదన్నారు.



జేటీసీ ఆఫీస్‌లో ఘనంగా న్యూఇయర్ వేడుకలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మంగళవారం ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో న్యూ ఇయర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ సి.రమేష్, స్టేట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఆఫీస్ జేటీసీ(అడ్మిన్) జె.పాండురంగ నాయక్ కేక్ కట్ చేసి..ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీవోలు జి.సురేష్ రెడ్డి, ఎల్.రాం చందర్, శ్రీనివాస్ రెడ్డి, వి.సుభాష్ చంద్రారెడ్డి, జి.సదానందం, సీపీ వెంకటేశ్వర రావు జేటీసీలకు పూలబొకే అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు, ఏఎంవీఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం ఎస్ఆర్ నగర్ ఏసీపీ వెంకటేశ్వరరావుతో కలిసి నవతెలంగాణ అమీర్‌పేట్ జోన్ ఇన్‌చార్జి రమేష్, జూబ్లీహిల్స్ రిపోర్టర్ ప్రసాదరావులు మార్కెట్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు ప్రతీ ఒక్కరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. నవతెలంగాణ-జూబ్లీహిల్స్



నవతెలంగాణ 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం ఎస్ఆర్ నగర్ ఇన్‌స్పెక్టర్ రాంప్రసాద్ రావుతో కలిసి నవతెలంగాణ అమీర్‌పేట్ జోన్ ఇన్‌చార్జి రమేష్, జూబ్లీహిల్స్ రిపోర్టర్ ప్రసాదరావులు మార్కెట్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు ప్రతీ ఒక్కరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. నవతెలంగాణ-జూబ్లీహిల్స్



ఎమ్మెల్యేను కలిసిన సత్యనారాయణ

నవతెలంగాణ-కంటోన్మెంట్

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బోయిన్‌పల్లి రిటైల్ మార్కెట్ చైర్మెన్ మక్కల సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి ఆంగ్ల నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నాయకులు నగేష్, బాల రాజ్ ,అశోక్ గౌడ్, తదితరులు ఉన్నారు.

లేడీస్ హాస్టల్ డైరెక్టర్‌ను వెంటనే తొలగించాలి

- ఎస్ఎఫ్ఐ ఓయూ అధ్యక్షులు, కార్యదర్శి ఆంజనేయులు, రవినాయక్

నవతెలంగాణ-ఓయూ

ఓయూ లేడీస్ హాస్టల్ డైరెక్టర్‌ను తొలగించాలని ఎస్ఎఫ్ఐ ఓయూ అధ్యక్షులు, కార్యదర్శి ఆంజనేయులు, రవినాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఓయూ లేడీస్ హాస్టల్‌లో నెల రోజుల నుంచి భోజనం, పరిశుభ్రత, తాగునీరు, ఫుడ్ పాయిజన్ కారణంగా నలుగురు విద్యార్థినీలు అనారోగ్యానికి గురయ్యారని తెలిపారు. అదేవిధంగా సెంటనరీ హాస్టల్లో 700 పైన అమ్మాయిలు ఉంటున్నారని.. అందులో కేవలము ఒకటే మెస్ ఉండడం వలన ఉదయము సమయానికి టిఫిన్ అందడం లేదని, విద్యార్థులు టిఫిన్ తినకుండా క్లాసులకు హాజరవుతున్నారు. కావున రెండు మెస్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. లేడీస్ హాస్టల్ డైరెక్టర్ విద్యార్థులకు అందుబాటులో ఉండకపోవడం సమస్య తీవ్రంగా ఉందని.. విద్యార్థి సంఘాల నాయకులు పలుమార్లు సంప్రదించినా కూడా స్పందించకపోవడం శోచనీయమన్నారు. విద్యార్థులకు అందుబాటులో లేని డైరెక్టర్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ ఉన్నతాధికారులు తక్షణమే సమస్యను పరిశీలించి పరిష్కార మార్గం చూపాలని కోరారు. లేనియెడలో అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ ముట్టడిస్తామని హెచ్చరించారు.

నవతెలంగాణ 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌తో కలిసి నవతెలంగాణ అమీర్‌పేట్ జోన్ ఇన్‌చార్జి రమేష్, జూబ్లీహిల్స్ రిపోర్టర్ ప్రసాదరావులు మార్కెట్‌లో విడుదల చేశారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ నియోజకవర్గం ప్రజలకు, నాయకులకు, అధికారులకు, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

నవతెలంగాణ-జూబ్లీహిల్స్





సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మరావును బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కురెల్లి నాగరాజు గౌడ్ ఆయన నివాసంలో మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎర్ర.నాగరాజు,శ్రీకాంత్ యాదవ్,శ్రీను పాల్గొన్నారు.

నవతెలంగాణ-ఓయూ

ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌చే రూపొందించిన

సరికొత్త స్టెమ్ సెల్ థెరపీకి పేటెంట్..



నవతెలంగాణ - బంజారాహిల్స్

ఆవిష్కర్తలు సయన్ బసు, వివేక్ సింగ్‌లు కంటి ఉపరితలంపై మూలకణాలను ఉపయోగించి కార్నియల్ మచ్చలు లేదా కార్నియల్ డిస్టెన్షన్ కారణంగా దష్టి నష్టానికి చికిత్స చేయడానికి పేటెంట్ పొందిన కొత్త థెరపీని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ మేరకు ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ఇద్దరు ఆవిష్కర్తలు డాక్టర్ సయన్ బసు వివేక్ సింగ్‌లకు పేటెంట్ మంజూరు చేసినట్టు డాక్టర్ సయన్ బసు ప్రొఫెసర్ డి బాలసుబ్రమణియన్ చైర్ ఆఫ్ ఐ రీసెర్చ్ ప్రొఫెసర్ బ్రియాన్ హెూల్డెన్ ఐ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్, ఎల్‌వీపీఈఐ వద్ద సెంటర్ ఫర్ ఓక్యులర్ రీజెనరేషన్ డైరెక్టర్ డాక్టర్ వివేక్ సింగ్, సుధాకర్, శ్రీకాంత్, రవి స్టెమ్ సెల్ బయాలజీ లాబొరేటరీ,ఎల్‌వీపీఈఐలో శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో అందుబాటుకు తీసుకువచ్చిన ఈ విధానం తో వైద్య సేవలు అందించి కార్నియల్ అంధత్వాన్ని తొలగించడానికి, కార్నియల్ మార్పిడి అవసరం. అయితే మార్పిడి శస్త్రచికిత్స చాలా క్లిష్టంగా ఉంటుందని, జీవితకాల సంరక్షణ అవసరమని వారు తెలియజేశారు. ఎలక్ట్రికల్ పరికరాల వినియోగం ఎక్కువగా కావడం వలన వివిధ రకాల కార్నియల్ వ్యాధులు సంభవిస్తున్నాయని తెలిపారు.

దెబ్బతిన్న కార్నియాలను రిపేర్ చేయడానికి ఉపయోగించే ఒక సరికొత్త సెల్ థెరపీకి పేటెంట్ మంజూరు చేయాలనే సృజన త్మకమైన ఆలోచనతో ఈ పేటెంట్, పేటెంట్ చట్టం,1970లోని నిబంధనలకు అనుగుణంగా 20 సంవత్సరాల కాలానికి పేటెంట్ కార్యాలయం, భారత ప్రభుత్వం ద్వారా మంజూరు చేశారు. పేటెంట్ పొందిన థెరపీ, కంటి ఉపరితలం నుండి ఉద్భవించిన మూలకణాల ప్రత్యేకమైన కూర్పును, రెండు గడ్డకట్టే ప్రోటీన్‌లను ఒకదానికొకటి పొరలుగా ఉపయోగిస్తుందని, రూపొందిన వ్యతిరేకి అందుబాటులో ఉండి సకాలంలో వైద్య సహకార అందించి కార్నియా (కంటి పారదర్శక, బయటి పొర) దెబ్బతిన్నప్పుడు ఇన్‌ఫెక్షన్ లేదా ప్రమాదాల కారణంగా అపారదర్శకంగా మారినప్పుడు కార్నియల్ మచ్చలు ఏర్పడతాయనీ

తక్కువ మధ్య-ఆదాయ దేశాలలో,అంధత్వం దష్టి లోపానికి కార్నియా అంధత్వం ఒక ప్రధాన కారణమని, ఈ పేటెంట్ పొందిన కూర్పు, కార్నియల్ ఉపరితలాన్ని ఆరోగ్యకరమైన, స్పష్టమైన కణాలతో తిరిగి నింపడానికి వ్యక్తి స్వంత లేదా దాత కార్నియల్ మూలకణాలను ఉపయోగించే మార్పిడికి ఆచరణీయమైన ప్రత్యామ్నాయాన్ని అందించే సామర్థ్యాన్ని కలిగి ఉందని వివరించారు.

క్లినికల్ ట్రయల్స్ విజయవంతమైతే, ఈ కణ-ఆధారిత చికిత్స వివిధ కార్నియల్ సెల్ ఆధారిత చికిత్సలో విప్లవాత్మక మార్పు చేకూరుతుందని ప్రజల అవసరాల మేరకు ఈ శాస్త్ర చికిత్స ఎంతగానో ఉపయోగపడుతుందని డాక్టర్ సయన్ బసు చెప్పారు.

ప్రజల శ్రేయస్సుకు తపించే మానవతావాది కొమురయ్య



నవతెలంగాణ-బేగంపేట్

"చరిత్ర సష్టించేవారు ఎప్పుడూ మాటలు చెప్పరు, చేతులతో చేసి చూపిస్తారు. ఒక్కరుగానే వస్తారు.. ప్రజల గుండెల్లో నిలుస్తారు. చరిత్రను సృష్టించే తీరుతారు". ఇవి ఒక నాయకుని లక్షణాలు. చిన్నతనం నుంచి విద్యాభ్యా సంతో పాటు నాయకత్వ లక్షణాలు కూడా కలిగిన వ్యక్తి ప్రముఖ విద్యా వ్యవస్థలైన ఢిల్లీ పబ్లిక్ స్కూల్స్ ప్రో వైజ్ చైర్మెన్, పల్లవి మోడల్ స్కూల్స్, పల్లవి ఇంజనీరింగ్ కాలేజ్, పల్లవి కిడ్స్ వ్యవస్థాపకులు, చైర్మన్ మల్కా కొమరయ్య. ఆయన అంచలంచెలుగా ఎదిగి తన జీవిత గమనంలో ప్రస్తుతం 45,000లకు పైగా విద్యార్థులను రేపటి పౌరులుగా తీర్చిదిద్దుతున్నారు. అలాగే ప్రస్తుతం 2,000 మందికి ఉపాధిని కల్పిస్తూ వారిని ప్రోత్సహిస్తున్నారు. ప్రకతి వైపరీత్యాల వల్ల ఏర్పడిన సునామి, కరోనా మొదలగు కష్ట సమయాలలో ఆపద్బాంధవుడిలా బాధితులకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేసి తన మానవత్వాన్ని చాటుకున్నారు. సమాజం పట్ల బాధ్యత కలిగిన పౌరునిగా పర్యావ రణ పరిరక్షణ, పురాతన కట్టడాల సంరక్షణ, జాతీయ నాయకుల స్మరణ మొదలైన అంశాల అవగాహనపై హెరిటేజ్ వాక్ లాంటి కార్యక్రమాలను ఎన్నింటినో నిర్వహించి ప్రజలకు అవగాహన కలిగించారు. అలాగే క్రీడా పోటీలను నిర్వహిస్తూ యువకులకు అవకాశాలను కల్పిస్తున్నారు. విద్యార్థులలో ఉన్న నూతన ఆలోచనలను బహిర్గతం చేయాలని, అనేక రకాలైన పోటీలను నిర్వహిస్తూ విద్యార్థులు అన్నింట్లో రాణించేలా కషి చేస్తున్నారు. ప్రస్తుత సమాజానికి ఇలాంటి నాయకుల అవసరం ఎంతో ఉంది. వీరి సేవలు కేవలం కొన్ని సంస్థలకే పరిమితం కాకుండా రాజకీయ రంగంలో అడుగిడి సేవలను విస్తతం చేసేం దుకు క్రియాశీలక రాజకీయాలలోకి రావాలని ఆశిస్తున్న ట్టుగా మల్కాజ్‌గిరి నియోజవర్గ ప్రజలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తెలియజేశారు.



మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే నా లక్ష్యం

మహారాష్ట్రలోని గ్రామాలకు, మహిళలకు పరిచయం అక్కరలేని ఓ పేరు సునంద తాయ్ పవార్. ఇరవై ఏండ్ల నుండి గ్రామీణ ప్రజల అభ్యున్నతి కోసం ఆమె చేస్తున్న కృషి అలాంటిది మరి. అంతేకాదు ఆమె ఓ మహిళా హక్కుల కార్యకర్త. ఆ ప్రజల కోసం ఉపాధిని సృష్టించడం, అవకాశాలను కల్పించడం కోసం నిరంతరం తపిస్తూనే ఉంటుంది. అంతేనా అక్కడి యువతతో మమేకమై పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పిస్తున్న ఆమె పరిచయం ఆమె మాటల్లోనే...

గ్రామీణ ప్రాంతాల్లో మీరు చేస్తున్న కార్యక్రమాల గురించి చెబుతారా?

మేము ఇక్కడ మారుమూల గ్రామాల్లోని మహిళల కోసం స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయడంతోపాటు, నీటి సంరక్షణ కోసం కూడా కృషి చేస్తున్నాము. అలాగే ఇంటి కోసం మహిళలు తయారు చేసే కళాఖండాలు, వివిధ రకాల ఆహార పదార్థాల ద్వారా వారిని పారిశ్రామికవేత్తలకు పరిచయం చేస్తున్నాం. దీనికోసం ప్రత్యేకంగా సహాయ బృందాలతో కలిసి భీమ్‌తడి జాతర అనే సాంస్కృతిక కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేశాం. బాలికలు, మహిళలకు పీరియడ్స్ పరిశుభ్రత గురించి అవగాహన కల్పించడం కోసం 'సోబతి' ప్రారంభించాం.





మార్గనిర్దేశం చేసేందుకు మేము కృషి చేస్తున్నాము.

స్వయం సహాయక సంఘాలు సామాజికాభివృద్ధికి తోడ్పడతాయంటారా?

స్వయం సహాయక సంఘాలు గ్రామల్లో మార్పుకు కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఇటీవలి కాలంలో గ్రామాల్లో మహిళా పారిశ్రామికవేత్తల పెరుగుదలకు, ఆర్థిక స్వాతంత్ర్యం పెరగడానికి ఇవే కారణం. ఆర్థిక స్వాతంత్ర్యం మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది. కాబట్టి వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే నా లక్ష్యం. ఈ మహిళలు తమ వ్యాపారాలను ప్రారంభించడంతో పాటు ఇతరులకు కూడా అవకాశాలు కల్పిస్తారు. కాబట్టి సామాజిక అభివృద్ధిని పెంపొందించడంలో స్వయం సహాయ సంఘాలు ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని చెప్పవచ్చు.

మిమ్మల్ని ప్రేరేపించిన సంఘటనలు?

అగ్రికల్చరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్‌కు కార్యదర్శిగా మహారాష్ట్రలోని బారామతి సమీపంలోని దాదాపు 40 కరువు ప్రభావిత గ్రామాలకు వెళ్ళాను. అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు అప్పుడే నాకు తెలిశాయి. కరువు కాలంలో మనుషులు, జంతువులు పడుతున్న బాధలు చూసి నీటి సంరక్షణ కోసం ఏమైనా చేసేలా నన్ను ప్రేరేపించాయి. నా కొడుకు సహకారంతో 80-90 గ్రామాలకు నీటి ట్యాంకర్ల తెప్పించగలిగాను. దాంతో పాటు గ్రామీణ మహిళల్లో రుతు పరిశుభ్రత సరిగా లేకపోవడం వల్ల తలెత్తే ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించాలని భావించాను. 'సోబతి' సహకారంతో ఈ కమ్యూనిటీలలోని మహిళలకు విద్య, సాధికారత కల్పించడంలో చురుగ్గా పాల్గొంటున్నాను.



మీ కార్యక్రమాల తర్వాత గ్రామాలలో ఎలాంటి మార్పులు వచ్చాయి?

'సోబతి' బాలికలకు ఐదవ తరగతి నుండి గ్రాడ్యుయేషన్ వరకు ఆరోగ్యానికి సంబంధించిన వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తుంది. ముఖ్యంగా రుతుక్రమ పరిశుభ్రతపై ప్రత్యేక ప్రాధాన్యతనిస్తుంది. అమ్మాయిలకు ఇవేంతో ఉపయోగపడుతున్నాయి. ఆరోగ్యకరమైన విద్యతో పాటు, సమగ్ర అభివృద్ధి, కెరీర్ ఎంపికలు చేసుకోవడంలో వారికి మార్గనిర్దేశం చేసేందుకు మేము కృషి చేస్తున్నాము.

వారితో పని చేసినప్పుడు మీకు ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయి?

గ్రామీణ ప్రాంతాల్లో పని చేయడం వల్ల విద్యుత్, నీటి కొరత వంటి నిరంతర సమస్యల పట్ల నాకు అవగాహన కలిగింది. నీరు, విద్యుత్‌ను ఆదా చేయడం, సాధారణ ఆరోగ్య పరీక్షలు చేయించుకునేలా వారిని ప్రోత్సహించడంలో నేను విజయం సాధించాను. ఫలితంగా గ్రామీణ మహిళల్లో పెరుగుతున్న క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించి చికిత్స ఇప్పించగలుగుతున్నాం.

ఇంత కార్యక్రమాలు చేస్తున్నారు, మీ దిన చర్య ఎలా ఉంటుంది?

అందరిలా ఇంటి పనులతోనే మొదలవుతుంది. అయితే నా వ్యక్తిగత ఆరోగ్యంపై కూడా దృష్టి పెడతాను. ప్రతిరోజూ కచ్చితంగా వ్యాయామం చేస్తాను. ఉదయం పూట పాఠశాల, కళాశాలల నుండి వచ్చే సమస్యలను పరిష్కరిస్తాం. ఫీల్డ్ వర్క్ కోసం బయటకు వచ్చిన తర్వాత నా దృష్టి పూర్తిగా తక్షణం పరిష్కరించాల్సిన సమస్యలపై ఉంటుంది.

ఇన్ని కార్యమ్రాలు చేయడానికి ప్రేరణ ఏమిటి?

గ్రామీణ ప్రాంతంలో పెరగడం వల్ల మహిళలు, బాలికలు ఎదుర్కొంటున్న సవాళ్లతో నేను మమేకమయ్యాను. వారే నా ప్రేరణ. వారి కోసం మెరుగైన సమాజాన్ని సృష్టించేందుకు వారే నన్ను నిబద్ధతతో నడిపిస్తున్నారు.

నేటి యువతకు మీరేం చెప్తారు?

రోజువారీ బాధ్యతలు మనకు ఎన్ని ఉన్నా ఇతరుల అవసరాలను గమనించడం, ప్రతిస్పందించడం చాలా అవసరం. సహాయం అవసరమయ్యే వారు మన చుట్టూ ఎందరో ఉన్నారని గుర్తించాలి. వారికి మన చేతనైన సహాయం అందించాలి. మనం చేసే సహాయం ఎంత చిన్నదైనా గణనీయమైన మార్పును కలిగిస్తుంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఉండే ఉపాధ్యాయులు, వైద్యులు, న్యాయవాదులు వంటి నిపుణులు తమ నైపుణ్యాన్ని పంచుకోవడం ద్వారా గ్రామీణ అభివృద్ధికి దోహదపడవచ్చు. ఇది గ్రామీణ భారతదేశంలోని మహిళలు, యువతరం జీవితాలను సానుకూలంగా ప్రభావితం చేస్తుంది.

\- సలీమ



మరకలు వదిలిద్దామిలా...!

మనకు నచ్చిన బట్టల పైన కానీ, వస్తువుల పైన కానీ మరకలు పడి జిడ్డుగా మారి దుర్వాసన వస్తుంటే చాలా బాధగా ఉంటుంది. మరి అలాంటపుడు ఆ మరకలు, దుర్వాసన నుండి మన వస్తువులను ఎలా కాపాడు కోవాలో చూద్దాం...

- చెమట మూలంగా షర్టులు, బ్లౌజులు మరకలతో దారుణంగా తయారవుతాయి. చూడడానికి ఎంతో అసహ్యంగా ఉంటాయి. అందువల్ల ముందుగా ఆ మరకల వద్ద లిక్విడ్ డిటర్జెంట్ సబ్బుతో రుద్ది ఆ తర్వాతే సబ్బుతో ఉతికి చూడండి. మరీ మొండి మరకలైతే మాత్రం వెనిగర్‌తో కేవలం ఆ ప్రాంతాన్ని మాత్రమే రుద్ది ఆ తర్వాత మామూలుగా సబ్బుతో కడిగేయవచ్చు. వెనిగర్ లేకుంటే గోరువెచ్చని నీటిలో నాలుగు ఆస్పరిన్ బిళ్ళలు వేసి ఆ నీటిలో దుస్తులు నానబెట్టి ఉతికేయండి. మరకలు మాయమవుతాయి. తెల్లని దుస్తులైతే మాత్రం కాస్త హైడ్రోజెన్ పెరాక్సైడ్‌ను మరకలపై రాసి అయిదు నిముషాల తర్వాత ఉతకండి.



- పెన్ను, లిప్‌స్టిక్ మరకలు బట్టలపై పడితే వాటిని ఓ పాత టవల్ పై ఉంచాలి. మరకపైకి వచ్చేలా ఉంచి ఓ చిన్న పాత గుడ్డను ఆల్కాహాలులో ముంచి దాన్ని మరకపై తట్టినట్టుగా పదేపదే చేయండి. ఆ తర్వాత ఉతకండి. మరకలు మరీ జిడ్డుగా అంటుకున్నట్లుగా అనిపిస్తే కిరోసిన్ తీసుకుని మరకపై పూసి అయిదు నిముషాల తర్వాత శెనగపిండితో గట్టిగా రుద్ది కడిగేయండి.
- కార్పెట్ పై క్యాండిల్ చుక్కలు పడితే ఓ స్టీలు గిన్నెలో ఐసుముక్కలు వేసి దాన్ని ఈ క్యాండిల్ చుక్కలపై కాసేపు ఉంచండి. చల్లదనానికి ఈ క్యాండిల్ వ్యాక్స్ మరింతగా గట్టిగా మారుతుంది. అప్పుడు ఏదైనా స్పూన్ మొనతో దానిని చెక్కేసి బ్రష్‌తో శుభ్రంగా తొలగిస్తే సరిపోతుంది.
- ప్లాస్టిక్ ప్లేట్లపై పసుపు మరకలు తొలగించాలంటే ప్లేట్లను గోధుమ పిండితో గట్టిగా రుద్ది కడిగేయండి చాలు.
- నిత్యం వాడే బకెట్లు మగ్‌లపై ఉండే జిడ్డు మరకలు పోవాలంటే ముందుగా వాటిని కిరోసిన్‌లో తడిపిన గుడ్డతో గట్టిగ తుడిచి ఆ తర్వాత సబ్బుతో కడగాలి.
- ఫ్లాస్కులో దుర్వాసన పోవాలంటే నాలుగైదు కోడిగుడ్డు పెంకులను చిన్న చిన్న ముక్కలు చేసుకుని వాటిని ఫ్లాస్కులో వెయ్యాలి. దానిపై వేడినీటిని పోసి మూతపెట్టాలి. మధ్యమధ్యలో బాగా కదిలిస్తూ ఓ గంటన్నర పాటు ఉంచండి. ఆ తర్వాత సబ్బుతో కడిగేయండి. పొడిగా తుడుచుకున్న తర్వాత ఓ చెంచాడు చెక్కెర అందులో వేసి మూతపెట్టి ఉంచండి. దుర్వాసన రాకుండా తాజాగా ఉంటుంది.

గ్రామీణ ఉపాధి హామీ చట్టంపైనే దాడి!

(మొదటిపేజీ తరువాయి)

జాబ్ కార్డు హక్కు వుంటుంది. జాబ్ కార్డు కలిగిన ప్రతి వ్యక్తికి ఏడాదిలో కనీసం వంద రోజులు పని కల్పించాల్సి వుంటుంది. జాబ్ కార్డు కలిగినవారిలో అర్హులైనవారు, అర్హులుకాని వారు అంటూ కేంద్ర ప్రభుత్వం విభజించడానికి పూనుకోవడమే ఈ చట్టాన్ని తొలిగా ఉల్లంఘించినట్టయింది. ప్రభుత్వ లెక్కల ప్రకారం, నమోదైన 25.25 కోట్ల మంది కార్మికుల్లో కేవలం 14.35కోట్ల మంది మాత్రమే అర్హులు. ఎందుకంటే గత మూడేండ్లలో వారు కనీసం ఒక రోజు పని అయినా చేసినందున వారికి అర్హత వుంది. కానీ, జాబ్ కార్డు కలిగిన మహిళ గతంలో పనిచేయకపోయినా ఇప్పుడు పనిచేయాలని నిర్ణయించుకున్నట్లైతే, అమె పనిచేయలేదు. ఎందుకంటే ఆమెను అనర్హురాలని ఎంఎన్‌ఆర్‌ఈజీఏ సైట్ ప్రకటించేసినందున ఆమె ఇక పనిచేయలేదు. మరో మాటలో చెప్పాలంటే, 10కోట్ల మందికి పైగా కార్మికులను అనర్హులుగా ప్రకటించారు. చట్టం ప్రకారం వారికి జాబ్ కార్డు వుండేందుకు హక్కు వుంది. అయినా ఏబీపీఎస్ పొందేందుకు వారు అనర్హులైనందున ఎంఎన్‌ఆర్‌ఈజీఎస్ సైట్‌లో పనిచేసే హక్కు నిరాకరించబడింది. అర్హులుగా ప్రకటించిన 14.35కోట్ల మంది జాబ్ కార్డుదారుల్లోనూ దాదాపు 12.7శాతం మంది అంటే దాదాపు 1.8కోట్ల మందికి ఏబీపీఎస్ లేదు. అందువల్ల వారు ఎంఎన్‌ఆర్‌ఈజీఏలో పనిచేయడానికి అర్హులు కాకుండా పోతున్నారు. గతంలో ప్రభుత్వం ఆన్‌లైన్ నమోదు వ్యవస్థ విధించింది. అయితే గ్రామీణ భారతంలో అనేక ప్రాంతాల్లో ఇంటర్‌నెట్ వ్యవస్థ సరిగా లేకపోవడంతో పని ప్రదేశాల్లో కార్మికుల హాజరు ఆమోదం పొందలేదు. ఆన్‌లైన్ నమోదు లేకపోతే వారికి వేతనాల చెల్లింపును నిరాకరిస్తూ వచ్చారు.

ఇదంతా చట్టంపై నిర్ద్వంద్వంగా దాడి చేయడమేనని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో తీవ్రంగా విమర్శించింది. వంద రోజుల వరకు పరిమితి విధించడం వంటి నిబంధనలతో సంబంధం లేకుండా గ్రామీణ పేదలకు ఎంఎన్‌ఆర్‌ఈజీఏ ఒక వరంగా మారిందని రుజువైంది. ముఖ్యంగా నిరుద్యోగం వల్ల తీవ్ర ఇబ్బందుల్లో వున్న గ్రామీణ ప్రజానీకానికి ఇది కచ్చితంగా ఒక ఆశాకిరణంగా వుంది. కానీ, మోడీ ప్రభుత్వం చట్టపరమైన అర్హతపై దాడి చేయడానికి సాంకేతికతను ఉపయోగిస్తోందని ఆ ప్రకటన విమర్శించింది. ఈ పరిస్థితుల్లో, ఎంఎన్‌ఆర్‌ఈజీఏ హామీ కల్పించిన కార్మికుల హక్కులపై ఇది అక్రమంగా దాడి చేయడమేనంటూ పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. ఆధార్ ప్రాతిపదిక చెల్లింపు వ్యవస్థకు తప్పనిసరిగా ముడిపెట్టడాన్ని తక్షణమే ఉపసంహరించాలని డిమాండ్ చేసింది.

పోటీ చేద్దామా..? వద్దా...?

(మొదటిపేజీ తరువాయి)

వినికిడి. మరోవైపు అసెంబ్లీ ఎన్నికల్లో కారు పార్టీ పరువు నిలబెట్టిన జీహెచ్‌ఎమ్‌సీతోపాటు ఉత్తర తెలంగాణ జిల్లాలైన ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల్లోని పార్లమెంటు సీట్లకు అత్యధిక మంది పోటీ పడుతున్నట్టు తెలిసింది. హైదరాబాద్ స్థానాన్ని తన మిత్రుడైన ఎంఐఎంకు వదిలేయాలని బీఆర్ఎస్ భావించిన క్రమంలో అది కాకుండా సికింద్రాబాద్, చేవెళ్లతోపాటు ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని పార్లమెంటు స్థానాలపై పోటీ చేసేందుకు పలువురు ఉవ్విళ్లూరుతున్నారు. చేవెళ్ల ఎంపీ స్థానానికి ఇప్పటికే ఎంపీ రంజిత్ రెడ్డిని పోటీ చేయాలంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించిన సంగతి విదితమే. ఇదే సమయంలో ఇప్పటికే అనేక పదవులు అనుభవించిన వారికీ, సిట్టింగులకు, ఎమ్మెల్యేలుగా ఓడిపోయి మళ్లీ ఎంపీ టిక్కెట్ల కోసం ఆరాటపడుతున్న వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ టిక్కెట్లు ఇవ్వొద్దంటూ పలువురు కీలక నేతలు అధిష్టానానికి చెప్పినట్టు సమాచారం. తమకు కాకుండా మళ్లీ అలాంటి వారికే అవకాశమిస్తే కచ్చితంగా ఓడిస్తామనే సంకేతాలను కూడా వారు ఇచ్చినట్టు తెలిసింది. ఇలాంటి పరిణామాల నేపథ్యంలో బుధవారం నుంచి నిర్వహించబోయే పార్లమెంటు నియోజకవర్గాలవారీ సన్నాహక సమావేశాల్లో బీఆర్ఎస్ అధిష్టానం ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. తొలుత ఆదిలాబాద్ ఎంపీ స్థానం నుంచి ఈ సమీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాలు... ఈనెల 12 వరకూ కొనసాగుతాయి. సంక్రాంతి సందర్భంగా 13 నుంచి 15 వరకు విరామమిచ్చి... 16 నుంచి కొనసాగిస్తారు. 21తో ఈ సన్నాహక సమావేశాలు పూర్తవుతాయి.

నిష్పాక్షిక, స్వతంత్ర వ్యవస్థ ఉండాలి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన చట్టాన్ని సవాల్ చేస్తూ న్యాయవాదుల బృందం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. న్యాయవాది అంజలే పటేల్ తయారు చేసిన రిట్ పిటిషన్‌ను న్యాయవాది-ఆన్-రికార్డ్ సంజీవ్ మల్హోత్రా సుప్రీంకోర్టులో మంగళవారం దాఖలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌తో పాటు ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకానికి నిష్పాక్షిక, స్వతంత్ర ఎంపిక కమిటీని ఏర్పాటుచేసేలా కేంద్రాన్ని ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు. ఎన్నికల కమిషనర్ల నియామకంలో కేంద్రం పూర్తిగా పారదర్శకత పాటించేలా చూడాలని పేర్కొన్నారు. నియామక కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని చేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం కొత్తగా సీఈసీ, ఈసీ నియామక బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించగా.. డిసెంబర్ 28న గెజిట్ నోటిఫికేషన్ సైతం విడుదలైంది.

సీఈసీ, ఈసీల నియామకానికి సంబంధించిన బిల్లులోని క్లాజ్ 10ని కేంద్రం సవరించింది. ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కేంద్ర మంత్రితో కూడిన కమిటీ ఎన్నికల కమిషనర్లను నిర్ణయించాలని బిల్లు నిర్దేశించింది. ఈ కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్థానంలో కేంద్ర మంత్రిని చేర్చారు. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పు ప్రకారం.. కమిటీలో ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉండాలి. కానీ ప్రస్తుత చట్ట సవరణ ప్రకారం సీజేఐని కమిటీ నుంచి తొలగించారు. దీంతో రాజ్యాంగ అధికారాన్ని పిటిషన్‌లో ప్రశ్నించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్, కమిషనర్‌లకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో సమానమైన జీతం అందనున్నది. ప్రయోజనాలు లభిస్తాయని ప్రభుత్వం బిల్లులో సవరణ తెచ్చింది.

తొలిసారిగా ప్రవేశపెట్టిన బిల్లులో క్యాబినెట్ సెక్రటరీకి సమానంగా జీతం ఇవ్వాలని నిబంధన ఉండగా.. ఇది ఎన్నికల కమిషనర్ల స్థాయిని తగ్గించినట్లేనన్న విమర్శలు వచ్చాయి. సుప్రీంకోర్టు న్యాయమూర్తికి చెల్లించే వేతనంతో సమానంగా చెల్లించేలా సవరణలు తీసుకొచ్చింది. అయితే, అలవెన్సులు, ఇతర సౌకర్యాల్లో మాత్రం వ్యత్యాలుంటాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్, కమిషనర్లు తమ విధులను నిర్వర్తిస్తున్నప్పుడు అన్ని క్రిమినల్, సివిల్ దావాల నుంచి బిల్లు రక్షణను కల్పిస్తుంది. సెక్షన్ 15(ఎ) ఎన్నికల ప్రక్రియలో ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ తీసుకున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా ఎలాంటి ఎఫ్ఐఆర్ దాఖలు చేయరాదు.

కోర్టుల్లో మాత్రమే సవాల్ చేసేందుకు అవకాశం ఉంటుంది. చట్టంలో కమిషనర్ల సెర్చ్ కమిటీ ఫార్మాట్‌ను మార్చారు. సవరణ తరువాత, ఇప్పుడు కమిషనర్ నియామకానికి ముందు, దేశంలోని న్యాయ మంత్రి, కేంద్ర ప్రభుత్వంలో కార్యదర్శి స్థాయి ఇద్దరు అధికారులు ఐదుగురు వ్యక్తులతో కూడిన ప్యానెల్‌ను సిద్ధం చేస్తారు. సెర్చ్ కమిటీ ఐదుగురిని సిఫార్సు చేసేందుకు అవకాశం ఉంటుంది. క్యాబినెట్ సెక్రటరీ స్థానంలో న్యాయశాఖ మంత్రిని సెర్చ్ కమిటీకి అధిపతిగా నియమిస్తూ ప్రభుత్వం సవరణలు తీసుకువచ్చింది. సెక్షన్ 11 ఆధారంగా సీఈసీ, ఈసీల తొలగింపు ఉంటుంది.

ఎక్కడి వాహనాలు అక్కడే..

(మొదటిపేజీ తరువాయి)

దిగ్బంధించి, రహదారిపై తమ వాహనాలను అడ్డుపెట్టారు. రోడ్లపై టైర్లను తగలబెట్టారు. సమస్యను పరిష్కరించేందుకు కేంద్రం వెంటనే చర్చలు ప్రారంభించాలని ఆల్ ఇండియా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కాంగ్రెస్ (ఏఐఎంటీసీ) ఛైర్మన్ బాల్ మల్కిత్ సింగ్ డిమాండ్ చేశారు. చట్టంలోని కొన్ని అంశాలు వేధింపులకు, దోపిడీకి, అనవసరపు నిర్బంధానికి, చట్టపరమైన పరిణామాలకు దారితీస్తాయని ఆల్ ఇండియా ట్రాన్స్‌పోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి ఒకరు చెప్పారు. 'ప్రభుత్వం తీసుకొచ్చిన సవరణ పూర్తి అసమంజసంగా ఉంది. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు మాకు కూడా తీవ్ర గాయాలు అవుతాయి. కానీ మా పక్షాన జోక్యం చేసుకోవడానికి ఎవరూ రారు' అని ఓ ట్రక్కు డ్రైవర్ వాపోయారు. ముంబయి మెట్రోపాలిటన్ ప్రాంతం (ఎంఎంఆర్)లో నడిచే ట్రక్కులు, టెంపోలు, కంటైనర్లలో 70% వరకూ ఆగిపోయాయి. ఈ ప్రాంతంలో అనునిత్యం లక్షన్నర వాహనాలు తిరుగుతుంటాయి. భారీ వాహనాలలో 35% వరకూ నిత్యావసరాలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్‌ను రవాణా చేస్తుంటాయి. ముంబయిలో ఒక రోజు సమ్మె చేస్తే రూ.120-150 కోట్ల నష్టం వాటిల్లుతుందని అంచనా. ముంబయి-అహ్మదాబాద్ హైవేపై 500 మందికి పైగా డ్రైవర్లు రాస్తారోకో చేయడంతో ట్రాఫిక్ స్తంభించింది. వాహనాలు నాలుగు గంటలకు పైగా రహదారి పైనే నిలిచిపోయాయి. నైగార్ ప్రాంతంలో పోలీసులపై కొందరు రాళ్ల రువ్వారు. గుజరాత్‌లోని సూరత్, మధ్యప్రదేశ్‌లోని ఇండోర్, హర్యానాలోని అంబాలా సహా పలు నగరాలలో పెద్ద ఎత్తున నిరసనలు జరుగుతున్నట్లు వార్తలు అందుతున్నాయి. పంజాబ్‌లో కనీసం ఏడు లక్షల ట్రక్కులు నిలిచిపోయాయి.

మధ్యప్రదేశ్‌లో పది వేల ట్రక్కులు, బస్సులు, టాక్సీలు ఆగిపోయాయని రవాణా యూనియన్లు తెలిపాయి. సమ్మె కారణంగా ప్రజా రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇంధన సరఫరాలకు ఆటంకం కలగడంతో ఇండోర్, బాలాఘాట్, ఉజ్జయిని, రత్లాం, భోపాల్ వంటి పలు జిల్లాలలో పెట్రోలు బంకుల వద్ద వాహనాలు బారులు తీరాయి. ధార్‌లో ముంబయి-ఆగ్రా హైవేపై డ్రైవర్లు తమ వాహనాలను నిలిపి, ట్రాఫిక్‌ను అడ్డుకున్నారు. పన్నా వద్ద బస్సు, ట్రక్కు డ్రైవర్లు 39వ నెంబరు జాతీయ రహదారిని దిగ్బంధించారు. జమ్మూకాశ్మీర్, లఢక్ ప్రాంతాలలో ఇంధనాన్ని సరఫరా చేసే 1,500 ట్యాంకర్లు ఆగిపోయాయి. శిక్షాకాలాన్ని పెంచుతూ తీసుకొచ్చిన నూతన నిబంధనలను 'చీకటి చట్టం'గా డ్రైవర్లు అభివర్ణిస్తున్నారు. సవరణను ఉపసంహరించే వరకూ ఇంధనాన్ని, నిత్యావసరాలను సరఫరా చేయబోమని స్పష్టం చేశారు. ప్రమాదానికి విధించే జరిమానాను ఏడు లక్షల రూపాయలుగా నిర్ణయించడంపై వారు మండిపడుతూ 'అంత డబ్బే మా దగ్గర ఉంటే సొంతగా వాహనాన్ని కొనుక్కునే వాళ్లం. డ్రైవర్లుగా ఎందుకు ఉంటాము?' అని ప్రశ్నించారు.

చట్టం ఏం చెబుతోంది?

భారతీయ న్యాయ సంహిత చట్టం హిట్ అండ్ రన్ కేసులకు సంబంధించి కఠిన శిక్షలు ప్రతిపాదించింది. దీని ప్రకారం...వాహనం ఎవరినైనా ఢీకొట్టినప్పుడు దానిని నడుపుతున్న డ్రైవరు ఆ విషయాన్ని పోలీసులకు లేదా అధికారులకు తెలియజేయకుండా పరారైతే పది సంవత్సరాల జైలు శిక్ష, ఏడు లక్షల రూపాయల జరిమానా విధిస్తారు. అయితే 'నిర్లక్ష్యం కారణంగా మరణానికి కారణమైతే' అనే క్లాజు కింద శిక్షను రెండు కేటగిరీలుగా వర్గీకరించారు. మొదటి కేటగిరీలో... ఉద్దేశపూర్వకంగా కాకుండా వాహనాన్ని వేగంగా లేదా నిర్లక్ష్యంగా నడిపి వ్యక్తి మరణానికి కారణమైతే నిందితుడికి ఐదు సంవత్సరాల వరకూ జైలుశిక్ష, జరిమానా విధిస్తారు. ఇక రెండో కేటగిరీలో...ఉద్దేశపూర్వకంగా కాకుండా వేగంగా లేదా నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపి వ్యక్తి మరణానికి కారణమైనప్పుడు, ఆ సమాచారాన్ని పోలీసు అధికారి లేదా మెజిస్ట్రేట్‌కు తెలియజేయకుండా పరారైతే పది సంవత్సరాల వరకూ జైలుశిక్ష, జరిమానా విధిస్తారు. అయితే నిందితుడు లేదా డ్రైవరు ప్రమాద సమాచారాన్ని అధికారులకు ఎలా చేరవేయాలన్న విషయంపై మాత్రం చట్టంలో స్పష్టత ఇవ్వలేదు. ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు సాధారణంగా ప్రజలు వాహన డ్రైవర్లపై ఆగ్రహంతో ఉంటారు. అలాంటప్పుడు డ్రైవర్లు స్వయంగా అధికారుల వద్దకు వెళ్లి ఎలా సమాచారం ఇస్తారన్నదే ప్రశ్న. గతంలో ఐపీసీ సెక్షన్ 394-ఏ కింద ఈ తరహా నేరానికి నిందితుడికి రెండేళ్ల వరకూ జైలుశిక్ష విధించే వారు. తాజా చట్టంలో ఆ నిబంధనలను మరింత కఠినతరం చేశారు.

ట్రక్ డ్రైవర్ల సమ్మె విరమణ

హిట్ అండ్ రన్ రోడ్డు ప్రమాద కేసులపై కొత్త చట్టానికి వ్యతిరేకంగా సమ్మెను ట్రక్ డ్రైవర్లు మంగళవారం సాయంత్రం నుంచి విరమించారు. డ్రైవర్లు వ్యతిరేకిస్తున్న కొత్త చట్టం ఇంకా అమల్లోకి రాలేదని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. డ్రైవర్లతో సంప్రదింపులు జరిపిన తరువాతే కొత్త చట్టాన్ని అమల్లోకి తీసుకుని వస్తామని కేంద్ర హామీ ఇచ్చింది. దీంతో సమ్మెను డ్రైవర్లు విరమించారు. రెండు రోజులగా ట్రక్ డ్రైవర్లు సమ్మె నేపథ్యంలో డ్రైవర్ల ప్రతినిధులతో కేంద్ర హోం శాఖ కార్యదర్శి అజయ్ భల్లా మంగళవారం సాయత్రం చర్చలు జరిపారు. ఈ చర్చల్లో కేంద్రం తరపున పై హామీ ఇచ్చారు.

బీజేపీ నుంచి పోటీ చేయండి

(మొదటిపేజీ తరువాయి)

విషయం విదితమే. పెండింగ్ యూనివర్సిటీ బిల్లుల విషయంతో పలు సందర్భాల్లో ఆయన ప్రభుత్వ వ్యవహారాల్లో బీజేపీ ప్రతినిధిలా జోక్యం చేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో గవర్నర్ తీరు సర్వత్రా చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో బృందాకరత్ పై విధంగా స్పందించారు. "గౌరవ గవర్నర్‌కు నేరుగా రాజకీయాల్లో రావాలనే ఆసక్తి ఉంటే రావాలి. షెడ్యూల్ ప్రకారం 2024 లోక్‌సభ ఎన్నికలు రానున్నాయి. ఆయన తన రాజకీయ ఔన్నత్యాన్ని కొలవాలనుకుంటే ఎన్నికల్లో పోటీ చేయాలి. బహుశా, కేరళ గవర్నర్ నేరుగా ఎన్నికల రాజకీయాల్లోకి రావటం మరింత సముచితం. బీజేపీ టికెట్ తీసుకొని కేరళలోని ఏ స్థానం నుంచైనా పోటీ చేయాలి' అని బృందా కారత్ అన్నారు. రోజువారీ బహిరంగ ప్రకటనలు చేస్తూ తన సొంత పదవిని కించపరిచే బదులు, ముఖ్యమంత్రితో ఆయనకున్న విభేదాలను గవర్నర్ తొలగించుకోవాలని సూచించారు.

స్తంభించిన రవాణా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సోమవారం నుంచి ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్లు చేపట్టిన సమ్మెతో రాష్ట్ర వ్యాప్తంగా జన జీవనం స్తంభించింది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన భారతీయ న్యాయసంహిత 2023 మోటారు వాహనాల హిట్ అండ్ రన్ చట్టసవరణ బిల్లుకు వ్యతిరేకంగా వారు ఆందోళన బాట పట్టడంతో రాష్ట్రంలో పెట్రోల్ డీజిల్ సరఫరా నిలిచి పోయింది. హైదరాబాద్‌తోపాటు రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పెట్రోల్ బంకులను యజమానులు మూసి వేశారు. చాలా బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు దర్శనమిచ్చాయి. దీంతో అప్రమత్తమైన వాహనదారులు తెరిచి ఉన్న పెట్రోల్ బంకుల వద్ద పెట్రోల్, డీజిల్ కోసం క్యూ కట్టారు. దీంతో హైదారాబాద్ నగరంలో పలు చోట్ల రోడ్లపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రద్దీ, క్యూ లైన్ పెరిగిన దరిమిలా నగరంలోని పలు ప్రాంతాల్లో పోలీసులు బారికేడ్లు పెట్టి ట్రాఫిక్‌ను మళ్ళించారు. పంజాగుట్ట నుంచి లక్డీకాపూల్ వరకు, అక్కడి నుంచి మెహిదీపట్నం, హైటెక్‌సిటీ ఐకియా చౌరస్తా, ఎల్బీనగర్, మియాపూర్, కూకట్ పల్లి వరకు రెండు గంటల పాటు వాహనాలు ఎక్కడికక్కడే నిలిచి పోయాయాయి. దీంతో సాయంత్రం పూట ఆఫీసులు, పాఠశాలల నుంచి ఇంటికివెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

సమ్మె విరమణ
రాజశేఖర రెడ్డి, టీపీడీటీఏ అధ్యక్షులు

ఆయిల్ ట్యాంకర్ల డ్రైవర్లు చేపట్టిన సమ్మెను మంగళవారం సాయంత్రం విరమించినట్లు తెలంగాణ పెట్రోల్ డీజిల్ ట్యాంకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా యధావిధిగా బుధవారం నుంచి పెట్రోల్ డీజిల్ అందుబాటులోకి రానుందని తెలిపారు. కేంద్రం తీసుకొచ్చిన కొత్త చట్టాన్ని పరిశీలిస్తున్నామనీ విధి విధాలపై ఓ అవగాహనకు వచ్చిన తర్వాత తదుపరి కార్యచరణను ప్రకటిస్తామని తెలిపారు.

సమ్మె యథాతదం
బీపీటీఎంఎం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్

ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్లు సమ్మె విరమించలేదనీ, యథావిధిగా కొనసాగుతుందని బారతీయ ప్రయివేటు ట్రాన్స్ పోర్టు మజ్దూర్ సంఘ్ (బీపీటీఎంఎం) జాతీయ కార్యదర్శి రవిశంక్ తెలిపారు. బుధవారం నుంచి దేశ వ్యాప్తంగా ఉన్న ప్రయివేటు రవాణా రంగంలో ఉన్న లారీలు, ఆటోలు, డీసీఎంలు, మినీ గూడ్స్ వాహనాల డ్రైవర్లందరూ ఆందోళనలో పాల్గొంటారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భారతీయ న్యాయసంహిత 2023 మోటారు వాహనాల హిట్ అండ్ రన్ చట్టసవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

సింగరేణి ఇన్‌చార్జి సీఎమ్‌డీగా బలరాం

- సీఎమ్‌డీ ఎన్ శ్రీధర్ బదిలీ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సింగరేణి ఇన్‌చార్జి సీఎమ్‌డీగా ఎన్ బలరాం నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన అదే సంస్థలో ఫైనాన్స్ విభాగం డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. డిప్యుటేషన్‌పై సుదీర్ఘకాలం సీఎమ్‌డీగా పనిచేసిన ఎన్ శ్రీధర్ పదవీకాలం పూర్తికావడంతో ఆయన్ని సాధారణ పరిపాలనా విభాగంలో రిపోర్టు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. 2015 జనవరి 1 నుంచి 9 ఏండ్లుగా ఎన్ శ్రీధర్ సింగరేణి సీఎమ్‌డీగా పనిచేశారు.

సమం చేస్తారా?

కొత్త ఏడాది. పాత సవాల్. సఫారీ పర్యటనలో టీమ్ ఇండియా ఎదుర్కొంటున్న విచిత్ర పరిస్థితి. 32 ఏండ్లుగా దక్షిణాఫ్రికా గడ్డపై టెస్టు సిరీస్ విజయం కోసం ప్రయత్నిస్తున్న టీమ్ ఇండియా మరో అవకాశం చేజార్చుకుంది. ఏమాత్రం అచ్చిరాని కేప్‌టౌన్‌లో ఇప్పుడు సిరీస్ కాపాడుకునే పరీక్షకు సిద్ధమైంది. ఆతిథ్య దక్షిణాఫ్రికా 2-0 టెస్టు సిరీస్ విజయం కోసం బరిలోకి దిగుతుండగా.. భారత్ 1-1తో సిరీస్‌ను సమం చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంది. భారత్, దక్షిణాఫ్రికా రెండో టెస్టు సమరం నేటి నుంచి ఆరంభం.

- సఫారీతో రెండో టెస్టు నేటి నుంచి
- కేప్‌టౌన్‌లో రోహిత్‌సేనకు కఠిన పరీక్ష
- 2-0 విజయంపై దక్షిణాఫ్రికా గురి

మ॥ 1.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..



నవతెలంగాణ-కేప్‌టౌన్

సఫారీ సవాల్‌లో మరో అంకానికి రంగం సిద్ధం. భారత్, దక్షిణాఫ్రికా కేప్‌టౌన్ వేదికగా నేటి నుంచి రెండో టెస్టులో అమీతుమీ తేల్చుకోనున్నాయి. వరుణుడి అంతరాయం, సఫారీ సారథికి గాయం.. ఇవేవీ సెంచూరియన్‌లో టీమ్ ఇండియా పరాజయాన్ని నిలువరించలేదు. బాక్సింగ్ డే టెస్టులో భారత్‌పై మూడు రోజుల్లోనే ఇన్నింగ్స్ విజయం అందుకున్న దక్షిణాఫ్రికా అదే ఉత్సాహంతో న్యూలాండ్స్ సమరానికి సై అంటోంది. అవమానకర ఓటమికి 2 డబ్ల్యూటీసీ పాయింట్ల కోత జతకలవటం టీమ్ ఇండియాకు గట్టి ఎదురుదెబ్బ. ఇటీవల విదేశీ గడ్డపై అసమాన ఫలితాలు సాధించిన టీమ్ ఇండియా అదే నమ్మకంతో నేడు కేప్‌టౌన్‌లో ఫైట్‌కు సై అంటోంది. ఇక్కడ ఆడిన ఆరు మ్యాచుల్లో భారత్‌కు ఒక్క విజయమూ దక్కలేదు.

భారత్‌కు చావోరేవో

కేప్‌టౌన్‌లో భారత్‌కు ఇది చావోరేవో తేల్చుకోవాల్సిన తరుణం. సెంచూరియన్‌లో పోరాడకుండానే చేతులెత్తేసిన రోహిత్‌సేన న్యూలాండ్స్‌లో నయా చరిత్ర లిఖించేందుకు ఎదురు చూస్తోంది. సఫారీ గడ్డపై టెస్టు సిరీస్ విజయం అందుకోని ఏకైక ఆసియా జట్టుగా టీమ్ ఇండియా ఇప్పటికే చెత్త రికార్డును అక్కున చేర్చుకుంది. సిరీస్ దక్కే అవకాశాలు లేకపోయినా.. కనీసం చేజారకుండా చూసుకునే అవకాశం ఇప్పటికీ ఉంది. బ్యాటింగ్ లైనప్‌లో విరాట్ కోహ్లి, కెఎల్ రాహుల్ మినహా అందరూ నిరాశపరిచారు. రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్‌లు రాణిస్తే మంచి స్కోరు సాధించవచ్చు. శ్రేయస్ అయ్యర్ సహజంగా షార్ట్ బంతులకు తడబడుతాడు. కానీ సెంచూరియన్‌లో ఫుల్ బంతులకు వికెట్ చేజార్చుకున్నాడు. ఫుల్ షాట్లతో కండ్లుచెదిరే సిక్సర్లు సంధించే అయ్యర్ లోపం దిద్దుకుంటే కేప్‌టౌన్‌లో సత్తా చాటగలడు. ఇక బంతితో బుమ్రా, సిరాజ్‌కు సహకారం అందించే మూడో పేసర్ కరువయ్యాడు. ప్రసిద్ కృష్ణ, శార్దుల్ ఠాకూర్‌లు దారుణంగా విఫలమయ్యారు. తొలి టెస్టులో ధారాళంగా పరుగులు ఇచ్చారు. కేప్‌టౌన్‌లో ఇద్దరినీ పక్కనపెడతారా? లేదంటే ఒకరినే మార్చుతారా? అనేది ఆసక్తికరం. ముకేశ్ కుమార్, అవేశ్ ఖాన్ రూపంలో ఫామ్‌లో ఉన్న పేసర్లు అందుబాటులో ఉన్నారు.



ఎల్గర్ ఎదురుచూపులు

తెంబ బవుమాకు గాయంతో రెండో టెస్టులో సారథ్య పగ్గాలు వీడ్కోలు హీరో డీన్ ఎల్గర్‌కు దక్కాయి. సెంచూరియన్‌లో భారీ సెంచరీతో అదరగొట్టిన ఎల్గర్.. సిరీస్‌ను సఫారీ పరం చేశాడు. ఇప్పుడు రెండో టెస్టులోనూ ఆ ప్రదర్శన పునరావృతం చేస్తే.. 2-0తో ఎదురులేని విజయంతో సిరీస్ వశం కానుంది. కెరీర్ చివరి టెస్టులో కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న ఎల్గర్.. మరింత ఉత్సాహంతో బరిలోకి దిగుతున్నాడు. యువ క్రికెటర్లు అంచనాలు అందుకోవటం ఎల్గర్ గ్యాంగ్‌కు అదనపు బలం. అరంగ్రేటంలోనే డెవిడ్ బెడింగ్‌హామ్, బర్గర్‌లు రాణించారు. బర్గర్ పదునైన పేస్‌కు భారత బ్యాటర్లు తడబడ్డారు. డెవిడ్ బ్యాట్‌తో, వికెట్ల వెనకాల గ్లౌవ్స్‌తో ఆకట్టుకున్నాడు. కీగన్ పీటర్సన్, హమ్జాలు సైతం రాణిస్తే సఫారీ శిబిరంలో సమస్యలు కనిపించవు. టాప్ ఆర్డర్‌లో ఎల్గర్ సహా మార్క్‌రామ్, టోనీ మంచి ఫామ్‌లో ఉన్నారు. కగిసో రబాడ, బర్గర్, మార్కో జాన్సెన్‌లకు లుంగిసాని ఎంగిడి తోడైతే కేప్‌టౌన్‌లో దక్షిణాఫ్రికా పేస్ దాడిని ఎదుర్కొవటం అంత సులువు కాదు. స్పిన్ అనుకూలత దృష్ట్యా కేశవ్ మహరాజ్‌ను తుది జట్టులోకి తీసుకునే అవకాశం కనిపిస్తోంది.

తుది జట్లు (అంచనా)

భారత్ : రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్, కెఎల్ రాహుల్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా/రవిచంద్రన్ అశ్విన్, శార్దుల్ ఠాకూర్, జశ్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, ముకేశ్ కుమార్.

దక్షిణాఫ్రికా : డీన్ ఎల్గర్ (కెప్టెన్), ఎడెన్ మార్క్‌రామ్, టోనీ డీ జార్జి, కీగన్ పీటర్సన్, హమ్జా, డెవిడ్ బెడింగ్‌హామ్, కైల్ వెర్రెనె (వికెట్ కీపర్), మార్కో జాన్సెన్, కేశవ్ మహరాజ్/ ఎంగిడి, కగిసో రబాడ, బర్గర్.

పిచ్, వాతావరణం

న్యూలాండ్స్ గ్రౌండ్ కొత్త క్యూరేటర్ చేతుల్లోకి వెళ్లింది. భారత్, దక్షిణాఫ్రికా టెస్టు మ్యాచ్‌కు కాస్త ఎక్కువ పచ్చికను పిచ్‌పై ఉంచారు. ఆరంభంలో పేసర్లకు గొప్ప అనుకూలత ఉండనుంది. పిచ్‌పై పచ్చికతో పాటు పగుళ్లు సైతం ఉంటాయని తెలుస్తోంది. మ్యాచ్ సాగుతున్న కొద్ది స్పిన్నర్లకు పిచ్ నుంచి సహకారం దక్కవచ్చు. టెస్టు మ్యాచ్‌కు వర్షం సూచనలు లేవు. వాతావరణం ఆహ్లాదకరంగా ఉండనుంది. బలంగా వీచే గాలులు బ్యాటర్లు, బౌలర్ల ఎదురుదాడి ప్రణాళికలను ప్రభావితం చేయనున్నాయి. టాస్ నెగ్గిన జట్టు తొలుత

0/6 కేప్‌టౌన్ దక్షిణాఫ్రికాకు కంచుకోట. ఇక్కడ టీమ్ ఇండియా ఆరు టెస్టుల్లో పోటీపడింది. ఆరుసార్లూ విజయ వేటలో నిరాశే ఎదురైంది. ఆరు టెస్టుల్లో నాలుగింట సఫారీ జట్టు విజయం సాధించగా.. రెండు మ్యాచులు డ్రాగా ముగిశాయి. అయినా, న్యూలాండ్స్ పిచ్‌పై భారత్‌కు ఓ అనుకూలత ఉంది. ఇక్కడ పిచ్ పగుళ్లు తేలి స్పిన్ బాగా ఉపకరిస్తుంది. గతంలో ఇక్కడ హర్భజన్ సింగ్ ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. భారత్ అశ్విన్, జడేజాలతో బరిలోకి దిగితే.. ఎదురుదాడి వ్యూహం ఫలించేందుకు అవకాశాలు ఎక్కువ. ఈ టెస్టులో రోహిత్‌సేన నెగ్గితే.. కేప్‌టౌన్ కోటను బద్దలుకొట్టడమే కాదు సఫారీ గడ్డపై సరికొత్త రికార్డు నమోదు కానుంది!.

వీడ్కోలుకు వేళాయే



- చివరి టెస్టుకు సిద్ధమైన వార్నర్
- ఆసీస్, పాక్ మూడో టెస్టు నేటి నుంచి

సిడ్నీ (ఆస్ట్రేలియా) : ఆస్ట్రేలియా ఆధునిక క్రికెట్ దిగ్గజం డెవిడ్ వార్నర్ రిటైర్‌మెంట్‌కు రంగం సిద్ధం చేసుకున్నాడు. సొంత మైదానం సిడ్నీలో టెస్టులకు వీడ్కోలు పలికేందుకు సిద్ధమై.. ఆఖరు నిమిషంలో వన్డేలకు వీడ్కోలు ప్రకటించాడు. వార్నర్ వీడ్కోలుకు సిడ్నీ మైదానం ముస్తాబు కాగా.. పాకిస్థాన్‌పై టెస్టు సిరీస్ క్లీన్‌స్వీప్ కోసం కంగారూలు రెడీ అవుతున్నారు. 2-0తో టెస్టు సిరీస్ కైవసం చేసుకున్న ఆస్ట్రేలియా.. చివరి టెస్టులోనూ పాక్‌పై విజయం కోసం బరిలోకి దిగుతోంది. మరోవైపు సిరీస్ ఓడినా.. మెల్‌బోర్న్‌లో ఆతిథ్య జట్టుకు ఝలక్ ఇచ్చింది పాక్. సిడ్నీలో వార్నర్ మేనియా కొనసాగినా.. ఆసీస్‌కు గట్టి పోటీ ఇవ్వగల దీమాతో కనిపిస్తోంది. ఆసీస్ మార్పుల్లేకుండా బరిలోకి దిగుతుండగా.. పాక్ కీలక ఆటగాళ్ల సేవలను కోల్పోయింది. షహీన్ షా అఫ్రిది, ఇమామ్ ఉల్ హక్‌లు సిడ్నీ టెస్టుకు దూరమయ్యారు.

పరాజయం పరిపూర్ణం!

- 0-3తో వన్డే సిరీస్ వైట్‌వాష్



ముంబయి : మహిళల వన్డే సిరీస్‌లో భారత్‌కు వైట్‌వాష్ పరాజయం ఎదురైంది. మూడు వన్డేల్లోనూ ఓటమి చవిచూసిన హర్మన్‌ప్రీత్ సేన 0-3తో వన్డే సిరీస్‌ను కోల్పోయింది. మంగళవారం జరిగిన మూడో వన్డేలో తొలుత ఆస్ట్రేలియా అమ్మాయిలు 50 ఓవర్లలో 7 వికెట్లకు 338 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్ లిచ్‌ఫీల్డ్ (119, 125 బంతుల్లో 16 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీతో చెలరేగగా.. మరో ఓపెనర్ అలీసా హీలే (82, 85 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్థ సెంచరీతో మెరిసింది. తొలి వికెట్‌కు ఓపనర్లే 189 పరుగులు జోడించగా ఆసీస్ భారీ స్కోరుకు గట్టి పునాది వేసుకుంది. ఆష్లె గార్డ్‌నర్ (30), అనాబెల్ (23), అలాన కింగ్ (26 నాటౌట్) రాణించారు. ఛేదనలో టీమ్ ఇండియా అమ్మాయిలు 32.4 ఓవర్లలో 148 పరుగులకే కుప్పకూలారు. మంధాన (29), జెమీమా (25), దీప్తి శర్మ (25 నాటౌట్), రిచా (19) మెరిసినా.. భారీ ఛేదనలో ఎవరూ కదం తొక్కలేదు. యస్తికా (6), హర్మన్‌ప్రీత్ (3), అమన్జోత్ (3) నిరాశపరిచారు. లిచ్‌ఫీల్డ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలువగా.. వన్డే సిరీస్ 3-0తో కంగారూల వశమైంది.

6 నుంచి మాస్టర్ గేమ్స్

- టీ షర్ట్ ఆవిష్కరణ



హైదరాబాద్ : 6వ తెలంగాణ మాస్టర్స్ గేమ్స్ రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్ పోటీలు జనవరి 6 నుంచి సికింద్రాబాద్‌లోని జింఖాన మైదానంలో జరుగనున్నాయి. అథ్లెటిక్స్‌లో మహిళలు, పురుషుల విభాగాల్లో 30 ప్లస్ నుంచి 90 ప్లస్ వరకు అన్ని వయో విభాగాల్లో పోటీలు ఉంటాయి. తెలంగాణ మాస్టర్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీలకు సంబంధించి టీ షర్ట్‌ను మంగళవారం ఆవిష్కరించారు. టీ షర్ట్ ఆవిష్కరణ కార్యక్రమంలో మాస్టర్స్ గేమ్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆఫీస్‌బేరర్లు కె. రామిరెడ్డి, వై. రామారావు, బి. భాస్కర్‌రావు, బెర్నార్డ్, రత్నాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

నవచిత్రం

భిన్న కంటెంట్‌తో ల్యాండ్ మాఫియా



ప్రణయనాథ, మధుబాల

ప్రణయనాథ చిత్రాలయ బ్యానర్‌పై ప్రణయనాథ, మధుబాల హీరో, హీరోయిన్లుగా తెరకెక్కిన చిత్రం 'ల్యాండ్ మాఫియా'. బాబు వీఎస్ దర్శకుడు. శ్రీ లక్ష్మీ పిక్చర్స్ బ్యానర్ పై ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నారు. తాజాగా ఈ చిత్ర ట్రైలర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది.

ఈ సందర్భంగా హీరో, నిర్మాత ప్రణయ నాథ మాట్లాడుతూ, 'చిన్న చిత్రంగా మొదలైన ఈ ప్రాజెక్టు పెద్ద సినిమాగా మారింది. మొదటి నుంచి మాకు శ్రావ్య ఫిల్మ్స్ అండగా నిలబడింది. ఓ మంచి చిత్రాన్ని తీశాం. త్వరలోనే మా చిత్రాన్ని విడుదల చేస్తాం' అని తెలిపారు

'ఇంత మంచి పాత్రను ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థ్యాంక్స్. సందేశంతో పాటు అన్ని రకాల కమర్షియల్ అంశాలుంటాయి. మా చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలని కోరుకుంటున్నాను' అని నాయిక మధుబాల అన్నారు.

డైరెక్టర్ బాబు మాట్లాడుతూ, 'మా నిర్మాత ప్రణయనాథ ఎంతో సహకరించారు. ఖర్చుకి ఎక్కడా వెనకడుగు వేయలేదు. సునీల్ కుమార్ రెడ్డి సహకారంతో సినిమాను పూర్తి చేశాం' అని తెలిపారు.

ఎడిటర్ కృష్ణ మండల మాట్లాడుతూ, 'ఈ సినిమా పెద్ద సినిమాగా మారడం వెనుక ప్రణయనాథ ప్యాషన్ ఉంది. సునీల్ కుమార్ రెడ్డి వెన్నంటే ఉండి మమ్మల్ని సపోర్ట్ చేశారు. టీం అంతా కలిసి ఎంతో కష్టపడి చేసిన ఈ సినిమా సక్సెస్ అవ్వాలని ఆశిస్తున్నాను' అని అన్నారు.

'నా ఫ్రెండ్ ఎక్కలి రవీంద్ర బాబు వల్ల ఈ టీంను కలిశాను. తను చెప్పడంతో ఈ ప్రాజెక్ట్‌ను ముందుండి నడిపించాను. ఈ చిత్రం పెద్ద విజయాన్ని సాధించాలని, చిత్రయూనిట్‌కు మంచి పేరు రావాలని కోరుకుంటున్నాను' అని సునీల్ కుమార్ రెడ్డి చెప్పారు. డిస్ట్రిబ్యూటర్ బాపిరాజు మాట్లాడుతూ, 'ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 14న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని తెలిపారు.

పవర్‌ఫుల్‌గా ఘోర హర..



శివరాజ్‌కుమార్, ధనుష్

ధనుష్ నటించిన పాన్ ఇండియా ఫిల్మ్ 'కెప్టెన్ మిల్లర్'. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. అన్ని వర్గాల ప్రేక్షకులని ఆకట్టుకునే పీరియాడిక్ యాక్షన్ డ్రామా ఇది. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలకు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ ఈ చిత్రంలోని థర్డ్ సింగిల్ 'ఘోర హర'ని విడుదల చేశారు.

జివి ప్రకాష్ ఈ పాట కోసం పవర్ ప్యాక్డ్ నెంబర్‌ని స్కోర్ చేశారు. రాకేందు మౌళి రాసిన ఇంటెన్స్ లిరిక్స్ ఆకట్టుకున్నాయి. రాహుల్ సిప్లిగంజ్ ఈ పాటని హై ఎనర్జీ వోకల్స్‌తో ఆలపించారు. పాటలో వింటేజ్ విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. ధనుష్, శివ రాజ్‌కుమార్‌ల ప్రజెన్స్ ఎక్స్‌ట్రార్డినరీగా ఉంది.ఈ పాటలో ధనుష్ , శివ రాజ్ కుమార్ కలిసి డ్యాన్స్ చేయడం వారి అభిమానులకు మాత్రం కన్నుల పండగే. 1930-40 బ్యాక్‌డ్రాప్‌లో ఈ చిత్రం రూపొందుతోంది. శివ రాజ్ కుమార్, సందీప్ కిషన్ పవర్ ఫుల్ రోల్స్‌లో నటిస్తున్న ఈ చిత్రంలో ప్రియాంకా అరుళ్ మోహన్ కథానాయిగా నటిస్తోంది. టి.జి. త్యాగరాజన్ సత్యజ్యోతి ఫిల్మ్స్, సెంధిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మిస్తున్నారు. జి.శరవణన్, సాయి సిద్ధార్థ్ సహ నిర్మాతలు. తమిళం, తెలుగు, హిందీ భాషల్లో ఈనెల 12న ఏకకాలంలో గ్రాండ్‌గా ఈ సినిమా విడుదల కానుంది. ఈ చిత్రానికి డీవోపీ: సిద్ధార్థ నుని, ఎడిటింగ్: నాగూరన్, ఆర్ట్: టి.రామలింగం.

పక్కా మాస్ ఈగల్



రవితేజ మోస్ట్ ఎవైటెడ్ యూనిక్ యాక్షన్ థ్రిల్లర్ 'ఈగల్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై తెరకెక్కిన చిత్రమిది. టీజర్ విడుదలైన తర్వాత క్రేజ్ నెక్స్ లెవల్‌కి చేరుకుంది. ఇటివలే విడుదల చేసిన 'ఈగల్' ఊర మాస్ అంథమ్ 'ఆడు మచ్చా' పాట చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. వీటితోపాటు లేటెస్ట్‌గా రిలీజైన ట్రైలర్ సైతం అందర్నీ అలరిస్తోంది.

ఈ సినిమాలో రవితేజ మల్టిపుల్ షేడ్స్ ఉన్న పాత్రలో అలరించనున్నారు. అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా నటిస్తుండగా, కావ్య థాపర్ మరో కథానాయిక. నవదీప్, మధుబాల ఇతర ముఖ్య తారాగణం. కార్తీక్ ఘట్టమనేని ఎడిటింగ్, దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి మణిబాబు కరణంతో పాటు దర్శకుడు స్వయంగా స్క్రీన్ ప్లే రాశారు. టీజీ విశ్వ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, వివేక్ కూచిభొట్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా సంక్రాంతి కానుకగా ఈనెల 13న థియేటర్లలో విడుదల కానుంది.

'ఈ సంక్రాంతికి పలు సినిమాలు రిలీజ్ అవుతున్నప్పటికీ కథ, అందులోని కంటెంట్ మీద ఉన్న నమ్మకంతో సంక్రాంతి బరిలోకి దిగుతున్నాం. గతంలో ఎన్నడూ చూడని రవితేజని ఈ సినిమాలో చూడబోతున్నారు. సంక్రాంతికి విడుదలవుతున్న సిసలైన సినిమా ఇది.

ప్రణీత పట్నాయక్, అజయ్ ఘోష్, శ్రీనివాస్ రెడ్డి, భాషా, శివ నారాయణ, మిర్చి కిరణ్, నితిన్ మెహతా, ధ్రువ, ఎడ్వర్డ్, మద్ది, జరా, అక్షర తదితరులు నటించిన ఈ చిత్రానికి మాటలు: మణిబాబు కరణం, సంగీతం: డేవ్ జాంద్, డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ: కార్తీక్ ఘట్టమనేని, కమిల్ ప్లాకి, కర్మ్ చావ్లా, ప్రొడక్షన్ డిజైనర్: శ్రీనాగేంద్ర తంగాల, సాహిత్యం: చైతన్య ప్రసాద్, కేకే, కళ్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సుజిత్ కుమార్ కొల్లి, యాక్షన్: రామ్ లక్ష్మణ్, రియల్ సతీష్, టోమెక్.

మా ఊరి సిత్రాన్ని చూద్దాం




సుహాస్ హీరోగా నటిస్తున్న సినిమా 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు'. ఈ చిత్రాన్ని జీఏ2 పిక్చర్స్, దర్శకుడు వెంకటేష్ మహా బ్యానర్ మహాయన మోషన్ పిక్చర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. దుశ్యంత్ కటికినేని దర్శకుడు. ఫిబ్రవరి 2న థియేటర్స్ ద్వారా ఈ సినిమా గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకురానుంది.

ఈ నేపథ్యంలో మంగళవారం యువకథానాయకుడు తేజ సజ్జ ట్విట్టర్ (ఎక్స్) ద్వారా ఈ సినిమా నుంచి 'మా ఊరు..' లిరికల్ సాంగ్‌ను విడుదల చేశారు. పాట తనకు ఎంతో నచ్చిందన్న ఆయన మూవీ టీమ్‌కు ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఈ సాంగ్‌కు రెహ్మాన్ లిరిక్స్ అందించగా, శేఖర్ చంద్ర మ్యూజిక్ అందించారు. కాళభైరవ పాడారు. 'రారో మా ఊరు సిత్రాన్ని సూద్దాం...ఇటు రారో ఈ బతుకు పాటను ఇందాం. ఈ సన్నాయి నొక్కుల్లోనా ఊరించే సంగతులెన్నో ఉన్నాయ్..'అంటూ వినగానే ఆకట్టుకునేలా సాగిందీ పాట.

కామెడీ డ్రామా కథతో తెరకెక్కిన ఈ సినిమాలో శివాని నాగరం, శరణ్య ప్రదీప్,జబర్దస్త్ ప్రతాప్ భండారి, గోపరాజు రమణ తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం – శేఖర్ చంద్ర, సినిమాటోగ్రఫీ – వాజిద్ బేగ్, ఎడిటింగ్ – కొదాటి పవన్ కల్యాణ్.

ఫిబ్రవరి 2న రిలీజ్



సోహెల్

'బిగ్‌బాస్' ఫేమ్ సోహెల్ టైటిల్ రోల్‌లో శ్రీ కోనేటి దర్శకత్వంలో గ్లోబల్ ఫిలిమ్స్, కథ వేరుంటాది బ్యానర్స్ పై ఎం.డీ పాషా నిర్మిస్తున్న చిత్రం 'బూట్ కట్ బాలరాజు'. మేఘ లేఖ, సునీల్, సిరి హన్మంత్, ఇంద్రజ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర ప్రమోషనల్ కంటెంట్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.

సెన్సేషనల్ కంపోజర్ భీమ్స్ సిసిరోలియో అందించిన ఆల్బమ్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. టీజర్ ట్రెమండస్ రెస్పాన్స్‌తో సినిమా పై క్యురియాసిటీ పెంచింది. తాజాగా మేకర్స్ సినిమా విడుదల తేదీని అనౌన్స్ చేశారు. ఈ చిత్రం ఫిబ్రవరి 2న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. అవినాష్, సద్దాం, 'కొత్త బంగారు లోకం' వివేక్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సహ నిర్మాత: పాండు, మామిడిశెట్టి శ్రీనివాస్.



పతంగ్‌ల పోటీతో సినిమా

ఇప్పటి వరకు భారతీయ సినిమాల్లో ఎన్నో స్పోర్ట్స్ డ్రామాలు ప్రేక్షకులు చూసి ఉంటారు. కాని తొలిసారిగా పతంగుల పోటీతో రాబోతున్న కామెడీ స్పోర్ట్స్ డ్రామా చిత్రం 'పతంగ్'. సినిమాటిక్ ఎలిమెంట్స్ అండ్ రిషన్ సినిమాస్ పతాకంపై విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మక, సురేష్ కొత్తింటి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకుడు.

నాని బండ్రెడ్డి క్రియేటివ్ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రంలో ఇన్‌స్టాగమ్ సెన్సేషన్ ప్రీతి పగడాల, జీ సరిగమప రన్నరప్ ప్రణవ్ కౌశిక్‌తో పాటు వంశీ పూజిత్ ముఖ్యతారలుగా నటిస్తున్నారు. మరికొంత మంది నూతన నటీనటులతో పాటు ప్రముఖ సింగర్, నటుడు ఎస్‌పీ చరణ్ ఈ చిత్రంలో కీలకమైన పాత్రలో కనిపించబోతున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం ఫైనల్ షెడ్యూల్ జరుగుతోంది. వేసవిలో విడుదల కానుంది. న్యూ ఇయర్ సందర్భంగా ఈ చిత్రం న్యూపోస్టర్‌ను విడుదల చేశారు ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ సికింద్రబాద్ బస్తీ నేపథ్యంలో రూపొందుతున్న యూత్‌ఫుల్ కామెడీ స్పోర్ట్స్ డ్రామా ఇది. ప్రతి సన్నివేశం ఎంతో సహజంగా ఉంటుంది' అని అన్నారు.

ఈతరం ఆలోచనలు, ఎమోషన్లకు ప్రతిబింబం



సుహాస్, విరాజ్ అశ్విన్, రుహానిశర్మ, కార్తీక్ రత్నం ముఖ్యతారలుగా రూపొందుతున్న చిత్రం 'శ్రీరంగనీతులు'. ప్రవీణ్‌కుమార్ వీఎస్ఎస్ దర్శకుడు. రాధావి ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై వెంకటేశ్వరరావు బల్మూరి నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్ర ప్రమోషన్ కార్యక్రమాలకు నూతన సంవత్సరం సందర్భంగా శ్రీకారం చుడుతూ ఓ న్యూ పోస్టర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. అలాగే టీజర్‌ను ఈనెల 5న విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది.

ఈ సందర్భంగా దర్శకుడు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ, 'ఈతరం యువత ఆలోచనలు, వారి ఎమోషన్స్ ఏ విధంగా ఉంటున్నాయి అనేది ఈ చిత్రంలో మూడు పాత్రల ద్వారా చూపిస్తున్నాం. ఇది వారి జీవితంలోని ఆసక్తికరమైన కథ, కథనాలను ఎంటర్‌టైన్‌మెంట్ వేలో చూపించే ప్రయత్నం చేశాం. కొత్తదనంతో పాటు పూర్తి కమర్షియల్ అంశాలతో రూపొందించిన హైపర్ లింక్ డ్రామా ఇది' అని అన్నారు. మోడ్రన్ సెన్సిబిలిటీస్‌తో అందరికి నచ్చే విధంగా దర్శకుడు ఈ చిత్రాన్ని తెరకెక్కించారని నిర్మాత చెప్పారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar. TELTEL/2014/59462.

విమానయాన ఇంధనం చౌక

- ధరల్లో 4 శాతం తగ్గింపు
- వాణిజ్య సిలిండర్‌పై రూ.1.50 కోత



న్యూఢిల్లీ : సామాన్యులు వినియోగించే పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తారా స్థాయికి చేర్చి.. జేబులకు చిల్లు పెడుతోన్న మోడి సర్కార్ ధనవంతులు ప్రయాణించే విమానయాన ఇంధన ధరలను మాత్రం వరుసగా తగ్గిస్తుంది. విమానాలకు ఉపయోగించే ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఎటిఎఫ్) ధరలకు తాజాగా 4 శాతం కోత పెడుతూ చమురు మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకుంది. ఢిల్లీలో కిలోలీటర్ ఎటిఎఫ్‌పై రూ.4,162.5 లేదా 3.9 శాతం తగ్గించి రూ.1,01,993.17 నిర్ణయించింది. కొత్త ధరలు జనవరి 1 నుంచి అమల్లోకి వచ్చాయి.తాజా ప్రకటనతో వరుసగా మూడు నెలలోనూ తగ్గించినట్లయ్యింది. డిసెంబర్‌లో 6 శాతం లేదా రూ.6,854, నవంబర్‌లో 4.6 శాతం లేదా 5,189 చొప్పున తగ్గించింది. గతేడాది జులై ఒక్కటో తేది నుంచి ఇప్పటి వరకు దాదాపు 45 శాతం లేదా రూ.29,391 కోత పెట్టింది. ఈ తగ్గింపులు విమానయాన పరిశ్రమకు ఆర్థికంగా మద్దతును ఇవ్వనున్నాయని చమురు మంత్రిత్వ శాఖ వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు 19 కిలోల వాణిజ్య సిలిండర్‌పై కేవలం రూ.1.50 తగ్గించి.. ఢిల్లీలో రూ.1,755.50గా నిర్ణయి ంచింది. కాగా.. పెట్రోల్, డీజిల్ ఇంధన ధరలను యథాతథంగా కొనసాగిం చాలని కేంద్రం భావించింది. గృహాల కోసం ఉపయోగించే గ్యాస్ ధరను కూడా ఇది వరకు స్థాయిలోనే ఉంచింది. అంతర్జాతీయ ధరల ఆధారంగా ప్రతి నెల 1వ తేదీన వంట గ్యాస్, ఇంధన ధరలను కేంద్రం సవరిస్తుంది.

అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లపై ప్రత్యేక డ్రైవ్‌లు : ఆర్‌బీఐ

ముంబయి : బ్యాంకు ఖాతాదారుల అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లకు సంబంధించి ప్రత్యేక డ్రైవ్‌లను చేపట్టాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) విత్త సంస్థలకు సూచించింది. ఇందుకోసం మరిన్ని మార్గదర్శకాలను విడుదల చేసింది. ఆర్‌బిఐ నోటిఫికేషన్ ప్రకారం బ్యాంకులు వినియోగంలో లేని ఖాతాలు, అన్ క్లెయిమ్డ్ డిపాజిట్లకు సంబంధించి లేఖలు, ఇ-మెయిల్ లేదా ఎస్ఎంఎస్ పంపడం ద్వారా ఖాతాదారులను సంప్రదించాలి. ఈ మెయిల్/ఎస్ఎంఎస్‌లను మూడు నెలలకు ఒకసారి పంపాలి. అవసరమైతే ఖాతాదారును కనుగొనేందుకు ఇంట్రడ్యూసర్‌ను, నామినీని కూడా సంప్రదించాలి. సదరు ఖాతాదారుల ఆచూకీ తెలుసుకునేందుకు తరచూ క్యాంపెయిన్‌లు చేయాలని తెలిపింది. బ్యాంకింగ్ వ్యవస్థలో అన్ క్లెయిమ్డ్ డిపాజిట్లను తగ్గించేందుకు, ఆ నిధులను వాటి అసలు యజమానులకు తిరిగి అందించేందుకు ఇప్పటికే బ్యాంకులు, రిజర్వ్ బ్యాంకు తీసుకుంటున్న చర్యలకు ఈ మార్గదర్శకాలు అదనపు మద్దతు ఇవ్వనున్నాయి.

విస్తరణపై అడ్వీక్ కాపిటల్ దృష్టి

హైదరాబాద్ : దీర్ఘకాలిక వ్యాపార విస్తరణపై దృష్టి సారించినట్లు అడ్వీక్ కాపిటల్ లిమిటెడ్ తెలిపింది. విభిన్న మార్గాల్లో ఒక క్రమపద్దతిలో కీలక బ్యాంకింగేతర విత్త సంస్థ (ఎన్‌బిఎఫ్‌సి)గా నిలువాలని నిర్దేశించుకున్నట్లు తెలిపింది. ప్రస్తుతం సంస్థ నికర విలువ రూ.110 కోట్లుగా, ఆస్తుల విలువ దాదాపు రూ.200 కోట్లుగా ఉన్నట్లు పేర్కొంది.

శ్రేష్టా ఫిన్‌వెస్ట్ రైట్ ఇష్యూకు ఆమోదం

న్యూఢిల్లీ : ఫైనాన్సీయల్ సొల్యూషన్స్ సంస్థ శ్రేష్టా ఫిన్‌వెస్ట్ రూ.49 కోట్ల నిధుల కోసం రైట్ ఇష్యూను జారీ చేయడానికి తమ సంస్థ బోర్డు ఆమోదం తెలిపిందని తెలిపింది. ఇందుకోసం రూ.2 ముఖ విలువ కలిగిన షేర్లను జారీ చేయనున్నట్లు పేర్కొంది. ఫైనాన్స్ సొల్యూషన్స్ అందించే ఈ సంస్థ ప్రతిపాదనలకు రెగ్యులేటరీ సంస్థల నుంచి ఆమోదం లభించాల్సి ఉంది.

స్టార్టప్ సెటిల్‌కు రూ.10 కోట్ల నిధులు

బెంగళూరు : ప్రముఖ కో-లివింగ్ ఆపరేటర్, ప్రాప్‌టెక్ స్టార్టప్ అయినా సెటిల్ కొత్తగా రూ.10 కోట్ల నిధులు సమీకరించినట్లు వెల్లడించింది. తన వ్యాపారాన్ని విస్తరించేందుకు గృహాస్, వి ఫౌండర్ సర్కిల్‌తో సహా పెట్టుబడిదారుల నుండి ఈ మొత్తాన్ని పొందినట్లు తెలిపింది. బెంగళూరు, హైదరాబాద్, గురుగ్రావ్, చెన్నయ్‌లలో కార్యకలాపాలను నిర్వహిస్తుంది. ఇది ఈ నాలుగు నగరాల్లో మొత్తం 4000 పడకల సామర్థ్యంతో 60 పైగా కో లివింగ్ స్పేసేస్‌ను కలిగి ఉంది. ప్రధానంగా వృత్తి నిపుణులను లక్ష్యంగా చేసుకుని.. ఒక్కో బెడ్‌కు రూ. 12500- రూ.18,000 ధర పరిధిలో అద్దె వసతిని కల్పిస్తుంది.

సెన్సెక్స్ 380 పాయింట్లు ఫట్

ముంబయి : అమ్మకాల ఒత్తిడితో దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాలు చవి చూశాయి. సూచీలు జీవనకాల గరిష్టాలకు చేరడంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. దీంతో మంగళవారం బిఎస్‌ఇ సెన్సెక్స్ 379.46 పాయింట్లు కోల్పోయి 71,892కు పడిపోయింది. ఎన్ఎస్‌ఇ నిఫ్టీ 76.10 పాయింట్లు తగ్గి 21,666 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో దాదాపు 1,691 షేర్లు లాభపడగా.. 1,631 షేర్లు ప్రతికూలత ఎదుర్కొనగా.. 72 సూచీలు మాత్రం యథాతథంగా నమోదయ్యాయి. నిఫ్టీలో ఐషర్ మోటార్స్, ఎంఅండ్ఎం, అల్ట్రాటెక్ సిమెంట్, ఎల్అండ్‌టి, కోటక్ మహీంద్రా బ్యాంక్ అధిక నష్టాలను చవి చూడగా..కోల్ ఇండియా, అదానీ పోర్ట్స్, సన్ ఫార్మా, దివిస్ ల్యాబ్స్, సిప్లా ఎక్కువగా లాభపడిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి.

అన్ని ఎంపీ స్థానాల్లో బీఎల్‌ఎఫ్ పోటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో అన్ని పార్లమెంటు స్థానాల్లోనూ బీఎల్‌ఎఫ్ పోటీ చేస్తుందని బీఎల్‌ఎఫ్ కన్వీనర్ దండి వెంకట్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీఎల్పీ రాష్ట్ర కార్యాలయంలో ఆఫీసు బేరర్ల సమావేశాన్ని బీఎల్‌ఎఫ్ కన్వీనర్ కె పర్వతాలు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా దండి వెంకట్ మాట్లాడుతూ రాష్ట్రంలో బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా బీఎల్‌ఎఫ్ ఆవిర్భవించిందని చెప్పారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎంలకు ప్రత్యామ్నాయంగా రాజకీయ పోరాటం చేస్తుందన్నారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం వంద రోజుల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్లు వనం సుధాకర్, నూనె వెంకటస్వామి, నాయకులు వస్కుల మట్టయ్య వర్గల్ గోపాల్, పోతుగంటి కాశి, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి దాడి వైసిపికి రాజీనామా

- నేడు టిడిపిలో చేరిక

అనకాపల్లి : మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, ఆయన కుమారులు రత్నాకర్, జైవీర్... వైసిపికి రాజీనామా చేస్తున్నట్లు మంగళవారం ప్రకటించారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీరభద్రరావు మాట్లాడారు. రాజీనామా లేఖను వైసిపి జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయి రెడ్డికి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డికి పంపినట్లు తెలిపారు. తాను 2019 ఎన్నికల ముందు వైసిపిలో చేరానని, అప్పట్లో తన కుమారుడు రత్నాకర్‌కు సీటు వస్తుందని భావించానని అన్నారు.

గుడివాడ అమర్‌నాథ్‌కు సీటు రావడంతో తన కుటుంబం మొత్తం ఆయన విజయానికి కృషి చేసిందని వివరించారు. ఇటీవల పరిణామాల నేపథ్యంలో 2024 ఎన్నికల్లోనూ తమకు పార్టీ సీటిస్తుందన్న భరోసా లేకపోవడంతో పార్టీని వీడేందుకు సిద్ధమయ్యామన్నారు.

ఇప్పటికే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, లోకేష్‌తో చర్చలు జరిపినట్లు తెలిపారు. బుధవారం వారి సమక్షంలో టిడిపిలో చేరుతానన్నారు.

24 గంటల్లో 200 మందికి పైగా

పాలస్తీనియన్లు మృతి

- కొత్త సంవత్సరం రోజునా ఆగని దాడులు
- శిథిలాల కుప్పలుగా నివాస ప్రాంతాలు



గాజా : కొత్త సంవత్సరం ప్రారంభం రోజున కూడా గాజాపై వరుసగా శతఘ్ని, క్షిపణి దాడులు కొనసాగుతునే వున్నాయి. గత 24గంటల్లో 200మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారు. గాజా పాత బస్తీలో పెను విధ్వంసం చోటు చేసుకుంది. గ్రేట్ ఒమరి మసీదు, పాత మార్కెట్ వంటి ప్రాంతాలు శిథిలాల కుప్పలుగా మారాయని ఆ ప్రాంతంలో పర్యటించిన విలేకరి తెలిపారు. పాలస్తీనా రెడ్ క్రీసెంట్ సొసైటీ హెడ్‌క్వార్టర్స్‌పై జరిగిన దాడిలో మృతుల సంఖ్య ఐదుకు పెరిగింది. ఇజ్రాయిల్ మిలటరీ కార్యకలాపాలకు కేంద్రంగా మారిన ఖాన్ యూనిస్ నగరంపై గత కొద్ది గంటలుగా శతఘ్ని దాడులు కొనసాగుతునే వున్నాయని ఆ విలేకరి తెలిపారు. ఒక పద్ధతి ప్రకారం నివాస ప్రాంతాలను వరుసగా ధ్వంసం చేసుకుంటూ సైన్యం ముందుకు సాగుతోందని, ఇప్పటికే వందలాది గృహాలు నేలమట్టమయ్యాయని, దీంతో ప్రజలు దక్షిణ ప్రాంతాల వైపుకు వలస వెళ్ళిపోతున్నారని జర్నలిస్టు అబూ అజామ్ తెలిపారు. ప్రజలను బలవంతంగా ఇలా తరలించడమనేది మానవాళికి వ్యతిరేకంగా జరిగే నేరమని ఐక్యరాజ్య సమితి ప్రత్యేక అధికారి ఫ్రాన్సెస్కా అల్బనీస్ వ్యాఖ్యానించారు. దశాబ్దాల తరబడి అక్రమంగా కొనసాగిస్తున్న ఆక్రమణలకు పరాకాష్టగా ఈ దాడులు చేపడుతోందని అన్నారు. బాంబు దాడులు, ఆకలి చావులను ఎదుర్కొనడం, వ్యాధులు వంటి వాటితో ప్రజలు బెంబేలెత్తుతున్నారని, కొత్త ప్రాంతాలకు తరలిపోతున్నారని అన్నారు. ఇజ్రాయిల్ శవాగారాల్లో 450మంది పాలస్తీనియన్ల మృతదేహాలు పడివున్నాయని, వాటిని ఇజ్రాయిల్ ఇవ్వకుండా నొక్కిపెడుతతోందని మానవ హక్కుల గ్రూపులు విమర్శిస్తున్నాయి. ఇజ్రాయిల్ నిర్బంధంలో వుంటూ మరణించిన 18మంది ఖైదీలు, 21మంది చిన్నారుల మృతదేహాలు కూడా వున్నాయి.

దాదాపు మూడు మాసాలుగా జరుగుతున్న ఈ దాడుల్లో ఇప్పటివరకు 22వేల మందికి పైగా మరణించారు. గాజాలోని పలు ప్రాంతాలు పెను విధ్వంసానికి గురయ్యాయి. కాల్పుల విరమణకు అంతర్జాతీయంగా డిమాండ్లు ఎదురవుతున్నా ఇజ్రాయిల్ తన పట్టు వీడడం లేదు. పైగా కొత్త సంవత్సరంలో కూడా యుద్ధం కొనసాగిస్తామంటూ హెచ్చరికలు చేస్తోంది. రాఫా నగరం దక్షిణ ప్రాంతంలో సోమవారం రాత్రి వరుసగా క్షిపణి దాడులు జరిగాయి. ఉత్తర ప్రాంతంలోని జాబాలియా శరణార్థ శిబిరంపై కూడా ముమ్మర దాడులు కొనసాగాయి. సెంట్రల్ ప్రాంతాలైన మఘజి, బురేజిల్లో, ప్రధాన ఖాన్ యూనిస్ నగరంలో కూడా పోరు కొనసాగుతునే వుంది. ఈ ఏడాది తమ జీవితాల్లోనే అత్యంత అధ్వాన్నమైన సంవత్సరమని గాజా నివాసి హమౌదా వ్యాఖ్యానించారు. కొత్తగా మొదలయ్యే ప్రతి రోజూ పాత రోజులానే బాంబుదాడులు, చావులు, మూకుమ్మడి హత్యలతో ముగుస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గాజా నగరం లోపల, చుట్టుపక్కల దాడులు జరిపే లక్ష్యంతో ఇజ్రాయిల్ బలగాలు తిరిగి మోహరింపునకు సిద్ధమవుతున్నాయని ఉత్తర గాజాలోని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. రిజర్వ్ సైనికులను కూడా రప్పిస్తున్నారు. యుద్ధం ఆరంభమైనప్పటి నుండి ఇప్పటివరకు 85శాతం మంది ప్రజలు నిర్వాసితులయ్యారని ఐక్యరాజ్య సమితి పేర్కొంది. జీవన పరిస్థితులు దుర్భరంగా మారాయని వ్యాఖ్యానించింది.



హిందుస్తాన్ షిప్‌యార్డు కాంట్రాక్టుకు గండి?

- అడ్డదారిలో ఎంట్రీకి ఎల్‌అండ్‌టి యత్నం

గ్రేటర్ విశాఖ: విశాఖపట్నం హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్) కొద్ది నెలల క్రితం రూ.19 వేల కోట్ల ఫ్లీట్ సపోర్టు షిప్ (ఎఫ్ఎస్-ఎస్)ల ఆర్డర్ దక్కించుకున్నా, తాజాగా కేంద్రం మరో ప్రయివేట్ కంపెనీ టెండరుకు మార్గం సుగమం చేసినట్లు సమాచారం. దీంతో, హిందుస్తాన్ షిప్‌యార్డు అధికార, ఉద్యోగ వర్గాల్లో సదరు ప్రయివేట్ కంపెనీ ప్రవేశంపై తీవ్ర ఆందోళన మొదలైంది. పైన తెలిపిన కాంట్రాక్టులో సగానికిపైగా ప్రయివేట్ కంపెనీ కొట్టేస్తే షిప్‌యార్డు ఆదాయానికి తీవ్ర గండిపడి మనుగడే ప్రమాదంలో పడనుంది. ఈ కాంట్రాక్టు షిప్‌యార్డుకు రాకుండా కేంద్రం ఏదో ఒక మెలిక పెడుతూ ఎల్‌అండ్‌టిని రంగప్రవేశం చేయించే పనిలో ఉందని ఉద్యోగులు వాపోతున్నారు. నేరుగా షిప్‌యార్డుకు ఇవ్వొద్దని కేంద్రంపై ఎల్‌అండ్‌టి అప్పట్లో ఒత్తిడి తెచ్చింది. వాస్తవానికి 2010లోనే షిప్‌యార్డుకు దక్కాల్సిన రూ.వేల కోట్ల కాంట్రాక్టు ఇది. షిప్‌యార్డును ఇండియన్ నేవీకి అవసరమైన యుద్ధనౌకల తయారీకి సిద్ధం చేసే క్రమంలో నేవీలో విలీనం చేసినప్పటిది ఈ ఆర్డర్. కానీ, 2014లో కేంద్రంలో బిజెపి సర్కారు వచ్చినప్పటి నుంచీ ఈ ఎఫ్ఎస్ఎస్‌ల కాంట్రాక్టును పెండింగులో పెట్టేసింది. కొన్నాళ్లపాటు ఎల్‌అండ్‌టి సంస్థ అయితే చేయగలదని షిప్‌యార్డుకు ఉద్దేశపూర్వకంగానే కేంద్రం ఈ కాంట్రాక్టును దక్కకుండా చేసింది. అయితే, నౌకా నిర్మాణ రంగంలో ప్రపంచంలోనే మూడో స్థానంలో ఉన్న హిందుస్థాన్ షిప్‌యార్డు 2022 ఆగస్టులో ఈ కాంట్రాక్టును దక్కించుకుంది. ఈ నేపథ్యంలో



విశాఖపట్నం హిందుస్థాన్ షిప్‌యార్డు

2023-2024 ఆర్థిక సంవత్సరంలో రూ.18 వేల కోట్ల మేర టర్నోవర్ గ్యారెంటీ అంటూ ఆ సంస్థ సిఎండి హేమంత్ ఖత్రీ ఆ సందర్భంగా ప్రకటించారు.

అంతలోనే ఏం జరిగింది?

కేంద్రం తాజా వాదనలు చూస్తే ఆశ్చర్య పడాల్సిందే. రూ.వేల కోట్ల కాంట్రాక్టు చేసేందుకు షిప్‌యార్డులో అధునాతన మౌలిక సదుపాయాలు లేవని, ప్రాథమిక పెట్టుబడి లేనందున కనీసం రెండు ఫ్లీట్ సపోర్టు షిప్ (ఎఫ్ఎస్ఎస్)లను ఎల్‌అండ్‌టి సంస్థకు కాంట్రాక్టులో భాగం చేయాలని పైనుంచి షిప్‌యార్డు అధికారులపై ఒత్తిడి వచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో హిందుస్థాన్ షిప్‌యార్డు అధికారుల్లో తాజాగా తర్జనభర్జన సాగుతోంది. ఎల్‌అండ్‌టికి ఎంట్రీ ఇస్తే షిప్‌యార్డుకు మనుగడ ఉండదని కేంద్రానికి తెలియజేసినట్లు సమాచారం.

షిప్ బిల్డింగ్‌కు ఆస్కారం లేదా?

విశాఖపట్నం షిప్‌యార్డులో నాలుగు స్లిప్ వేలు ఉన్నాయి. ఇవి నౌక తయారైన తర్వాత నీటిలోకి జారిపోయే యంత్ర పరికరాల వ్యవస్థ. ప్రస్తుతం రెండు సిద్ధంగా ఉన్నాయి. చాలా వరకూ ఈ స్లిప్‌వేలలో ఎక్విప్‌మెంట్ సక్రమంగా లేదు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అప్ గ్రేడేషన్ ఈ కాలంలో జరగలేదన్నది అధికారులు సైతం అంగీకరిస్తున్నారు. ఈ సాకుతో కేంద్రం ఎల్‌అండ్‌టిని రంగంలోకి దించేయడం సరైంది కాదని వారంటున్నారు. గడిచిన పదేళ్లలో షిప్‌యార్డుకు సరైన ఆర్డర్లు లేనందున స్లిప్ వేల దగ్గర ఇన్‌ఫ్రా సమకూర్చులేకపోయామని, బ్యాంకు నుంచి రుణానికి అవకాశం ఇవ్వాలని కేంద్రాన్ని వేడుకున్నా నిరాకరించిందని పలువురు ఉద్యోగులు చెబుతున్నారు. ఐదు ఎఫ్ఎస్ఎస్‌ల నిర్మాణ ఆర్డర్ కాంట్రాక్టు అంతా ఇండియన్ నేవీదే. ఈ కాంట్రాక్టు షిప్‌యార్డుకు దక్కిన రోజు నుంచే కాంట్రాక్టు అమల్లో ఉంటుంది. అంటే, రెండేళ్లలో మొదటి షిప్ నిర్మించి ఇవ్వాలి. ఆ తర్వాత ప్రతి ఎనిమిది నెలలకూ ఒక నౌకను ఇచ్చేయాలి. ఇలా ఏడేళ్లలో ఐదు ఎఫ్ఎస్ఎస్‌లు తయారు చేసి ఇవ్వాలి.

తగ్గిపోయిన వర్క్‌మెన్!

దేశంలోనే తొలి నౌకానిర్మాణ కేంద్రం 1941 జూన్‌లో విశాఖలో హెచ్ఎస్ఎల్‌గా ఏర్పాటైంది. 2010 వరకూ ఏడు వేల మంది మ్యాన్‌పవర్ (స్టాఫ్, వర్క్‌మెన్ కలిపి) ఉండేది. నేడు పర్మినెంట్ వర్కర్లు 370 మందే ఉన్నారు. నైపుణ్యంగల వారిలో ఎక్కువమంది రిటైరైపోయారు. షిప్‌యార్డులో అవుట్ సోర్సింగ్ మ్యాన్‌పవర్ 2000 ప్రస్తుతం ఉన్నా, నైపుణ్యంగల పనులు చేయలేరని అంటున్నారు. ఈ నేపథ్యంలో షిప్‌యార్డు యాజమాన్యం కూడా ఎల్‌అండ్‌టి అడ్డదారిలో ప్రవేశిస్తున్నా గట్టిగా వ్యతిరేకించకుండా మెత్తబడిందన్న చర్చ జరుగుతోంది. తొలుత రెండు ఎఫ్ఎస్ఎస్‌లతో ఎల్‌అండ్‌టి మొదలుపెట్టి మొత్తం ఐదు ఎఫ్ఎస్-ఎస్‌ల నిర్మాణం లాగేసుకుంటుందన్న అనుమానాలు తాజాగా వ్యక్తమవుతున్నాయి.

కలుస్తాం

- 'ఇండియా'కు కాస్త సమయమివ్వండి : వీవీప్యాట్‌లపై సీఈసీకి కాంగ్రెస్ నేత జైరామ్ రమేశ్ లేఖ

న్యూఢిల్లీ : వీవీప్యాట్‌ల విషయంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జైరామ్ రమేశ్ ప్రధాన ఎన్నికల అధికారి (సీఈసీ) రాజీవ్ కుమార్‌కు లేఖ రాశారు. వీవీప్యాట్‌లపై తమ అభిప్రాయాన్ని తెలియజేయటానికి ఇండియా కూటమి నాయకుల బృందానికి సీఈసీని, ఎన్నికల అధికారులను కలిసేందుకు అవకాశాన్ని కల్పించాలని కోరారు. ఇందుకు తమకు కొంత సమయం కేటాయించాలని పేర్కొన్నారు. కూటమి తీర్మానం ఆధారంగా వీవీప్యాట్‌ల ఉపయోగంపై సలహాలివ్వటానికి, చర్చించటానికి 'ఇండియా' పార్టీల నాయకులు ఈసీఐ అపాయింట్‌మెంట్ కోరారని లేఖలో ఆయన వివరించారు. " తీర్మానం కాపీని అందించటం, చర్చించటం కోసం ఈసీఐతో సమావేశం కావటానికి మేం ప్రయత్నిస్తున్నాం. కానీ ఇప్పటి వరకూ ఇది సఫలం కాలేదు" అని ఆయన పేర్కొన్నారు. "మిమ్మల్ని, మీ సహోద్యోగులను ముగ్గురు, నలుగురు సభ్యుల 'ఇండియా' బృందం కలవటానికి, వీవీప్యాట్‌లపై మా అభిప్రాయాన్ని తెలియజేయటానికి కొన్ని నిమిషాలు కేటాయించాలని నేను మరోసారి అభ్యర్థిస్తున్నాను" అని జైరాం రమేశ్ వివరించారు. ఎన్నికల్లో ఈవీఎంల పనితీరుపై 'ఇండియా' కూటమిలోని పలు పార్టీలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. అలాగే, వీవీప్యాట్‌లను వంద శాతం లెక్కించాలనే డిమాండ్‌ను సైతం అవి వినిపిస్తున్నాయి.

తిరస్కరిస్తే ఐసీయూలో చేర్చుకోరు

- రోగులు కానీ.. వారి కుటుంబీకులు కానీ నిరాకరిస్తే అంతే
- కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ కొత్త మార్గదర్శకాలు

న్యూఢిల్లీ: తీవ్ర అస్వస్థతకు గురైన రోగులను వారు (రోగులు), వారి కుటుంబీకులు, బంధువులు నిరాకరిస్తే ఆస్పత్రులు ఇంటెన్సివ్ కేర్ యూనిట్(ఐసీయూ)లో చేర్చుకోలేవని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఐసీయూ అడ్మిషన్‌లపై ఇటీవలి మార్గదర్శకాలలో పేర్కొన్నది. ఈ మార్గదర్శకాలను 24 మంది నిపుణులు సంకలనం చేశారు. తదుపరి చికిత్స సాధ్యం కానప్పుడు, అందుబాటులో లేనప్పుడు, అనారోగ్యంతో బాధపడుతున్న రోగులలో లేదా చికిత్స కొనసాగింపు ఫలితంపై, ముఖ్యంగా మనుగడపై ప్రభావం చూపకపోతే, ఐసీయూలో ఉంచటం వ్యర్థమైన సంరక్షణ అని నిపుణులు సిఫారసు చేశారు. అంతేకాకుండా, విపత్తు పరిస్థితిలో వనరుల పరిమితి ఉంటే.. రోగిని ఐసీయూలో ఉంచటానికి తక్కువ ప్రాధాన్యత ప్రమాణాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. రోగిని ఐసీయూలో చేర్చే ప్రమాణాలు అవయవ వైఫల్యం, అవయవ మద్దతు అవసరం, వైద్య పరిస్థితిలో క్షీణతను అంచనా వేయటంపై ఆధారపడి ఉండాలని మార్గదర్శకాలు పేర్కొన్నాయి. వీటితో పాటు మరికొన్ని మార్పులను ఈ మార్గదర్శకాలు తీసుకొచ్చాయి.

మణిపూర్‌లో అనుమానిత 'ఉగ్ర'దాడి

- నలుగురు కమాండోలు, ఒక బీఎస్ఎఫ్ జవానుకు గాయాలు

ఇంఫాల్ : మణిపూర్‌లోని తెంగ్నౌపాల్ జిల్లాలోని కుకీ-జోమి ఆధిపత్య సరిహద్దు పట్టణం మోరే సమీపంలో అనుమానిత ఉగ్రవాదుల దాడిలో భద్రతా దళాలకు చెందిన కనీసం ఐదుగురు గాయపడ్డారు. డిసెంబరు 30న పోలీసులపై మరో ఆకస్మిక దాడి జరగటంతో పట్టణంలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఆ తర్వాత పట్టణంలో కర్ఫ్యూ విధించారు. డిసెంబర్ 30న హింసాకాండలో పాల్గొన్నారనే ఆరోపణలపై ఇద్దరు వ్యక్తులను పోలీసులు పట్టుకున్న తర్వాత తాజా దాడి చోటు చేసుకోవటం గమనార్హం. మంగళవారం జరిగిన కాల్పుల్లో నలుగురు రాష్ట్ర పోలీసు కమాండోలు, సరిహద్దు భద్రతా దళానికి చెందిన ఒక సభ్యుడు గాయపడ్డారని పోలీసు అధికారి చెప్పారు. గాయపడిన వారిని రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో చికిత్స కోసం ఇంఫాల్‌కు విమానంలో తరలించినట్టు తెలిపారు. మణిపూర్‌లో మెయిటీ, కుకీ వర్గాల మధ్య మే ప్రారంభం నుంచి జాతి ఘర్షణలు జరుగుతున్నాయి. సంఘర్షణ ప్రారంభమైనప్పటి నుంచి 200 మందికి పైగా మరణించారు. దాదాపు 67,000 మంది ప్రజలు తమ ఇండ్లను విడిచిపెట్టవలసి వచ్చింది.

ఈడీ విచారణకు కార్తీ చిదంబరం

న్యూఢిల్లీ : ఒక మనీలాండరింగ్ కేసులో విచారణ కోసం మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ముందు కాంగ్రెస్ నాయకులు కార్తీ చిదంబరం హాజరయ్యారు. 2011లో కొంతమంది చైనా పౌరులకు అక్రమంగా వీసాలు మంజూరు చేశారనే అభియోగాలతో ఆయనపై మనీలాండరింగ్ కేసు నమోదైంది. సిబిఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ ఈ కేసు విచారణ చేస్తోంది. గత నెల 23న కూడా ఈ కేసులో కార్తీ చిదంబరాన్ని ఈడీ విచారించి, వాంగ్మూలాన్ని నమోదు చేసింది. మంగళవారం మళ్లీ సెంట్రల్ ఢిల్లీలోని ఈడీ ప్రధాన కార్యాలయంలో విచారణ అధికారి ఎదుట కార్తీ చిదంబరం హాజరయ్యారు.


263 మంది చైనా కార్మికులకు వీసా మంజూరు చేయడం కోసం కార్తీ రూ.50 లక్షల లంచం తీసుకున్నారని సీబీఐ ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. ఈ ఆరోపణలను కార్తీ ఖండిస్తున్నారు. తన ద్వారా తన తండ్రి, కేంద్ర మాజీ మంత్రి పి. చిదంబరాన్ని లక్ష్యంగా చేసుకోవడానికే ఈ కేసును నమోదు చేశారని ఆయన పేర్కొంటున్నారు. కార్తీ చిదంబరంపై ఇది మూడో మనీలాండరింగ్ కేసు. మిగిలిన రెండు కేసులను కూడా ఈడీనే విచారణ చేస్తోంది.

ఏపీ లోటు రూ.లక్ష కోట్లు

సతమతమవుతున్న ఆర్థికశాఖ

అమరావతి : సొంత ఆదాయం కన్నా మొత్తం వ్యయం భారీగా నమోదవుతుండడంతో రాష్ట్ర ఖజానాపై భారీ లోటు పడుతోంది. తొలి మూడు త్రైమాసికల్లో (డిసెంబరు వరకు) ఏకంగా రూ.లక్ష కోట్లకుపైగా లోటు రికార్డయింది. దీంతో కేంద్రం నుంచి వచ్చే కొద్దిపాటి నిధులతోపాటు, భారీగా సేకరిస్తున్న రుణాలతోనే కాలాన్ని నెట్టుకురావాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఇంత చేస్తున్నా నెల ఆరంభంలో వేతనాలు, పింఛన్లకు తీవ్ర ఇబ్బందులు నెలకొంటుండడంతో ఓవర్‌డ్రాఫ్ట్‌ను కూడా ఆశ్రయించాల్సి వస్తోందని ఆర్థికశాఖ అధికారులు వాపోతున్నారు.

తాజాగా వెలుగుచూసిన లెక్కలు మేరకు సొంత ఆదాయం, మొత్తం వ్యయంలో తొలి తొమ్మిది నెలల్లో రూ.1,05,412 కోట్లు లోటుగా తేలింది. రాష్ట్ర సొంత పన్నులు, ఇతర సొంత ఆదాయం రూ.60,626 కోట్లు మాత్రమే రికార్డు కాగా, వ్యయం మాత్రం ఏకంగా రూ.1,66,040 కోట్లుగా రికార్డు కావడంతో ఈ భారీ లోటు నెలకొందని అధికారులు చెబుతున్నారు. వ్యయాన్ని పరిశీలిస్తే మే నెల్లోనే రూ.26,576 కోట్లు ఖర్చు చేయగా, జూన్‌లో రూ.24,913 కోట్లు, ఏప్రిల్‌లో రూ.20,320 కోట్లు ఖర్చు చేసినట్లు తేలింది. ఆదాయ విభాగంలో జులై, సెప్టెంబర్, అక్టోబర్, డిసెంబర్ నెలల్లో తక్కువగా ఆదాయం వచ్చినట్లు తేలింది. దైనందిక అవసరాలు తీర్చుకునేందుకు కావాల్సిన ఆదాయం రాకపోవడంతో ఎక్కువగా ఓవర్‌డ్రాఫ్ట్‌లపైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంటోంది. గత నాలుగు నెలలుగా నెల ఆరంభం నుంచి నెలాఖరు వరకు కూడా మధ్యమధ్యలో ఓవర్‌డ్రాఫ్ట్‌కు వెళ్లాల్సి వస్తోందని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు.



నెలవారీ ఆదాయ వ్యయాల వివరాలు (రూ.కోట్లలో)

నెల	ఆదాయం	వ్యయం	లోటు
ఏప్రిల్	8,147	20,320	12,173
మే	6,386	26,576	20,190
జూన్	6,826	24,913	18,087
జులై	5,579	18,989	13,410
ఆగస్టు	6,299	15,515	9,215
సెప్టెంబర్	5,938	14,902	8,965
అక్టోబర్	5,491	14,578	9,086
నవంబర్	10,032	17,073	7,040
డిసెంబర్	5,928	13,174	7,246
మొత్తం	60,626	1,66,040	1,05,412

ఐదేండ్లలో 27 వేల ఎన్నికల బాండ్ల విక్రయం

విలువ రూ.16 వేల కోట్లు

న్యూఢిల్లీ : ఎన్నికల బాండ్ల పథకాన్ని ప్రారంభించిన 2018వ సంవత్సరం నుండి ఇప్పటి వరకూ రూ.15,946.30 కోట్ల విలువైన 27,133 బాండ్లను విక్రయించారు. సమాచార హక్కు చట్టం కింద రిటైర్డ్ కమాండర్ లోకేష్ బత్రా అడిగిన ప్రశ్నకు ఎస్‌బీఐ ఈ మేరకు సమాధానం అందించింది. విక్రయించిన బాండ్లలో రూ.15,922.42 కోట్ల విలువైన 26,939 బాండ్లను వివిధ పార్టీలు సొమ్ము రూపంలో తీసుకున్నాయని తెలిపింది. అత్యధికంగా కోటి రూపాయలు, ఆ పైన విలువ కలిగిన బాండ్లను ముంబయి ఎస్‌బీఐ శాఖ విక్రయించింది. అక్కడ 3.844 బాండ్లను అమ్మారు. ఆ తర్వాత 3,333 బాండ్లతో హైదరాబాద్ రెండో స్థానంలో, 2,844 బాండ్లతో కొల్‌కతా మూడో స్థానంలో ఉన్నాయి. విక్రయించిన బాండ్లలో రూ.23.88 కోట్ల విలువైన 194 బాండ్లను పార్టీలు సొమ్ము రూపంలో తీసుకోలేదు. దీంతో ఈ మొత్తాన్ని ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధికి బదిలీ చేశారు.

కాగా 30వ విడత ఎన్నికల బాండ్ల విక్రయం మంగళవారం ప్రారంభమైంది.



ఈ నెల 11 వరకూ ఇది కొనసాగుతుంది. జారీ అయిన తేదీ నుండి ఈ బాండ్లు 15 రోజుల పాటు చెల్లుబాటు అవుతాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. గడువు తీరిన తర్వాత బాండును బ్యాంకులో డిపాజిట్ చేసినప్పటికీ సంబంధిత రాజకీయ పార్టీకి ఎలాంటి చెల్లింపులు జరపరు. రాజకీయ పార్టీలు డిపాజిట్ చేసే ఎన్నికల బాండ్ మొత్తాన్ని అదే రోజు ఆ పార్టీ ఖాతాలో జమ చేస్తారు.